జిందగీ
11
నమస్తే తెలంగాణ హైదరాబాద్
సోమవారం 26 ఆగస్టు 2024
www.ntnews.com



ఏక శ్లోకీ భాగవతం

ఆదౌ దేవకిదేవి గర్భజననం గోపీ గృహేవర్ధనం
మాయాపూతన జీవితాపహరణం గోవర్ధనోద్ధారణమ్|
కంసచ్ఛేదన కౌరవాది హననం కుంతీసుతా పాలనం
హ్యేతద్భాగవతం పురాణకథితం శ్రీకృష్ణలీలామృతమ్|

రావయ్యా.. కృష్ణయ్యా!

దేవాదిదేవుడైన శ్రీకృష్ణుడు గోలోక బృందావనం నుంచి ఈ లోకానికి దిగివచ్చిన పర్వదినం శ్రీకృష్ణాష్టమి. సర్వ స్వతంత్రుడైన కృష్ణభగవానుడు ఎప్పుడు, ఎక్కడ అవతరించాలన్నది తానే నిర్ణయిస్తాడు. శ్రీమద్భాగవతం ప్రకారం, శ్రీకృష్ణుడు బ్రహ్మదేవుడి కాలగమనం ప్రకారం వారి ఒక్కరోజు పగటికాలంలో ఒక్కసారి మాత్రమే ఈ లోకంలో అవతరిస్తాడు. మానవుడి కాలగతిలో ఇది 432 కోట్ల సంవత్సరాలకు సమానం.

లీలా మనోహరుడైన నందలాల జన్మ దివ్యమైనది, అలౌకికమైనది. సకల లోకాలకూ ఈశ్వరుడైన శ్రీకృష్ణుడు ఈ లోకంలో అవతరించడానికి ఇక్కడి ప్రాపంచిక నియమాలను అనుసరించాల్సిన అవసరం లేదు. శ్రీకృష్ణుడు అవతరణ సమయంలో తన తల్లిదండ్రులైన దేవకీ వసుదేవులకు సర్వాభరణ భూషితుడైన విష్ణుమూర్తిగా తొలుత దర్శనమిచ్చాడు. తర్వాత దేవకీదేవి వినతిపై మానవ మాత్రుడైన పసివాడిలా రూపాంతరం చెందాడు. శ్రీకృష్ణుడి అసాధారణమైన ఈ ఆవిర్భావంలో ఆశ్చర్యపడాల్సిందేమీ లేదు. ఎందుకంటే, దేవదేవుని అవతరణ కేవలం వారి ఆంతరంగిక శక్తితో జరుగుతుంది కానీ, ఎలాంటి లౌకిక సదుపాయాలు, నియమాలపై ఆధారపడి ఉండదు.



ప్రాపంచిక వాస్తవాలను మనకు గుర్తు చేయడానికి, జనన-మరణాలను దాటించడానికే పరమాత్మ అవతరించాడు. శాశ్వతమైన, నిరంతరాయమైన ఆనందాన్ని పొందాలనే మనలోని కోరికను మనకు గుర్తుచేస్తూ, సనాతనమైన మన నిజ స్వరూప స్థితిని మనకు తెలిపేందుకే భగవానుడు అరుదెంచాడు. భగవద్గీత రెండో అధ్యాయంలో (2.13) అందరినీ ఆశ్చర్యపరుస్తూ, మనమంతా ఈ భౌతిక దేహాలం కాదని, ఆత్మ స్వరూపులమని శ్రీకృష్ణుడు వివరించాడు. ఆత్మస్వరూపులమైన మనమందరం శాశ్వతత్వం, నిరంతర ఆనందం, సంపూర్ణ జ్ఞానం కోసం తపిస్తున్నాం. కానీ, ఈ భౌతిక ప్రపంచం ఈ తపనలను తీర్చలేదు! అంటే, మనది కాని ఏదో పరాయి ప్రాంతంలో మనం ఉంటున్నట్టు మనకు అనిపిస్తుంటుంది. అంతర్జాతీయ హరేకృష్ణ ఉద్యమ వ్యవస్థాపకులైన ఆచార్య శ్రీల ప్రభుపాదుల వారు దీనిపై వివరిస్తూ, 'మన పరిస్థితి నీటిలో నుంచి బయటకొచ్చి నేలపై పడిన చేపలా ఉన్నద'ని అంటారు. చేప సంతోషం కోసం నేలపై దానికి ఎన్ని ఏర్పాట్లు చేసినా, అది సంతోషంగా ఉండలేదు.

భగవానుడి వాగ్దానం

లోకంలో అధర్మం ప్రబలి ధర్మం క్షీణించినప్పుడల్లా తాను అవతరిస్తానని శ్రీకృష్ణుడు భగవద్గీతలో వాగ్దానం చేశాడు. అయితే, కలహ, కల్మషాలతో కూడిన ప్రస్తుత యుగంలో కూడా శ్రీకృష్ణుడు అవతరించి తన వాగ్దానాన్ని నిలబెట్టుకున్నాడా అని ఎవరైనా అనుకోవచ్చు.

అదృష్టవశాత్తూ ఆ పరమాత్మ మన మధ్యే ఉన్నాడన్నది ఊరట కలిగించే విశేషం! ప్రస్తుత కలియుగంలో శ్రీకృష్ణుడు నామ రూపంలో అవతరిస్తాడని శాస్త్రాలు పేర్కొన్నాయి! 'కలికాలే నామ రూపే కృష్ణావతార' – ప్రస్తుత యుగంలో కృష్ణావతారం శబ్దరూపంలో ఉంటుంది. ఎవరైతే ఈ కృష్ణ నామాన్ని బిగ్గరగా జపిస్తారో, వారు కృష్ణావతార ప్రత్యక్ష సన్నిధానంలో ఉన్నట్టే! సర్వశక్తిమంతుడైన భగవంతుడు అసంఖ్యాకమైన రూపాలలో అవతరించగలడు. ఆ నామ రూపాన్ని ఆచార్య శ్రీల ప్రభుపాదుల వారు పరంపరానుగతమైన మహామంత్రంగా మనకు అందించారు. అదే..

హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే|
హరేరామ హరేరామ రామ రామ హరే హరే||

శ్రీకృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా ఈ మహామంత్రాన్ని సదా జపించి, ఆ పరంధాముడి దివ్యానుగ్రహాన్ని పొందుదాం.

... శ్రీమాన్ సత్యగౌర చంద్రదాస ప్రభూజి, 93969 56984

మేక కాదు పులి

ఉపనిషత్ వాక్యం

సద్గురు కటాక్ష లేశ విశేషేణ సర్వసిద్ధయః
సిద్ధంతి, సర్వబంధాః ప్రవినశ్యంతి
శ్రేయో విఘ్నాః సర్వే ప్రలయం యాంతి
సర్వాణి శ్రేయాంసి స్వయం ఏవ యాంతి
(త్రిపాద్విభూతి మహా నారాయణోపనిషత్తు 5)



'సద్గురు కటాక్షంతో అన్ని సిద్ధులూ కలుగుతాయి. బంధాలన్నీ నశిస్తాయి. విఘ్నాలన్నీ తొలగిపోతాయి. శ్రేయములన్నీ వరిస్తాయి. హృదయంలో పరమాత్ముడు సాక్షాత్కరిస్తాడు..' అని పై శ్లోకానికి భావం. పరమాత్మ సాక్షాత్కారానికి గురువు అనుగ్రహం ఎంత ముఖ్యమో చెబుతూ గురువైన తోతాపురి చెప్పిన కథ రామకృష్ణ పరమహంస ఇలా వివరించారు..

'ఒకసారి ఒక చూలాలైన ఆడపులి ఒక మేకల మందపై పడింది. అప్పుడే ఒక వేటగాడు బాణం వేశాడు. పులి ఒక పిల్లను ప్రసవిస్తూ చనిపోయింది. పులికూన మేకలమందలో కలిసిపోయింది. మేకలే పాలిచ్చి దాన్ని పెంచాయి. పులిపిల్ల మేకలతో కలిసి తిరగసాగింది. మేకలతో కలిసి గడ్డి మేసేది. మేకలతో పెరగడం వల్ల 'మే.. మే..' అనడం నేర్చుకుంది. అదే వాతావరణంలో పెరిగింది. ఏదైనా క్రూరజంతువు తరిమితే పులి భయంతో పారిపోయేది. ఒకసారి భయంకరమైన పులి మేకలమందపై దూకింది. పారిపోయే ఈ 'మేక-పులి'ని పట్టుకుంది అసలు పులి. అది వణికిపోయింది. పెద్దపులి దాన్ని నోట కరుచుకొని ఓ నీటి కొలను దగ్గరికి తీసుకుపోయింది. నీళ్లలో దాన్ని ప్రతిబింబాన్ని చూపుతూ.. 'నువ్వూ నాలాంటి పులివే! చూడు నాలాగే ఉన్నావు కదా!' అని నోటిలో మాంసం కుక్కింది. గడ్డికి అలవాటుపడిన 'మేక-పులి' మెల్లగా మాంసం రుచి చూసింది. తన నిజ స్వరూపాన్ని పోల్చుకోగలిగింది. పెద్ద పులివెంట అడవిలోకి పరుగుతీసింది.'


గురువు నీ నిజతత్త్వాన్ని తెలియజేస్తాడు. 'గడ్డి తినడం' అంటే, 'కామినీ కాంచనా'లలో మునిగితేలడం. 'మే..మే', అంటే పామరునిలా సంసారంలో మెలగడం. 'నీటిలో ముఖం చూసుకోవడం' అంటే ఆత్మతత్త్వాన్ని' అనుభూతి చెందడం. 'కొత్త పులిని అనుసరించడం' చైతన్యాన్ని మేల్కొల్పిన గురువును శరణు వేడటం.

... డా|| వెలుదండ సత్యనారాయణ



గోవర్ధన లీలలో బాలకృష్ణుడు దరిద్రనారాయణ- దీనజన సేవ, ఆర్తులను ఆదుకోవడమే పరమ ధర్మంగా ప్రకటించాడు. 'గో' అనగా ఆవు. గోవర్ధన మనగా గో సంరక్షణ, సంవర్ధనం. 'గో' అంటే భూమి. కృష్ణుడు అసురులను సంహరించి, అవనీభారం తొలగించి, ధరణిని ఉద్ధరించాడు. 'గో' శబ్దానికి వేదమని కూడా అర్థం. పరమాత్మ కనుమరుగవుతున్న వేద- సనాతన ధర్మాన్ని మనునట్లుగ ఉజ్జీవింప జేశాడు.'గో' అని ఇంద్రియానికి కూడా పేరు. అధోముఖంగా- యథా ప్రకారంగా ప్రపంచ పరంగా- విషయాల పట్ల ప్రవహించే ఇంద్రియ ధారను తన- పరమాత్మ వైపు మళ్లునట్లు చేశాడు గోవిందుడు. ఇదే గోవర్ధన లీలా పరమార్థం!

నంద పట్టికి గోవింద పట్టం



ఇంద్రదేవత పూజకన్న భాగవతేంద్రుని- భక్తవరుని పూజయే మిన్న అని ఈ గోవర్ధన లీలలో కన్నయ్య నిర్ణయం! శ్రీగిరిరాజైన గోవర్ధనుడు హరిదాసవర్యుడు- భక్తులలో శ్రేష్ఠుడు. భగవంతునికి చాల ఇష్టుడు. భగవల్లీలలో జడ- చేతన భేదం- తేడా పొడసూపదు. భగవత్పూజ లేక భాగవత పూజ- భక్తి సిద్ధాంత రీత్యా నిండైన ఈ రెండు విధాల పూజకే చెల్లుబాటు. సురపతి ఇంద్రుని మతిలో అసుర భావం- అహంకారం ముసురుకొంది. తన ఇష్టానికి- ఇష్టి (యాగాని)కి నష్టం వాటిల్లిందని రుష్టుడై, కోపావిష్టుడై దుష్టభావంతో అతడు అమాయక ప్రజలకు, పశువులకు నష్టం కలిగించాలని ఉపలవృష్టి- రాళ్లవాన కురిపించాడు. 'నక్రోధో న చ మాత్సర్యం..' కాని, భగవంతుని యందు, భక్తుని యందు రోషావేశాలు ఎప్పుడూ ఉండవు. ఇంద్రుడు గోజాతిని నశింప జేయ పూనగా ఉపేంద్రుడు కృష్ణచంద్రుడు 'గోవర్ధనుడు' దానిని రక్షించి వృద్ధి పరచాడు. అదృష్ట- పరోక్షమైన ఇంద్రుని కాక, దృష్ట- ప్రత్యక్షమైన దైవాన్ని పూజింప చేసి, పుణ్యాన్ని అందరికీ పంచిపెట్టాడు.

శుకముని అవనీపతితో- పరీక్షిత్ భూజానీ! గోవర్ధన గిరిని గొడుగుగా పైకెత్తి పట్టిన గోపాల శిరోమణి, గోప గోపీ రమణలను కని భయపడవద్దని ఊరడిస్తూ ఇలాగని పలికాడు.. గోప వనితలారా! కలత పడకండి. గోపకులారా! కొండల మందక- కలవరపడక మీమీ పసుల మందలతో వచ్చి మీకు నచ్చిన చోట ఈ కొండ క్రింద నిలవండి.

**శా|| 'బాలుండీతడు, కొండ దొడ్డది, మహాభారంబు సైరింపగా
జాలండో?యని దీనిక్రింద నిలువన్ శంకింపగా బోల, దీ
శైలాంభోనిధి జంతు సంయుత ధరా చక్రంబు పైబడ్డ నా
కేలల్లాడదు బంధులార! నిలుడీ క్రిందన్ ప్రమోదంబునన్'**

'ఓ బంధువులారా! ఈతడు బాలకుడు. ఈ కొండా! చాలా పెద్దది. కరవుతీర నిండా బరువైనది. మోయగలడో లేడో అని కింద నిలువడానికి సందేహించకండి. శైలాలు- కొండలు, సాగరాలు, సకల జంతుజాలంతో నిండిన ఈ ఇల- భూమండలమంతా మీదపడ్డా నాకేలు- చేయి చలించదు. ఇక మీకేల సంశయం? మీరందరూ ఆనందంగా దీని కింద చేరండి' ఇలా అన్న నందనందనుని పలుకులు గోపకులు మనఃస్ఫూర్తిగా నమ్మి బంధు, మిత్ర పరివార సహితంగా తమతమ తావులలో ఆవుదూడలతో పాటు నిలిచారు.

**మ|| 'హరి దోర్దండము గామ; గుబ్బ శిఖరం; బాలంబి ముక్తావళుల్
పరగన్ జారెడు తోయ బిందువులు; గోపాలాంగనాపాంగ హా
స రుచుల్ రత్న చయంబుగాగ; నచల ఛత్రంబు శోభిల్లె ద
ద్గిరి భిద్దుర్మద భంజియై జలధరా క్లిన్న ప్రజారంజియై'**

శుకుడు- రాజా! 'శ్రీహరి ధరించిన గిరి అనే గొడుగు కొండల రెక్కలను ఖండించిన ఆఖండలు- ఇంద్రుని దురహంకారాన్ని భంజిస్తూ, ప్రళయంకర జలదా(మేఘా)ల జలధారలకు విలవిల్లాడిన గోకుల వాసుల ఉల్లము (మనసు)లను రంజిల్ల జేస్తూ విరాజిల్లింది. ఆ కొండ గొడుగుకు నందగోకుల మండనుని భుజదండమే కర్ర. శిఖరమే గుబ్బ. శైలంపై నుంచి జారుతున్న జల బిందువులే దాని చుట్టూ వ్రేలాడుతున్న ముత్యాల జాలరులు. మందలోని ఇందువదన- గోపకాంతల క్రీగంటి చూపుల, మందహాసాల జిలుగులే రత్నాల వెలుగులు.' సాంగ రూపక అలంకార కలంకారీ కలితమైన పై లలిత మాతంగ- మత్తేభ వృత్తం పోతన మహాకవి అద్భుత కల్పనా జల్పితం- ఆభాషితం!

**క|| 'వడిగొని బలరిపు పనుపున
నుడుగక జడిగురిసె నేడహోరాత్రము, ల
య్యెడ గోపజనులు బ్రదికిరి
జడి దడియక కొండ గొడుగు చాటున నధిపా!'**

రాజా! 'బిడౌజు (ఇంద్రు)ని ఆనతిచే ఎడతెరపి లేక ఏడు అహోరాత్రాలు జోరున జడివాన కురిసింది. ఆ అచలచ్ఛత్రం- కొండ గొడుగు అండన గొల్లలెల్లరూ ఏమాత్రం దడవ(భయపడ)కుండా, కుండపోత వాన వాత పడకుండా- తడవకుండా మనగలిగారు.'

గోవర్ధననాథుని దివ్య స్వరూపం గోకుల బృందావన వాసులకు ఏడు దినాల వరకు అనామయం- దేహం మీద ధ్యాస లేకుండా చేసింది. అటుపై ఆకలి దప్పికలనూ మటుమాయం కావించింది. ఈ మాదిరి- తీరున, సప్త వాసరాలు కరివరదుడు, మందరగిరిధారి హరి గోవర్ధనగిరిని ధరించి నందవ్రజ ప్రజల ఆర్తిని హరించాడు. విసిగి వేసారిన వాసవుడు- ఇంద్రుడు వాసుదేవుని భాసుర వీరచరితం కని విని అభాసు(నవ్వుల) పాలయ్యాడు. తన మనోరథం వ్యర్థం కాగా మేఘాలను మరలించుకొని తరలిపోయాడు. వాన వెలియగానే గగనాన భానుని ప్రభ కానవచ్చింది. కొండ కింద ఉన్న మంద(వ్రజ) వాసులను తమ ఆలమందలతో వెలుపలికి రమ్మని ఆనతీయగా అందరూ వెడలివచ్చారు. అంతట, బాలకృష్ణుడు శైలాన్ని దించి యథాస్థానంలో ఉంచాడు. ఈ నల్లవాడు తమను చల్లగా కాపాడినాడని వల్లవులు- గొల్లలెల్లరూ పల్లవించిన ఉల్లములతో బాలకృష్ణుని పలువిధాల ప్రశంసించారు. కాలరూపుని అచ్యుతుని ఆలింగనం చేసుకొని ఆశీర్వదించారు. నంద యశోదాదులు నందనుని పరమానందంతో అక్కున జేర్చుకొని పెక్కు శుభవాక్యాలు వక్కాణించారు. ఆకాశ సంచారులు విరులు కురియించారు. సురులు శంఖాలు, దుందుభులు మ్రోగించారు. అంబర వీధిలో తుంబురాది గంధర్వులు సంబరపడుతూ పాడారు. నల్లనయ్య గొల్లలతో గోవులతో కూడి మెల్లగా గోష్ఠం- వ్రేపల్లె చేరాడు.

రాజా! అనంతరం, బాలగోపాలుని లీలా విలాసాలు అలపిస్తూ గోపాల జనం చాల విస్మయపడి నందరాజుతో ఇలా విన్నవించుకున్నారు..

**క|| ఏడేండ్ల బాలుడెక్కడ?
క్రీడం గరి తమ్మి యెత్తుక్రియ నందఅముం
జూడ గిరి యెత్తుటెక్కడ?
వేడుక నొకకేల నేడు వెఱగొ గాదే?...**

'ఏడేళ్ల పిల్లవాడెక్కడ? ఏనుగు అరవిందా(పద్మా)న్ని ఎత్తిన చందంగా, మనమందరం చూస్తూండగా, అందంగా అద్రి (కొండ)ని భద్రంగా పైకెత్తడమెక్కడ? ఇది ఎంత వింత? గోపనాయకా! నందా! నీ పాపడు మానవమాత్రుడు కాడయ్యా! సాక్షాత్ మాధవుడయ్యా!' అంటూ కృష్ణుని, విష్ణు అవతారమని ఎంచి సేవించారు.

హరి ఒక కేల- చేతితో లీలగా శైలాన్ని ఎత్తిపట్టి తాను (ఇంద్రుడు) ఆకుల పరచిన- కలవరపెట్టిన గోకులాన్ని కాపాడినాడని విని నాకపతి పాకశాసనుడు పశ్చాత్తాపపు కాక (వేడిమి)తో పరితపించాడు. త్రిలోకపతిననే అహంకారానికి తిలోదకాలిచ్చి ఆ గిరిభిత్తు- ఇంద్రుడు అణకువతో సురభిని- కామధేనువుని ముస్నిడుకొని అమరావతి నుంచి అరుదెంచాడు. దుష్టులైన మానవేంద్రుల దురహంకార, దురితాలను దూరీకరించు వాడు, అపార కరుణానిధి అయిన నందనందనుని సందర్శించి, ఆయన పాదారవిందాలను సేవించాడు. అంజలి ఘటించి అమర ప్రభువు, ఆపన్న ప్రపన్నుడు కంజదళాక్షునితో ఇలా విన్నవించుకొన్నాడు.. అనంతా! ఒక్కొక్క లోకాన్నీ పాలిస్తూ- చక్కబరుస్తూ, మిక్కిలి మదంతో నిక్కుతూ, నీలుగుతూ నిఖిలానికీ నేనే ప్రభువునని ఒడలు మరచి మసలుకొనే నావంటి జడులు- ఉన్మాదులు నిజంగా నీ మహిమను తెలియనేరరు.

**ఆ|| 'వాసుదేవ! కృష్ణ! వరద! స్వతంత్ర! వి
జ్ఞానమయ! మహాత్మ! సర్వపుణ్య
పురుష! నిఖిల బీజ భూతాత్మక బ్రహ్మ!
నీకు వందనంబు నిష్కళంక!'**

'వసుదేవనందనా! నీకు వందనాలు. వాసుదేవా! నీ దాసుణ్ని. అపరాధిని, తప్పు సైరించి నన్ను మన్నించు.' వాసవుని వాక్కులు విని వాసుదేవుడు దరహాసం చిందిస్తూ, మేఘ గంభీరమైన అమోఘ ఘోషతో ఇలా పలికాడు- 'సురేశ్వరా! సంపదచే కన్ను మిన్ను కానక నీవు నన్ను కూడ కానకున్నందున, నీ మదాతిరేకం రూపు మాన్పడానికే ఈ నీ యాగాన్ని నేను మానిపించాను. ఐశ్వర్యం వల్ల మత్తిల్లిన- మదించిన వారు దండ ధారినైన నా ఊసెత్తరు. ఓ వాసవా! వాస్తవంగానే నేనెవణ్ణి రక్షింప దలుస్తానో, వానిని ఇలా శిక్షిస్తా- వాణ్ని ధనహీనునిగా చేస్తా. సితకరిగమనా- ఓ ఐరావత వాహనా! నీ అల్ప ప్రభుత- అధికారంతో అనల్పంగా గర్వించకు. నా ఆనతి నిర్వర్తిస్తూ నీ అధికారం నిలుపుకో. నీకు శుభమగు గాక! వెళ్లిరా.' రాజా! గోగణంతో కూడి ఉన్న కామధేనువు- సురభి, భక్తజన కామధేనువైన దామోదరునికి ప్రణమిల్లి ఇలా పలికింది..

**క|| విశ్వేశ! విశ్వభావన!
విశ్వాకృతి! యోగివంద్య! విను నీ చేతన్
శాశ్వతుల మైతి మిప్పుడు
శాశ్వతముగ గంటి మధిక సౌఖ్యంబు హరీ!**

'విశ్వేశ్వరా! విశ్వకల్యాణ మూర్తీ! విరాడ్రూపా! పరమ యతీశ్వరులచే నుతింపబడువాడా! నా విన్నప మాలకించు. నీ అనుగ్రహం చే మేమిప్పుడు శాశ్వతులం- శుభ చిత్తులమయ్యాం. మాకు సుస్థిరమైన గొప్ప సౌఖ్యం సమకూరింది.' దేవా! నీవే మాకు పరమదైవం, ప్రభువు. సర్వలోక సౌఖ్యం కొరకు నీకు పట్టం కట్టమని నీటి పుట్టుగు పట్టి- బ్రహ్మదేవుడు నన్ను నియమించి పంపాడు. ఓ గిరిధారీ! నీవే ఈ భూభారాన్ని నివారించడానికి అవతరించిన శ్రీహరివి. శుకుడు- రాజా! అనంతరం అమర ప్రభువు, దేవమాత అదితి మరియు మహర్షుల సమక్షంలో, కామధేనువు క్షీరంతో, ఐరావతం తన శుండాలం- తొండంతో కొని తెచ్చిన దివ్య ధునీ (గంగా) జలాలతో- రణరంగంలో విపక్షులను శిక్షించువాడు, సాధు సంరక్షకుడు అయిన జలజాక్షుని, గోవులకు గోపకులకు అధిపతిగా 'గోవిందుడు' అని నామకరణం చేసి అభిషేకించాడు. పావనమైన ఆ పాలు, గంగాజలాలు నిలిచిన ప్రదేశం నేటికీ 'సురభికుండం'గా ప్రశస్తి పొందుతోంది. (సశేషం)




తంగిరాల రాజేంద్రప్రసాద శర్మ
98668 36006

కోపాన్ని గెలుద్దాం

ఇస్లాం బోధ

వల్ కాజిమీనల్ గైజ
వల్ ఆఫీన అనిన్నాసి
వల్లాహు యుహిబ్బుల్ ముహ్ సినీన్
(ఖురాన్ 3:134) కోపాన్ని నిగ్రహించుకునేందుకు ఈ వాక్యాన్ని పదేపదే చదవాలని ఉలమాలు చెబుతుంటారు. మనిషికి కోపం రావడం సహజం. కానీ, ఆ కోపం ఎన్నో అనర్థాలకు దారితీస్తుంది. రక్తసంబంధాలను దెబ్బతీస్తుంది. కోపంలో నోరు జారే మాటలు మనవాళ్లను దూరం చేస్తాయి. కోపానికి గురైన ప్రతిసారీ ఏదో ఒక నష్టం తప్పదు. కోపం ఎన్నో మానసిక, శారీరక రుగ్మతలకు కారణం అవుతుంది. ఇలా ఎన్నో కష్టనష్టాలు కలుగజేసే కోపాన్ని అణచుకోవాలని ఖురాన్ పేర్కొన్నది. 'కోపాన్ని దిగమింగేవారు, ఇతరుల తప్పులను క్షమించేవారు.. ఇలాంటి సజ్జనులంటే అల్లాహ్‌కు ఎంతో ప్రీతి'– అని పై ఖురాన్ వాక్య భావం.



అల్లాహ్ మీద భయభక్తులు కలవారు ఎదుటివారిని కోపగించుకోరాదు. యుద్ధ మైదానంలో శత్రువులను చిత్తుచేసేవాడు కాదు వీరుడు, కోపాన్ని అణచివేసుకున్నవాడే ధీరుడు అంటారు ప్రవక్త (స). కోపం షైతాను ద్వారా వస్తుంది. షైతాన్ అగ్ని స్వరూపుడు. అందుకే కోపం వచ్చినప్పుడు మంచినీళ్లు తాగాలని ప్రవక్త (స) చెప్పారు. నిల్చుని ఉన్నప్పుడు కోపం వస్తే కాసేపు కూర్చోవాలనీ, కూర్చుని ఉన్నప్పుడు ఆగ్రహం వస్తే.. పడుకోవాలని సూచించారు. 'కోపం వచ్చినప్పుడు కూడా క్షమించేవారి కోసం అల్లాహ్ దగ్గర శ్రేష్ఠమైన సుఖ సౌఖ్యాలు ఉన్నాయ'ని ఖురాన్ చెబుతున్నది.

... ముహమ్మద్ ముజాహిద్
96406 22076

ప్రభువు కోరుకున్నది..

క్రీస్తు సందేశం

వెయ్యిమందిలో కూర్చున్నా క్రైస్తవుని గుర్తుపట్ట గలిగినపుడే.. అతని క్రైస్తవ్యానికి ధన్యత. క్రీస్తు కోరుకున్నది, పరిపూర్ణ క్రైస్తవ్యం వాంఛించిందీ ఇదే! ప్రభువును అనుసరించడమే క్రైస్తవ్యం. క్రీస్తు అంటే ఆషామాషీ పదం కాదు. అది ప్రేమకు, త్యాగానికి సంకేతం. క్రీస్తు తోటివాణ్ని ప్రేమించడానికి ఆనవాలు. ఆయన్ను అనుసరించడం, అనుకరించడం మామూలు విషయం కాదు. కష్టంతో కూడుకున్నదే. క్రీస్తు అనగానే సిలువ కనిపిస్తుంది. సిలువపై కొన ఊపిరితో కొట్టిమిట్టాడుతూ వేలాడే ప్రభువు కనిపిస్తాడు. మరణిస్తున్న సమయంలో క్రీస్తు ఇచ్చే సందేశాలు సుఖతరంగా ఉండవు. ఆనందంగా చెప్పుకొనేవీ కావు. అటువంటి క్రీస్తులా ప్రవర్తించేవాడే నిజమైన క్రైస్తవుడు. క్రీస్తు సందేశాన్ని తన ప్రవర్తనతోనే నిర్వచిస్తూ, ఆ సూక్తిని మోసుకుపోయి లోకానికి అందించేవాడు క్రైస్తవుడు. లేకపోతే అతను అన్యుడే. క్రైస్తవుడనని చెప్పుకోవడానికే అనర్హుడే. హింసలు భరించడం తప్ప ఎదురు తిరిగి ప్రతిదాడి చేయడం కోరుకోనిది క్రైస్తవం. దేవుణ్ని పరిపూర్ణంగా పూజించాలని ఎంత గాఢంగా చెబుతుందో, అంతే మోతాదులో సాటివాణ్ని ప్రేమించాలని క్రైస్తవం ఆజ్ఞాపిస్తుంది. అంటే, దైవారాధన.. ప్రేమగా పరిణామం చెందాలన్నమాట. మనల్ని మనం ప్రేమించుకున్నట్టే, మరొకరిని ప్రేమించాలి! అదే ప్రభువు బోధించినది. క్రైస్తవం కోరుకున్నది.

... ప్రొ||బెర్నార్డ్ రాజు, 98667 55024

ఎమ్మెల్యేలకు 100 కోట్ల ఆఫర్!

- కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీజేపీ ప్రయత్నాలు
- ఎమ్మెల్యే రవికుమార్ ఆరోపణ

మాండ్య, ఆగస్టు 25: కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే రవికుమార్ గౌడ బీజేపీపై మరోసారి సంచలన ఆరోపణలు చేశారు. రాష్ట్రంలోని తమ ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీజేపీ 'ఆపరేషన్ కమలం'తో ప్రయత్నాలు చేస్తున్నదని, కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టేందుకు రూ.100 కోట్లు ఆఫర్ చేస్తున్నదని అన్నారు. అయితే బీజేపీ కుట్రలు ఫలించవని, తమ ప్రభుత్వం స్థిరంగా, బలంగా ఉన్నదని చెప్పుకొచ్చారు. మాండ్యలో ఆదివారం ఎమ్మెల్యే రవికుమార్ గౌడ మాట్లాడుతూ ఎమ్మెల్యేల కొనుగోలు కోసం బీజేపీ డబ్బుల ఆఫర్‌ను రూ.50 కోట్ల నుంచి రూ.100 కోట్లకు పెంచిందన్నారు. రెండు రోజుల క్రితం తనకు ఓ వ్యక్తి ఫోన్ చేశాడని, రూ.100 కోట్లు సిద్ధంగా ఉన్నాయంటూ ప్రలోభపెట్టే ప్రయత్నం చేశాడని పేర్కొన్నారు. 50 మందిని కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఆ వ్యక్తి చెప్పాడని తెలిపారు. తమ ప్రభుత్వాన్ని కూలగొట్టేందుకు బీజేపీ ప్రతి రోజూ కుట్రలు చేస్తూనే ఉన్నదని, ఆ పార్టీ 'బ్రోకర్లు' తమ ఎమ్మెల్యేలను సంప్రదిస్తున్నారని అన్నారు. తనకు ఫోన్ చేసిన వ్యక్తి ఆడియో తన వద్ద ఉన్నదని, మిగతా ఆధారాలు కూడా సేకరించి ఈడీ, సీబీఐలకు ఇస్తామన్నారు. డబ్బు సంచులతో వారిని పట్టుకోవాలని అనుకొంటున్నామని తెలిపారు.

వాళ్లంతా ఒక గ్యాంగ్!

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్, కేంద్ర మంత్రులు శోభా కరంద్లాజే, ప్రహ్లాద్ జోషి, హెచ్‌డీ కుమారస్వామిలు ఒక 'గ్యాంగ్'గా పనిచేస్తున్నారని ఎమ్మెల్యే రవికుమార్ గౌడ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలుస్తామని వీరంతా ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షాలకు హామీ ఇచ్చారని, ఆ లక్ష్యంతోనే పనిచేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు ఎర వేసేందుకు ఒక టీమ్ ప్రయత్నించిందని, రూ.50 కోట్ల డబ్బుతో పాటు మంత్రి పదవులు ఆఫర్ చేసిందని గత ఏడాది అక్టోబర్‌లో రవికుమార్ గౌడ చెప్పారు. నలుగురు ఎమ్మెల్యేలను ఈ విధంగా సంప్రదించారని, ఈ మేరకు తన వద్ద ఆధారాలు ఉన్నాయని పేర్కొన్నారు.

ఖర్గే ట్రస్టుకు భూసంతర్పణ

మొదటిపేజీ తరువాయి...



కేటాయించిందనే ఆరోపణలు వస్తున్నాయి. రాష్ట్ర రాజధాని బెంగళూరుకు సమీపంలోని హైటెక్ డిఫెన్స్ ఏరోస్పేస్ పార్క్‌లో కర్ణాటక ఇండస్ట్రియల్ ఏరియా డెవలప్‌మెంట్ బోర్డు(కేఐఏడీబీ)కి చెందిన 5 ఎకరాలను కేటాయించారన్న వ్యవహారం రాష్ట్ర రాజకీయాల్లో మరో సంచలనంగా మారింది. ఈ వ్యవహారానికి సంబంధించి బీజేపీ రాజ్యసభ ఎంపీ లహర్ సింగ్ సిరోయా ఆదివారం పలు ఆరోపణలు చేశారు. కేఐఏడీబీకి చెందిన మొత్తం 45.94 ఎకరాల్లో ఖర్గే ట్రస్టుకు 5 ఎకరాలు కేటాయించారని ఆయన పేర్కొన్నారు. కేఐఏడీబీ భూమిని పొందేందుకు ఖర్గే కుటుంబం ఏరోస్పేస్ ఆంత్రప్రెన్యూర్లుగా ఎప్పుడు మారిందని ప్రశ్నిచారు. ఈ వ్యవహారంలో భారీస్థాయిలో అక్రమాలు చోటుచేసుకొన్నాయని అనుమానాలు వ్యక్తం చేశారు.

ఏ విధంగా ఆమోదించారు?

'సిద్ధార్థ విహార ట్రస్టు'లో ట్రస్టీలుగా ఖర్గేతో పాటు ఆయన భార్య రాధాభాయ్, కుమారులు ప్రియాంక్ ఖర్గే(రాష్ట్ర మంత్రి), రాహుల్ ఖర్గే, అల్లుడు రాధాకృష్ణ(గుల్బర్గా ఎంపీ) తదితరులు ఉన్నారని ఎంపీ లహర్ సింగ్ తన ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. ప్రజల సౌకర్యాల కోసం ఉద్దేశించిన భూమిని ట్రస్టు ఎస్సీ కోటా కింద పొందిందని ఆయన ఆరోపించారు. ఇది అధికార దుర్వినియోగం, బంధుప్రీతి కాదా? అని ప్రశ్నించారు. ఈ ఏడాది మార్చిలో జరిగిన ఈ కేటాయింపునకు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి ఎంబీ పాటిల్ ఏ విధంగా ఆమోదం తెలిపారని ప్రశ్నించారు. ఈ అక్రమ భూ కేటాయింపు వ్యవహారం ఒక ఆర్టీఐ కార్యకర్త ద్వారా గవర్నర్ కార్యాలయానికి కూడా చేరిందని ఆయన పేర్కొన్నారు. ఈ అక్రమ భూ కేటాయింపుపై విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు.



హెజ్బొల్లా డ్రోన్‌ను ధ్వంసం చేస్తున్న ఇజ్రాయెల్ ఆర్మీ రాకెట్



ఇజ్రాయెల్ రాకెట్ దాడులతో లెబనాన్ సరిహద్దుల్లో కమ్ముకొన్న పొగ, మంటలు

మళ్లీ భగ్గుమన్న పశ్చిమాసియా

- హెజ్బొల్లా, ఇజ్రాయెల్ పరస్పర దాడులు
- 100 ఫైటర్ జెట్లతో లెబనాన్‌లోని హెజ్బొల్లా స్థావరాలపై విరుచుకుపడ్డ ఇజ్రాయెల్ సైన్యం
- వందల రాకెట్లు, డ్రోన్లు ప్రయోగించిన హెజ్బొల్లా
- ఇజ్రాయెల్‌లో 48 గంటలపాటు ఎమర్జెన్సీ

జెరూసలేం, ఆగస్టు 25: పశ్చిమాసియా మళ్లీ భగ్గుమంది. లెబనాన్‌లోని హెజ్బొల్లా మిలిటెంట్ గ్రూపు, ఇజ్రాయెల్ పరస్పర దాడులతో ఈ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో ఇప్పటికే కొనసాగుతున్న ఇజ్రాయెల్- హమాస్ యుద్ధం మరింత విస్తరించే అవకాశం ఉందన్న భయాందోళనలు నెలకొన్నాయి. గత నెలలో తమ టాప్ కమాండర్ హత్యకు ప్రతీకారంగా ఇజ్రాయెల్ భూభాగంపైకి వందలాది సంఖ్యలో రాకెట్లు, డ్రోన్లను ప్రయోగించినట్టు హెజ్బొల్లా గ్రూపు ప్రకటించింది. ఉత్తర ఇజ్రాయెల్, గోలన్ హైట్స్‌లోని ఆ దేశ సైనిక స్థావరాలు, ఐరన్ డోమ్ లక్ష్యంగా చేసుకొని 320 కత్యూషా రాకెట్లు, భారీ సంఖ్యలో డ్రోన్లను ప్రయోగించినట్టు వెల్లడించింది. ప్రతీకార మొదటి దశ దాడులను ముగించామని, భవిష్యత్తులో మరిన్ని దాడులు ఉంటాయని పేర్కొన్నది. డ్రోన్లు 11 టార్గెట్లను నాశనం చేశాయని హెజ్బొల్లా పేర్కొన్నది. హెజ్బొల్లా దాడులను అడ్డుకొనేందుకు దక్షిణ లెబనాన్‌లోని వేలాది రాకెట్ లాంచర్లను లక్ష్యంగా చేసుకొని దాదాపు 100 యుద్ధ విమానాలు వైమానిక దాడులు చేశాయని ఇజ్రాయెల్ పేర్కొన్నది. దాదాపు ఉదయం 10 గంటల సమయానికి ఈ రెండు వైపుల దాడులు అగినప్పటికీ, పరిస్థితులు ఉద్రిక్తంగానే ఉన్నాయి. కేవలం సైనిక స్థావరాలే లక్ష్యంగా దాడులు చేసినట్టు హెజ్బొల్లా గ్రూపు, ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించాయి. ఇజ్రాయెల్ దాడుల్లో ముగ్గురు మరణించారని, ఇద్దరికి గాయాలయ్యాయని లెబనాన్ అధికారులు పేర్కొనగా, స్వల్ప నష్టం జరిగినట్టు అంచనా వేస్తున్నామని ఇజ్రాయెల్ సైనిక అధికార ప్రతినిధి ఒకరు పేర్కొన్నారు. కాగా, హెజ్బొల్లా వద్ద దాదాపు 1,50,000 రాకెట్లు ఉన్నాయని, ఇజ్రాయెల్‌లోని అన్ని ప్రాంతాలపై దాడులు చేయగల సామర్థ్యం ఆ గ్రూపునకు ఉన్నదని ఒక అంచనా.

ఎయిర్‌పోర్టు మూసివేత.. సర్వీసుల మళ్లింపు

హెజ్బొల్లా దాడుల నేపథ్యంలో ఉత్తర ఇజ్రాయెల్‌లో ఎయిర్ రైడ్ సైరన్లు మోగాయి. బెన్-గురియోన్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని మూసివేశారు. దాడి ముప్పు నేపథ్యంలో గంట పాటు విమానాలను దారి మళ్లించారు. బాంబ్ షెల్టర్లకు సమీపంలో ఆశ్రయం తీసుకోవాలని ఇజ్రాయెల్ హోం ఫ్రంట్ కమాండ్ ప్రజలకు సూచించింది. ఇజ్రాయెల్-హమాస్ మధ్య గత 10 నెలలుగా సాగుతున్న యుద్ధానికి ముగింపు పలికేందుకు మరో దఫా చర్చలను ఈజిప్టు నిర్వహిస్తున్న సమయంలో ఈ పరస్పర దాడులు చేసుకోవడం గమనార్హం.

ఇజ్రాయెల్‌లో 48 గంటల ఎమర్జెన్సీ

తాజా పరిణామాల నేపథ్యంలో ఇజ్రాయెల్‌లో 48 గంటల పాటు దేశవ్యాప్త ఎమర్జెన్సీ విధిస్తున్నట్టు ఆ దేశ రక్షణ శాఖ మంత్రి యోవ్ గాల్లంట్ ఆదివారం ప్రకటించారు. ఉదయం 6 గంటల నుంచి ఇది అమల్లో ఉంటుందని తెలిపారు. సైన్యం కీలక నిర్ణయాలు తీసుకొనేందుకు, ప్రజలు గూమిగూడకుండా నియంత్రించేందుకు ఈ చర్య చేపట్టినట్టు అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఇజ్రాయెల్ పౌరులపై దాడులు చేసేందుకు హెజ్బొల్లా ప్రణాళికలు వేసిందని అంతకుముందు ఐడీఎఫ్ అధికార ప్రతినిధి డానియెల్ హగని పేర్కొన్నారు.



ప్రతిదాడులు తప్పవు: నెతన్యాహూ

తాజా పరిణామాల నేపథ్యంలో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ క్యాబినెట్ సమావేశం నిర్వహించారు. ఉత్తర ఇజ్రాయెల్‌పైకి ప్రయోగించిన వేలాది రాకెట్లను సైన్యం అడ్డుకొన్నదని ఆయన పేర్కొన్నారు. సైన్యం సూచనలను పాటించాలని పౌరులను కోరారు. 'మా దేశాన్ని రక్షించుకొనేందుకు అన్ని చర్యలు తీసుకొంటాం. మాపై ఎవరు దాడి చేస్తారో, వారిపై మేం దాడి చేస్తాం అనే సాధారణ నియమాన్ని పాటిస్తున్నాం' అని స్పష్టం చేశారు.

హెజ్బొల్లా అమ్ములపొదిలో 'కత్యూషా'

హెజ్బొల్లా గ్రూపు అమ్ములపొదిలో 'కత్యూషా' అనేది ప్రధాన ఆయుధంగా ఉన్నది. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో సోవియట్లు దీన్ని తయారు చేశారు. ఈ రాకెట్‌కు కత్యూషా అనే పేరు ఓ యుద్ధ పాట నుంచి వచ్చింది. కత్యూషా రాకెట్లు భారీ వార్ హెడ్‌లను సుదూర లక్ష్యాలపైకి ప్రయోగించగలవు. ఏకకాలంలో వందల సంఖ్యలో వీటిని ప్రయోగించే అవకాశం ఉండటంతో శత్రు లక్ష్యాలను నాశనం చేయగలవు. వీటిని కొన్ని రకాల రహస్య లాంచర్లపై ఉంచి గుర్తు తెలియని ప్రదేశాల నుంచి హెజ్బొల్లా ప్రయోగిస్తుంది. 2006లో లెబనాన్ యుద్ధంలో వీటిని భారీయెత్తున వినియోగించారు.



నీట్ పీజీ ఫలితాలు వివాదాస్పదం

- అంచనాలకు పర్సెంటైల్స్‌కు మధ్య పొంతన శూన్యం
- అభ్యర్థుల ర్యాంకులు, రోల్ నంబర్ల మధ్య తేడాలు
- పరీక్ష పారదర్శకతపై తీవ్రమైన అనుమానాలు

న్యూఢిల్లీ: నీట్ పీజీ-2024 ఫలితాలు ఆశావహులకు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. చాలా మంది అభ్యర్థుల ఫలితాల్లో గణనీయమైన తేడాలు కనిపించడమే ఈ ఆందోళనకు కారణం. అంచనాల కంటే తమ పర్సెంటైల్స్ చాలా అధికంగా ఉన్నాయని, అసలు ఈ రెండింటికీ పొంతనే లేదని కొందరు విద్యార్థులు చెప్తుంటే.. నీట్ పీజీ ర్యాంకుకు సంబంధిత అప్లికేషన్ ఐడీ లేదా రోల్ నంబర్‌కు మధ్య తేడాలు ఉన్నట్టు మరి కొందరు చెప్తున్నారు. మరోవైపు షిఫ్ట్-2లో పరీక్షకు హాజరైన పలువురు అభ్యర్థులకు మార్కులు గణనీయంగా తగ్గడం ఈ పరీక్ష పారదర్శకతపై తీవ్రమైన అనుమానాలను రేపుతున్నది. నీట్ పీజీ కటాఫ్‌ను ఎన్‌బీఈఎంఎస్ ఇంకా విడుదల చేయకపోవడం, ఆన్సర్స్ కీ లేదా జవాబు పత్రాలతోపాటు ఈ పరీక్షకు సంబంధించిన ఎలాంటి కంటెంట్‌ను షేర్ చేయబోమని ఎన్‌బీఈఎంఎస్ గతంలోనే స్పష్టం చేయడం విద్యార్థుల్లో ఆందోళనను మరింత పెంచుతున్నది. ఈ ఆందోళనకు తెరదించి నీట్ పీజీ ప్రవేశ పరీక్షపై విశ్వాసాన్ని పునరుద్ధరించేందుకు ఎన్‌బీఈఎంఎస్ పారదర్శకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉన్నదని విద్యార్థులతోపాటు వైద్యులు, నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

పారిస్‌లో టెలిగ్రామ్ సీఈవో

పావెల్ దురోవ్ అరెస్టు

ఎయిర్‌పోర్ట్‌లో దిగగానే అదుపులోకి!

పారిస్: ప్రముఖ మెసేజింగ్, ఆడియో కాలింగ్ యాప్ 'టెలిగ్రామ్' వ్యవస్థాపకుడు, సీఈవో పావెల్ దురోవ్‌ను ఫ్రెంచ్ పోలీసులు అరెస్టు చేశారు. అజర్‌బైజాన్ నుంచి పారిస్‌కు చేరుకున్న ఆయన్ని శనివారం సాయంత్రం ఇక్కడి పారిస్ లె బోర్గెట్ విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్నట్టు ఫ్రెంచ్ మీడియా పేర్కొన్నది. దురోవ్‌ను పోలీస్ కస్టడీలో ఉంచారని తెలిసింది. 'టెలిగ్రామ్' యాప్ మనీలాండరింగ్ కార్యకలాపాలకు ఉపయోగపడుతున్నదని, మైనర్లపై లైంగికదాడులు, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాకు 'టెలిగ్రామ్'లోని కంటెంట్ దోహదపడుతున్నదని దురోవ్ ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.



నటుడు దర్శన్‌కు జైలులో రాజ భోగాలు

బెంగళూరు: హత్య కేసులో నిందితుడు, కన్నడ నటుడు దర్శన్ తూగుదీపకు పరప్పన అగ్రహార కేంద్ర కారాగారంలో సకల రాజ భోగాలు అందుతున్నట్లు ఓ ఫొటోను బట్టి తెలుస్తున్నది. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న ఈ ఫొటోను జైళ్ల శాఖ పరిగణనలోకి తీసుకుని, ఈ జైలు అధికారులకు సమన్లు జారీ చేసింది. ఫొటోలో కనిపిస్తున్న దానిని బట్టి, దర్శన్ జైలులోని ఓ పార్కులో జల్సాగా ఉన్నారు. ఏదో పానీయం తాగుతూ, సిగరెట్ కాల్చుతున్నారు. ఆయనతోపాటు కొందరు రౌడీ షీటర్లు కూడా పక్కన కనిపిస్తున్నారు.

యూపీ కానిస్టేబుల్ పరీక్షలో

మళ్లీ అక్రమాలు!

లక్నోలో 20 మంది అరెస్టు

లక్నో: బీజేపీ పాలిత ఉత్తరప్రదేశ్‌లో కానిస్టేబుల్ ఉద్యోగ నియామకాల తీరు ఓ ప్రహసనంలా మారింది. ఆరు నెలల క్రితం ఏదైతే జరిగిందో.. మళ్లీ అదే రీతిలో పరీక్షల నిర్వహణ ఉందంటూ విమర్శలు వస్తున్నాయి. ఆగస్టు 23, 24 తేదీల్లో నిర్వహించిన పరీక్షల్లో నకిలీ పత్రాలు సహా పలు రకాల మోసపూరిత చర్యలకు పాల్పడ్డారన్న ఆరోపణల కింద 20 మందిని పోలీసులు అరెస్టు చేశారు. బిజ్‌నోర్‌లోని కేపీఎస్ కన్యా ఇంటర్ కాలేజ్‌లో సీల్ లేని ప్రశ్నా పత్రాలు అభ్యర్థులకు ఇచ్చారన్న ఫిర్యాదులు అందాయి. పేపర్ లీక్ అయ్యిందన్న అనుమానాలు కొంతమంది అభ్యర్థులు వ్యక్తం చేశారు. లక్నోలో లీకైన ప్రశ్నాపత్రంను చూపుతూ ఓ వ్యక్తి సోషల్ మీడియా 'ఎక్స్'లో వీడియోను విడుదల చేయటం కలకలం రేపింది. దీనికి సంబంధించి ఓ వ్యక్తిపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదుచేశారు. పరీక్ష నిర్వహణ పారదర్శకంగా లేదన్న ఆరోపణలు రావటంతో యోగి సర్కార్ ఫిబ్రవరిలో పరీక్షను రద్దు చేసింది. ఇప్పుడు మళ్లీ అదే విధంగా పరీక్షను నిర్వహిస్తున్నారంటూ వస్తున్న ఆరోపణల్ని 'యూపీ పోలీస్ రిక్రూట్‌మెంట్, ప్రమోషన్ బోర్డ్' చైర్‌పర్సన్ రాజీవ్ కృష్ణ కొట్టివేశారు. పేపర్ లీక్ సహా అక్రమాలపై వస్తున్న వార్తలన్నీ వదంతులేనని ప్రభుత్వం ఖండించింది.

మాలీవుడ్‌లో లైంగిక వేధింపులపై సిట్

తిరువనంతపురం: మలయాళం సినీ పరిశ్రమలో లైంగిక వేధింపుల ఆరోపణలపై దర్యాప్తు కోసం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేయాలని కేరళ ప్రభుత్వం నిర్ణయించింది. కొందరు అగ్ర నటులు లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్లు వచ్చిన ఆరోపణలపై మహిళా అధికారి నేతృత్వంలోని సిట్ చేత దర్యాప్తు జరిపిస్తామని తెలిపింది. జస్టిస్ కే హేమ కమిటీ నివేదిక నేపథ్యంలో సమగ్ర దర్యాప్తు జరిపించాలని కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్.. ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను డిమాండ్ చేసిన సంగతి తెలిసిందే. మలయాళం సినీ పరిశ్రమలో మహిళలపై లైంగిక వేధింపులు, అనుచిత ప్రవర్తన, ఇతర మానవ హక్కుల ఉల్లంఘనలు జరుగుతున్నట్లు హేమ కమిటీ నివేదిక వెల్లడించింది.

అమెరికాలో కాల్పులు..

తెలుగు వైద్యుడు మృతి

- వైద్యరంగంలో పేరంశెట్టి రమేశ్‌బాబు విశేష సేవలు
- దవాఖానలు నిర్మించి అనేక మందికి ఉపాధి
- అమెరికాలో ఓ వీధికి ఆయన పేరు



హైదరాబాద్, ఆగస్టు 25 (నమస్తే తెలంగాణ)/న్యూఢిల్లీ: అమెరికాలో దుండగుడి కాల్పుల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రముఖ ప్రవాస వైద్యుడు డాక్టర్ పేరంశెట్టి రమేశ్ బాబు(64) మరణించారు. అలబామా రాష్ట్రంలోని టస్కలూసా పట్టణంలో శుక్రవారం జరిగిన ఈ కాల్పుల ఘటనలో రమేశ్ బాబు అక్కడికక్కడే మరణించారని స్థానిక పోలీసులు వెల్లడించారు. తిరుపతి జిల్లా నాయుడుపేట మండలం మేనకూరు గ్రామానికి చెందిన డాక్టర్ పేరంశెట్టి రమేశ్‌బాబు అమెరికాలో ప్రముఖ వైద్యుడిగా ఉన్నారు. వైద్య వృత్తిలో ఆయనకు 38 ఏండ్ల అనుభవం ఉన్నది. అమెరికాలో పలుచోట్ల దవాఖానలు నిర్మించి ఎందరికో ఉపాధి కల్పించిన రమేశ్‌బాబు.. అలబామా రాష్ట్రంలోని టస్కలూసా ప్రాంతంలో వైద్యుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన వైద్య సేవలకు గుర్తింపుగా అక్కడి ఓ వీధికి ఆయన పేరు పెట్టారు. కొవిడ్ సమయంలోనూ ఆయన అందించిన విశేష సేవలకు పలు అవార్డులు అందుకొన్నారు. భారత్ నుంచి అమెరికా వెళ్లే రాజకీయ ప్రముఖులకు ఆయన తన ఇంట్లోనే ఆతిథ్యమిచ్చేవారు.

10 రోజుల క్రితమే వచ్చి వెళ్లి..

డాక్టర్ రమేశ్ బాబు తండ్రి చినగురునాథం సాధారణ రైతు. ఆయన ముగ్గురి సంతానంలో రమేశ్‌బాబు పెద్దవాడు. పదో తరగతి వరకూ సొంతూరులోనే చదువుకున్నారు. తిరుపతి ఎస్వీ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ అభ్యసించారు. అనంతరం జమైకాలో ఎమ్మెస్ పూర్తిచేసి, అమెరికాకు వెళ్లి వైద్యుడిగా స్థిరపడ్డారు. ఆయన భార్య కూడా వైద్యురాలే. వీరికి నలుగురు సంతానం. వీరిలో ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. వారంతా అమెరికాలోనే ఉంటున్నారు. ఆగస్టు 15న నాయుడుపేటలో తమ బంధువుల ఇంట జరిగిన వివాహానికి ఆయన హాజరయ్యారు. ఇక్కడ నుంచి వెళ్లిన కొద్ది రోజులకే ఆయన మరణ వార్త కుటుంబసభ్యులను దిగ్భ్రాంతికి గురిచేసింది. కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. డాక్టర్ రమేశ్ బాబు తాను చదువుకొన్న మేనకూరు హైస్కూల్‌కు, సొంత గ్రామంలో సాయిబాబా ఆలయ నిర్మాణానికి కూడా విరాళం అందించారు.

యూపీఎస్‌పై మాటల యుద్ధం

న్యూఢిల్లీ: 'యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్' (యూపీఎస్)పై అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం మొదలైంది. ఎన్డీయే సర్కార్ పలు నిర్ణయాలపై 'యూటర్న్' తీసుకుంటున్నదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. యూపీఎస్‌లో 'యూ' అంటే యూనిఫైడ్ కాదని, యూటర్న్ అని ఎద్దేవా చేశారు. దీనిపై కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ స్పందిస్తూ, యూపీఎస్ తీసుకురావటం కాంగ్రెస్‌కి కంటగింపుగా మారిందని అన్నారు. 'పాత పెన్షన్ విధానాన్ని తీసుకొస్తామని హిమాచల్‌లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఎప్పుడు అమలుజేస్తారని రాహుల్ ని ప్రశ్నిస్తున్నా' అని కేంద్ర మంత్రి అన్నారు.

జీపీఎస్ ఫెయిలై..

సౌదీ ఎడారిలో చిక్కుకొని



- డీహైడ్రేషన్‌కు గురై మరణించిన కరీంనగర్ వాసి
- నాలుగు రోజుల తర్వాత మృతదేహం గుర్తింపు

హైదరాబాద్: సౌదీ అరేబియా ఎడారిలో చిక్కుకుపోయిన కరీంనగర్ వ్యక్తి అత్యంత దయనీయ స్థితిలో ప్రాణాలు కోల్పోయాడు. నాలుగు రోజుల తర్వాత ఆయన మృతదేహాన్ని గుర్తించారు. 27 ఏళ్ల మొహమ్మద్ షెజాద్‌ఖాన్ సౌదీ అరేబియాలోని ఓ టెలికమ్యూనికేషన్స్ కంపెనీలో మూడేళ్లుగా పనిచేస్తున్నాడు. సూడాన్‌కు చెందిన సహచర ఉద్యోగితో కలిసి ఇటీవల కారులో బయటకు వెళ్లిన షెజాద్ జీపీఎస్ సిగ్నల్ కోల్పోవడంతో దారి తప్పి ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకర ఎడారిగా పేరుపొందిన రబ్ అల్ ఖలీ ఎడారిలో చిక్కుకుపోయాడు. 650 కిలోమీటర్ల విస్తీర్ణంలో వ్యాపించి ఉన్న ఈ ఎడారిలో ఎటునుంచి ఎటు వెళ్లాలో తెలియక ఇద్దరూ అవస్థలు పడ్డారు. దీనికితోడు ఫోన్‌లో చార్జింగ్ అయిపోయి స్విచ్ఛాఫ్ కావడంతో సాయం కోసం ఫోన్ చేసే అవకాశం కూడా లేకుండా పోయింది. కారులో పెట్రోలు కూడా నిండుకోవడంతో పరిస్థితి మరింత దిగజారింది. ఎడారిలో తిండీతిప్పలు లేక, దాహం తీర్చుకునేందుకు చుక్క నీరు కనిపించకపోవడంతో అల్లాడిపోయారు. ఎడారి వేడికి డీహైడ్రేషన్‌కు గురై చివరికి అత్యంత దయనీయ స్థితిలో ఇద్దరూ ప్రాణాలు కోల్పోయారు. నాలుగు రోజుల తర్వాత వీరి మృతదేహాలను వారి వాహనం పక్కనే గుర్తించారు.



ఢీకొన్న 9 వాహనాలు

తమిళనాడులో ఘటన.. ఒకరు మృతి

కృష్ణగిరి, ఆగస్టు 25: తమిళనాడు కృష్ణగిరి జిల్లాలోని ఓ జాతీయ రహదారిపై 9 వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఆదివారం సాయంత్రం జరిగిన ఈ ఘటనలో ఒకరు మృతిచెందగా, మరో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హోసూర్-బెంగళూరు హైవేపై సవమవు అటవీ ప్రాంతం సమీపంలో ఫ్లైఓవర్ పనుల కారణంగా హోసూర్ నుంచి క్రిష్ణగిరి వెళ్తున్న వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. ఈ క్రమంలో గ్రానైట్ లోడుతో వెళ్తున్న లారీ డ్రైవర్ వాహనంపై అదుపుకోల్పోయి నాలుగు కార్లు, మూడు ట్రక్కులు, ఓ బస్సును ఢీకొట్టాడు.




ఫ్రెంచ్ ఫ్రైస్ తిననివ్వలేదని భర్తపై కేసు

బెంగళూరు: తనను కనీసం ఫ్రెంచ్ ఫ్రైస్ తిననివ్వటం లేదు, క్రూరంగా ప్రవర్తిస్తున్నాడంటూ బెంగళూరుకు చెందిన ఓ మహిళ తన భర్తపై పోలీసులకు ఫిర్యాదుచేసింది. దీంతో పోలీసులు 498ఏ, సెక్షన్-504 (ఉద్దేశపూర్వక అవమానం), వరకట్న నిషేధ చట్టం కింద కేసులు పెట్టారు. భర్త హైకోర్టును ఆశ్రయించటంతో దర్యాప్తును కోర్టు తాత్కాలికంగా నిలిపివేసింది. ఉద్యోగ నిమిత్తం అమెరికాకు వెళ్లేందుకు అతడికి అనుమతించింది. తదుపరి విచారణకు అందుబాటులో ఉంటానని అతడు అఫిడవిట్ దాఖలు చేశాడు. సరైన ఆధారాల్లేకుండా 498ఏ సెక్షన్ కింద కేసు పెట్టారని హైకోర్టు ధర్మాసనం అభిప్రాయపడింది.



చోరీకి వచ్చి బుక్కయిపోయాడు!

రోమ్: ఇటలీ రాజధాని రోమ్‌లో ఆసక్తికర ఘటన జరిగింది. ఓ దొంగ (38)ను ఓ ఇంట్లోని టేబుల్‌పై కనిపించిన పుస్తకం ఆకర్షించింది. దీంతో చోరీకి వచ్చానన్న విషయాన్ని మర్చిపోయి పుస్తకం చదవడంలో అతడు మునిగిపోయాడు. మెలకువ వచ్చిన యజమాని (71) వచ్చి అతడిని తడితే కానీ ఈ లోకంలోకి రాలేదు. ఆయనను చూసి షాకైన దొంగ పరారయ్యేందుకు ప్రయత్నించాడు. అయితే అప్పటికే అతడు పోలీసులకు దొరికిపోయాడు. దొంగను అంతగా ఆకర్షించిన ఆ పుస్తకం పేరు 'ది గాడ్స్ ఎట్ సిక్స్ ఓ క్లాక్'. గ్రీకు పురాణాలకు సంబంధించిన ఈ పుస్తకాన్ని ప్రముఖ రచయిత గియోవన్నీ నుచీ రాశారు.



ఆన్‌లైన్ గేమ్ ఆడనివ్వలేదని తాళాలు, కత్తి మింగేశాడు!

పాట్నా: ఆన్‌లైన్ గేమ్స్ మోజు ఓ వ్యక్తి ప్రాణాల మీదకు తెచ్చింది. ఓ బ్యాటిల్ గేమ్‌ను ఆడనివ్వలేదని ఓ వ్యక్తి తన కుటుంబ సభ్యుల మీద కోపంతో ఓ తాళం, తాళాల గుత్తి, ఓ కత్తి, రెండు నెయిల్ కట్టర్లను మింగేశాడు. కొన్ని గంటల తర్వాత ఆయన ఆరోగ్యం క్షీణించడం ప్రారంభమవడంతో కుటుంబ సభ్యులు ఆయనను దవాఖానకు తరలించారు. గంటన్నరసేపు శస్త్ర చికిత్స చేసి, ఆయన మింగినవాటన్నిటినీ వైద్యులు బయటకు తీశారు. ఇప్పుడు ఆయన పరిస్థితి నిలకడగా ఉందని, ప్రాణాపాయం లేదని డాక్టర్ అమిత్ కుమార్ చెప్పారు. బీహార్‌లోని మోతీహారిలో ఈ సంఘటన జరిగింది.



కారులో హెల్మెట్ ధరించలేదని ఫైన్!

లక్నో: హెల్మెట్ ధరించకుండా కారు నడిపాడని యూపీలోని నోయిడా పోలీసులు జరిమానా విధించారు. బాధితుడు తుషార్ సక్సేనా మాట్లాడుతూ రూ.1,000 జరిమానా చెల్లించాలని గత ఏడాది నవంబరులో మెసేజ్ వచ్చిందని, అది పొరపాటున వచ్చిందేమోనని తాను పట్టించుకోలేదన్నారు. ఆ తర్వాత ఈ-మెయిల్, మెసేజ్‌లు రావడంతో పోలీసులను సంప్రదించానన్నారు. జరిమానా చెల్లించకపోతే కోర్టుకు రావలసి ఉంటుందని పోలీసులు తనను హెచ్చరించారని చెప్పారు. కారును నడిపేటపుడు హెల్మెట్ ధరించాలనే నిబంధన ఉంటే, అధికారులు లిఖితపూర్వకంగా తనకు ఇవ్వాలని కోరారు.



బడికి తుపాకీ తెచ్చిన ఆరో తరగతి విద్యార్థి

న్యూఢిల్లీ: ఢిల్లీలో శనివారం ఆరో తరగతి విద్యార్థి బ్యాగులో తుపాకీని చూసి పాఠశాల సిబ్బంది అవాక్కయ్యారు. వెంటనే నజఫ్‌గఢ్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. విద్యార్థి వద్ద ఉన్న తుపాకీలో మ్యాగజైన్ లేదు. దీంతో అతని తల్లిని ప్రశ్నించారు. ఆ తుపాకీ తన భర్తదని, ఆయన కొద్ది నెలల క్రితం మరణించారని, తుపాకీని పోలీస్ స్టేషన్‌కు అప్పగించేందుకు దానిని బయట పెట్టానని చెప్పారు. బాలుడిని ప్రశ్నించినపుడు అది ఆట బొమ్మ అనుకుని, బడికి తీసుకొచ్చానని చెప్పాడు. తుపాకీ లైసెన్స్ సరైనదేనని పోలీసులు నిర్ధారించుకున్నారు. తుపాకీని

మిస్ ఇండియా జాబితాలో

దళితులేరీ?

రాహుల్‌గాంధీ ప్రశ్న

బాలబుద్ధి అని బీజేపీ విమర్శ

న్యూఢిల్లీ: మిస్ ఇండియా కిరీటాన్ని పొందినవారి జాబితాను తాను పరిశీలించానని, అందులో కనీసం ఒక దళిత లేదా ఆదివాసీ యువతి అయినా లేరని రాహుల్ గాంధీ అన్నారు. ఆయన శనివారం ప్రయాగ్ రాజ్‌లో సంవిధాన్ సమ్మాన్ సమ్మేళన్‌లో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. దీనిపై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఎక్స్ వేదికగా స్పందించారు. 'మిస్ ఇండియా' పోటీలు, సినిమాలు, క్రీడల్లో రిజర్వేషన్లు ఉండాలని రాహుల్ కోరుకుంటున్నారని, ఇది కేవలం పసితనపు మనస్తత్వం వల్ల వచ్చిన సమస్య మాత్రమే కాదని, ఆయనను ప్రోత్సహిస్తున్నవారు కూడా సమానంగా బాధ్యులేనని వ్యాఖ్యానించారు.

● శతమానంభవతి



తన పుట్టినరోజును పురస్కరించుకుని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకుంటున్న టీఎస్‌రెడ్కో మాజీ చైర్మన్, బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి

కాంగ్రెస్ మెడకు వాల్మీకి ఉచ్చు

మొదటిపేజీ తరువాయి...

సొమ్ము ప్రభుత్వ అకౌంట్ల నుంచి ఏ కారణం లేకుండా అక్రమంగా దారిమళ్లిందని, ఆ సొమ్ము ఎవరి ఖాతాలోకి బదిలీ అయ్యిందో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. రూ.180 కోట్లలో రూ.45 కోట్లు హైదరాబాద్‌లోని 9 బ్యాంకు ఖతాలకు బదిలీ చేశారని, ఆ ఖాతాలు ఎవరివో వెల్లడించాలని నిలదీశారు. ఈ వ్యవహారం బయటకు రాగానే వాల్మీకి కార్పొరేషన్ అకౌంట్స్ సూపరింటెండెంట్ సూసైడ్ చేసుకోవటం అనుమానాలకు తావిస్తున్నదని చెప్పారు. అలాగే వీ6 పేరుతో ఉన్న బిజినెస్ సంస్థకు రూ.4.5 కోట్లు బదిలీ చేసినట్టు వార్తలు వచ్చాయని, ఆ సంస్థ యజమాని ఎవరో చెప్పాలని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఆ డబ్బునే వాడినట్టు అనుమానాలు ఉన్నాయని ఆరోపించారు.

మీడియాను మేనేజ్ చేసిందెవరు?

ఈ స్కాం వ్యవహారంలో సిట్, సీఐడీ, ఈడీ హైదరాబాద్‌లో దాడులు నిర్వహించినా.. ఆ సమాచారం మీడియాలో



రాకుండా అడ్డుకున్నదెవరు? అని కేటీఆర్ ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి సహా కీలక కాంగ్రెస్ నేతలు కొంతమంది మీడియాను మేనేజ్ చేసినా.. మరో నాలుగైదు రోజుల్లో అన్ని విషయాలు బయటకొస్తాయని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో కొన్ని బార్లు, బంగారు దుకాణాల నుంచి భారీగా నగదు విత్‌డ్రా చేసినట్టు తమకు సమాచారం ఉన్నదని, ఆ బార్లు, బంగారం దుకాణాలను నడుపుతున్నదెవరు? వారికి కాంగ్రెస్ పార్టీతో ఉన్న సంబంధం ఏమిటి? అని నిలదీశారు.

రాహుల్ మాట్లాడరెందుకు?

కర్ణాటక సీఎం సిద్ధరామయ్యను తొలగిస్తే తెలంగాణ ప్రభుత్వం కూడా కూలిపోతుందని కర్ణాటక మంత్రి సతీశ్ జార్కిహోళీ పేర్కొనటం వెనుక మతలబు ఏమిటి? అని కేటీఆర్ ప్రశ్నించారు. కర్ణాటక కాంగ్రెస్, తెలంగాణ కాంగ్రెస్ నేతల మధ్య పెనవేసుకున్న బంధం వాల్మీకి స్కామేనా అని నిప్పులు చెరిగారు. ఈ స్కామ్‌లో తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఉన్నట్టు ఆధారాలున్నా ఈడీ ఎందుకు మౌనంగా ఉన్నదో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ నేతలను కాపాడుతున్న వ్యక్తులు, శక్తులు ఏవో బయటకు రావాలని అన్నారు. పార్లమెంట్‌లో అవినీతిపై మాట్లాడే రాహుల్ గాంధీ.. వాల్మీకి స్కాంలో ఎందుకు మౌనంగా ఉన్నారని నిలదీశారు. సొంత పార్టీ నేతలు అవినీతి చేస్తే మాఫీయేనా? అని విమర్శించారు.

కృష్ణుడి మార్గంలో నడుద్దాం: గవర్నర్



హైదరాబాద్, ఆగస్టు 25 (నమస్తే తెలంగాణ) : శ్రీకృష్ణ భగవానుడు చూపిన ధర్మమార్గంలో నడుద్దామని గవర్నర్ జిష్ణుదేశ్‌వర్మ పిలుపునిచ్చారు. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఆయన రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. సౌభ్రాతృత్వం, సామరస్యం వర్ధిల్లాలని భగవానుడిని ప్రార్థిస్తున్నట్టు పేర్కొన్నారు.



వాల్మీకి స్కాంపై విచారణ జరిపించాలి

- దీనిపై రాహుల్‌గాంధీ జవాబు చెప్పాలి
- స్కాంపై బీజేపీ స్పందించటం లేదెందుకు?
- బీఆర్ఎస్ నేత పుట్ట విష్ణువర్ధన్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 25 (నమస్తే తెలంగాణ): కర్ణాటక వాల్మీకి స్కాంలో తెలంగాణ కాంగ్రెస్ నాయకుల పాత్రపై విచారణ జరిపించాలని బీఆర్ఎస్ నేత పుట్ట విష్ణువర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. వాల్మీకి స్కాంలో తెలంగాణ కాంగ్రెస్ నేతల పాత్ర ఉన్నదని ఆరోపించారు. దేశంలో ఏ నుంచి జెడ్ వరకు కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో స్కాంలు జరిగాయని, కేంద్రంలో కాంగ్రెస్ పాలనలో రూ.5 లక్షల కోట్ల కుంభకోణం జరిగిందని అనేక సంస్థలు చెప్పాయని గుర్తుచేశారు. వాల్మీకి కుంభకోణంలో మొత్తం



రూ.187 కోట్ల కుంభకోణం జరిగిందని, దీనికి బాధ్యుడైన కర్ణాటక మంత్రి నాగేంద్ర ప్రస్తుతం జైల్లో ఉన్నారని తెలిపారు. వాల్మీకి సంస్థ డబ్బులను తెలంగాణ, ఏపీకి తరలించారని, ఇందులో తెలంగాణ కాంగ్రెస్ నాయకుల పాత్రపై రాహుల్‌గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వాల్మీకి సొసైటీలో జరిగిన రూ.90 కోట్ల అవినీతిలో ఏపీకి రూ.45 కోట్లు, తెలంగాణకు మరో రూ.45 కోట్లు బదిలీ అయ్యాయని తెలిపారు. ఇందులో వీ6 బిజినెస్ సొల్యూషన్స్‌కు రూ.4.50 కోట్లు బదిలీ అయ్యాయని, ఈ కంపెనీ ఎవరిదో కాంగ్రెస్ నేతలు స్పష్టం చేయాలని అన్నారు. సీబీఐ విచారణ చేస్తున్న ఈ స్కామ్‌పై బీజేపీ నేతలు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఈ స్కామ్‌లో తెలంగాణకు చెందిన సత్యనారాయణ వర్మను అరెస్టు చేశారని.. ఆయన రూ.3.50 కోట్లతో స్పోర్ట్స్ కారు సహా 35 కిలోల బంగారం కొనుగోలు చేశారని వివరించారు. ఈ స్కాంలో తెలంగాణ కాంగ్రెస్ నేతల పాత్రపై రేవంత్‌రెడ్డి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మరిన్ని వార్తలు ntnews.com లో చూడగలరు



కేటీఆర్ రాఖీయిజమా? రేవంత్ రౌడీయిజమా?

- మనం ఎటువైపు ఉందాం?
- తెలంగాణ సమాజానికి దాసోజు శ్రవణ్ పిలుపు



హైదరాబాద్, ఆగస్టు 25 (నమస్తే తెలంగాణ): కేటీఆర్ రాఖీయిజమా? సీఎం రేవంత్‌రెడ్డి రౌడీయిజమా? ఎటువైపు ఉందాం? అని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ తెలంగాణ సమాజాన్ని ప్రశ్నించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణలో ప్రోత్సహిస్తున్న రాఖీ సంస్కృతిని కోరుకుందామా? సీఎం రేవంత్‌రెడ్డి ప్రోత్సహిస్తున్న ప్రమాదకర రౌడీ సంస్కృతిని కోరుకుందామా? తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందని ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. మహిళా జర్నలిస్టులు అనే కనీస విచక్షణ లేకుండా, అసభ్యకరంగా ప్రవర్తించినా, అసెంబ్లీలో మహిళా శాసనసభ్యులని అగౌరవపర్చినా బారాఖూన్ మాఫ్ అనేలా వాతావరణం మారిపోవటం విషాదకరమని అన్నారు. ఆడబిడ్డలు తమ సోదర సమానుడైన నాయకుడికి రాఖీకడితే నేరమైపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ తల్లిని గౌరవించకుండా ప్రవర్తించడం.. ఆఖరుకు రాఖీ సంస్కృతిని అవమానించేలా సీఎం రేవంత్‌రెడ్డి వక్రబుద్ధిని ప్రదర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని, సామాజిక అస్థిత్వాన్ని దెబ్బతీయమే సీఎం రేవంత్‌రెడ్డి పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి కుట్రపూరిత వ్యూహాలను తిప్పికొట్టి తెలంగాణ అస్థిత్వాన్ని నిలబెట్టేందుకు మరోసారి ఐక్యపోరాటాలకు సిద్ధం కావాల్సిన వాతావరణం నెలకొన్నదని పేర్కొన్నారు.

గురుకులాల్లో గందరగోళం!

- ఇష్టారాజ్యంగా ఉన్నతాధికారుల నిర్ణయాలు
- నిబంధనలకు తిలోదకాలు.. అందని పుస్తకాలు
- రెండు నెలలుగా ఉద్యోగులకు అందని వేతనాలు
- అయోమయంగా బదిలీలు, పదోన్నతులు
- సర్కారు నిర్ణయం కోసం ఎదురుచూపులు

హైదరాబాద్, ఆగస్టు 25 (నమస్తే తెలంగాణ): గురుకులాల్లో గందరగోళం నెలకొన్నది. ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఉద్యోగులు, సిబ్బంది రెండు నెలలుగా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఎస్సీ వెల్ఫేర్ సొసైటీలో పాలన గాడితప్పింది. బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ ఒక ప్రహసనంగా కొనసాగుతున్నది. సత్వరమే స్పందించి సమస్యలన్నింటికీ ముగింపు పలకాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరుతున్నారు. ప్రభుత్వం దృష్టిపెట్టకపోతే సొసైటీల్లోని యూనియన్లు పోరుబాటకు సిద్ధమవుతున్నాయి. సాంఘిక సంక్షేమ గురుకులాల్లో వేలాది మంది ఉపాధ్యాయులు రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతుండగా, బోధన అస్తవ్యస్తంగా మారింది. విద్యార్థుల బాగోగులను పట్టించుకునే వారే కరువయ్యారు. పలుచోట్ల కిందిస్థాయి సిబ్బంది అక్కడ పెత్తనం చెలాయిస్తున్నారు.

సంక్షేమ శాఖలకు మంత్రులే కరువు

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరి 9 నెలలు కావస్తున్నది. ఇప్పటికీ సాంఘిక సంక్షేమ, మైనార్టీ, గిరిజన సంక్షేమ శాఖలకు మంత్రులను నియమించలేదు. ఆయా శాఖలన్నీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్దే ఉన్నాయి. దీంతో ఆయా శాఖల పరిధిలోని గురుకులాల పరిస్థితి దయనీయంగా మారింది. సీఎం అజమాయిషీలో ఉన్నా కూడా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక, విధానపర నిర్ణయాల జాప్యంతో క్షేత్రస్థాయిలో అనేక ఇబ్బందులు నెలకొంటున్నాయి. ప్రధాన కార్యాలయాల్లోని కొందరు అధికారులు ఆధిపత్యాన్ని చెలాయిస్తున్నారు.కార్యాలయాల్లో కొందరు ఓడీలపై తిష్ఠవేసి జులూం ప్రదర్శిస్తున్నారు. ఇష్టారీతిన నిర్ణయాలు తీసుకుంటూ ఇటు విద్యార్థులను, అటు ఉపాధ్యాయులకు చుక్కలు చూపుతున్నారు. సోషల్ వెల్ఫేర్‌లో రాత్రికి రాత్రే సర్క్యులర్లు, మరుసటి రోజే ఆర్డర్లతో అన్ని అనాలోచిత నిర్ణయాలే తీసుకుంటూ అరిగోస పెడుతున్నారని సొసైటీ ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను చెప్పుకున్నా పరిష్కరించకుండా, ఆపై బెదిరింపులకు దిగుతున్నారని, వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకుని కక్షసాధింపులకు దిగుతున్నారని కొందరు మహిళా ఉపాధ్యాయులు కన్నీటిపర్యంతమవుతున్నారు.



అటకెక్కిన అనేక సమస్యలు

గురుకుల అధికార యంత్రాంగమంతా బదిలీలు, ప్రమోషన్లకే పరిమితం కావడంతో అనేక అంశాలు అటకెక్కాయి. విద్యార్థులకు కాస్మొటిక్ చార్జీలు ఈ ఏడాది మార్చి వరకే అందాయి. డైట్ చార్జీలు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో సరైన పౌష్టికాహారం అందని పరిస్థితి నెలకొన్నది. నాణ్యత లేని సరుకులను సరఫరా చేస్తుండటంతో విద్యార్థులు అనారోగ్యాల పాలవుతున్నారు. అస్వస్థతకు గురవుతున్నారు. అనేక భవనాల అద్దెలు, విద్యుత్తు చార్జీలు బిల్లులు నిలిచిపోయాయి. సీవోఈలు, పార్ట్ టైమ్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, సీనియర్ ఫ్యాకల్టీ సబ్జెక్ట్ అసోసియేట్లకు రెండు నెలలుగా జీతాల చెల్లింపు నిలిచిపోయింది.దీంతో వారంతా అనేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

పోరుబాటకు యూనియన్లు సిద్ధం

ఉన్నతాధికారుల అనాలోచిత నిర్ణయాలు, మరోవైపు ప్రభుత్వ నిర్లక్ష్యంపై సొసైటీల్లోని అన్ని యూనియన్లు ఆగ్రహంతో ఉన్నాయి. బదిలీలు, ప్రమోషన్లలో అనేక అవకతవకలు జరిగాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే బాధిత ఉపాధ్యాయులతో కలిసి అనేకమార్లు నేరుగా ప్రజాభవన్‌కు వెళ్లి వినతులు సమర్పించారు. సీఎస్, సీఎంవో కార్యాలయ అధికారులకు మొరపెట్టుకున్నారు. ఇప్పటికీ ఆశించిన ఫలితం రాకపోవడంతో యూనియన్లు మండిపడుతున్నాయి. కలిసికట్టుగా పోరుబాట పట్టేందుకు సిద్ధమవుతున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి సోషల్ వెల్ఫేర్ గురుకులంలో బదిలీలు, ప్రమోషన్లను పూర్తిగా పునఃసమీక్షించేందుకు ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. ఆయా అంశాలపై ప్రభుత్వం నుంచి మరో రెండు రోజుల్లో స్పష్టమైన నిర్ణయాలు వెలువడకుంటే భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరిస్తున్నాయి. మూకుమ్మడిగా విధులను బహిష్కరించి, సెక్రటేరియట్ ముట్టడికి తరలివెళ్లి తాడోపేడో తేల్చుకోవాలని యూనియన్లు ప్రణాళికలను రూపొందిస్తున్నాయి.

తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్‌గా లచ్చిరెడ్డి




హైదరాబాద్, ఆగస్టు 25 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీని ఏర్పాటుచేశారు. హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో 65 సంఘాలు.. డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీ లచ్చిరెడ్డిని చైర్మన్‌గా ఏకగ్రీవం గా ఎన్నుకున్నాయి.ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగుల ఆరోగ్యం, పదోన్నతుల క్యాలెండర్, హౌసింగ్ పాలసీకి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు అశ్వత్థామరెడ్డి, నిర్మల, లక్ష్మిరెడ్డి, సంపత్‌కుమార్, హర్షవర్ధన్‌రెడ్డి, కుమారస్వామి, మహిపాల్‌రెడ్డి, షౌకత్‌అలీ, శ్రీకాంత్, ఉపేందర్‌రావు, గోపాల్‌రెడ్డి, రామకృష్ణ, రాములు, రమేశ్, పూల్‌సింగ్‌చౌహాన్, హరికిషన్, తిరుపతినాయక్, జనార్దన్, మేడి రమేశ్, దేవికా రొక్కం, మమత, వాణి, సక్కుబాయి, కమలాకర్ పాల్గొన్నారు.

ఉద్యమకారులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలి

సికింద్రాబాద్, ఆగస్టు 25: తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులందరికీ 250 గజాల ఇంటి స్థలం కేటాయించాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, తెలంగాణ విద్యార్థి జేఏసీ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ న్యూ సెమినార్ హాల్లో నిర్వహించిన మలిదశ ప్రత్యేక తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ప్రసంగించారు. కార్యక్రమంలో శ్రీహరి, లోకేశ్ , చరణ్‌కౌశిక్, శ్రీధర్, దరువు ఎల్లయ్య, వరంగల్ రవి, కోట శ్రీనివాస్, దుర్గం భాస్కర్, మందాల భాస్కర్, కృష్ణకాంత్, సురేష్, రెడ్డి శ్రీనివాస్, రవి, వంశీ, సురేష్, కృష్ణ పాల్గొన్నారు.





4 నమస్తే తెలంగాణ
హైదరాబాద్
సోమవారం 26 ఆగస్టు 2024
www.ntnews.com

చెలిమె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలిసిసొలిసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com



చదువు స్వభావము

చదువ దేలయన్న పదము పలుకరాదు
చదువు లేనివాడు జంతుసముడు
బతుకు బాగుపడగ బాటవేయు చదువె
చీకటందు వెలుగు రేకవోలె

ధనము కొరకు చదువులను క్రయ మిలన
బేరసారములకు దారి కాదు ఇది
చింతల దీర్చు చింతామణి వలెను
చదువు జీవితమును చక్కబరుచును

మీరు పొందలేని భూరి విద్యలనన్ని
సంతును చదివించ పంతమూని
పాల మనసులందు పని యొత్తిడిని పెంచ
తల్లిదండ్రులార తగదు మీకు

ధనము పొందుటొకటె ఘనముగా నెంచెడు
వ్యక్తిగతములైన బడులు నేడు
విద్య నేర్పుటందు విఫలమగు చునుండె
పుత్తడనుచు పోవ నిత్తడౌను

తెలివి యెంతయున్న కలుగునంత చదువు
బలిమి చేత రావు ఫలములెపుడు
నీటనీదు చేప నింగిలో నెగురుట
సాధ్యమగునె ధరను శ్రమయెగాక

విషయమేదైన శ్రద్ధగ వివరమరసి
చదువుకొన్ననె లాభము సంఘమందు
కొన్ని మాత్రమే మంచిని కూర్చుననెడు
భావదారిద్ర్యమును వీడు త్రోవగనుడు




చిలకమర్తి
కృష్ణమాచార్యులు

వర్సిటీకి పాల్కుర్కి పేరు సముచితం

తెలుగు భాషా సంస్కృతులకు, చరిత్రకు 'తెలంగాణ' తొట్ట తొలుత వికాస కేంద్రంగా నిలిచింది. ఆ తర్వాతే మిగతా తెలుగు నేలకు సంస్కృతీ వికాసం విస్తరించింది. అలాంటి బంగారు నేలపై వెయ్యేండ్లకు పైగా చారిత్రక సాక్ష్యంగా నిలిచిన భాగ్యనగరం నేడు తెలుగు వారలకు వికాసభూమి, నివాస భూమి, వ్యాపారకేంద్రం, విద్యల నిలయంగా నిలిచింది.

ఈ హైదరాబాద్ మహానగరంలోని విద్యా వికాసానికి కేంద్ర స్థానాలైన విశ్వ విద్యాలయాల్లో తెలుగు విశ్వ విద్యాలయం ఒకటి. నాటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు మానసపుత్రికగా, ఆయన హయాంలో అన్ని కళా కేంద్రాలను అంతర్గర్భీకరించుకొని నగరం నడి బొడ్డున అందరికీ అందుబాటులో నాంపల్లి కేంద్రంగా డిసెంబర్, 2 1985లో తెలుగు విశ్వవిద్యాలయం వికసించింది. దీన్ని చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నకాలంలో 1998లో 'పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం'గా పేరు మార్చినారు. సంస్కృతం, జ్యోతిషం, క్లాసికల్ తెలుగు, నృత్యం, సంగీతం, చరిత్ర, ఇతర కళలు ఇలా అనేక సంస్కృతీ విభాగాలకు విద్యార్జన కేంద్రమైంది.



> ప్రస్తుతం ఉమ్మడి రాష్ట్రం రెండు తెలుగు రాష్ట్రాలుగా విడిపోయి పదేండ్లు గడిచిన కారణంగా అన్ని అంశాల్లో విభజన అయి, ఈ విశ్వవిద్యాలయం కూడా ద్విధావిభక్తం అవుతోంది. తెలంగాణ విభాగానికి అనగా హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయానికి నామీక రణం, నామీకరణం దిశగా ప్రయాణిస్తున్నది. సురవరం ప్రతాపరెడ్డి పేరును ఇదివరలో కొందరు సూచించారు.

అయితే, ఇవి ఆధునిక విద్యా విషయాల విశ్వవిద్యాలయాలు కావు. ప్రాచీన సాహిత్యం, సంస్కృతీ, కళల నిలయాలు. వీటికి ప్రాచీనుల పేర్లు తగినవిగా ఉంటాయి. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం (రాజమండ్రి), వేమన విశ్వ విద్యాలయం (కడప), తిక్కన విశ్వవిద్యాలయం (నెల్లూరు) వంటి పేర్లతో ఆంధ్రులు వాటిని సముచితంగా గౌరవించుకున్నారు. తెలంగాణలోని ఈ విశ్వవిద్యాలయానికి ప్రాచీన తెలుగు కవులు లేరా? పేర్లు దొరకవా? ఆధునిక తెలంగాణ వైతాళికుల పేర్లు పెట్టాలా? అనేది ప్రశ్న.

బాగా ఆలోచిస్తే తెలంగాణకు ప్రాచీన సాహిత్య మణి కిరీటంలోని శిరోమణి వంటి పాల్కుర్కి సోమనాథుడున్నాడు. ఇతడు తెలంగాణకే కాదు, తెలుగు సాహిత్యానికే 'స్వతంత్ర తొలి తెలుగు కవి.' ఈతని శిష్ట సాహిత్యం, పద సాహిత్యం, శతక సాహిత్యం, స్తుతి సాహిత్యం పండితులకు పామరులకు ఉపాదేయమైంది. మిగిలిన కవులెలా ఉన్నా, ఈయన పేరు తెలియని తెలుగు వాడుండరు. ప్రసిద్ధుడైన ఈ మహాకవి తెలుగు సాహిత్య లోకానికే స్ఫూర్తిదాత. తెలంగాణ జాతికి నిత్యః ప్రాతః స్మరణీయుడు. అంతేకాదు, అత్యంత ప్రాచీనుడు. ఈయన కాలం 11వ శ. అంతం. ఇంత ప్రాచీనుడైన ప్రతిభావంతుడైన మహాకవి మరొకరు లేడు.

తెలుగు భాష ప్రాచీనత్వం కోసం తెలంగాణ సాహిత్యాన్నే ఆధారంగా తీసుకొని ప్రాచీన హోదాను కేంద్రం నుంచి వాదించి, గెలిచి తెచ్చుకున్నాం. అలాంటి మనం ఓ విశ్వవిద్యాలయానికి అందులో ప్రాచీన సంస్కృతీ కళలకు పట్టుకొమ్మ అయిన విశ్వ విద్యాలయానికి ఒక ప్రాచీన మహాకవి పేరు పెట్టుకోలేమా? అసలు పాల్కుర్కి అధ్యయనాంశంగా ఒక పీఠమే ప్రభుత్వం ఏర్పర్చాలి. అలాంటిది. ఇప్పటికే సిద్ధంగా ఉన్న ఈ తెలుగు విశ్వవిద్యాలయానికి ఈ మహాకవి పేరు పెట్టుకోవడం ఎంతో సముచితం. అందరికీ సమ్మతంగా ఉండే భేషైనా కీర్తిమంతమైన చర్య. ముఖ్యమంత్రి, విద్యామంత్రులు ఈ విషయంగా పరిశీలించగలరని మనవి.

అయితే, సురవరం ప్రతాపరెడ్డి గారి పేరు సంగతేమిటని ఒక ప్రశ్న తలెత్తుతుంది. వీరు తెలంగాణలోని ఆధునిక సాంస్కృతిక వైతాళికుల్లో ఆద్యగణనీయుడు. ఈయన తెలంగాణలో పుట్టకుంటే, తెలంగాణ సంస్కృతీ, కళావారసత్వం, రాజకీయ వికాసం ఒక వందేండ్ల వెనుకకు ఉండేదంటే అతిశయోక్తి కాదు. మరి అలాంటి మహానుభావుడి పేరు తెలుగు విశ్వవిద్యాలయానికి పెట్టరాదా అని ప్రశ్న. అయితే, ఒక ప్రాచీన మహాకవి కోసం తపించి, పాల్కుర్కి సోమనను గణనలోకి తీసుకున్నాం.

సురవరం ప్రతాపరెడ్డి పేరును ఒక విశ్వవిద్యాలయానికి పెట్టవలసిందే. అంతటి యోగ్యత వారిది. ఆ బాధ్యత మనందరిది. ప్రస్తుతం పాలమూరు విశ్వవిద్యాలయం ఉంది. ఇది కొత్త విశ్వ విద్యాలయాల్లో ఒకటి. పైగా ఈ విశ్వవిద్యాలయం సురవరం వారి సొంత జిల్లాలోనిది. వారు ఆ జిల్లా వాసులే గనుక, వారిపేరు ఆ విశ్వవిద్యాలయానికి పెడితే సముచితంగా ఉంటుంది. 'సురవరం ప్రతాపరెడ్డి విశ్వవిద్యాలయం, లేదా సురవరం ప్రతాపరెడ్డి పాలమూరు విశ్వవిద్యాలయం' అన్నా సముచితంగా ఉంటుంది. అంతేకాదు తెలంగాణ రాష్ట్ర వాసులందరే కాక విశేషించి పాలమూరు జిల్లా స్థానికులు కూడా బాగా హర్షిస్తారు. ప్రతాపరెడ్డి గారంటే అభిమానించే వారు కూడా ఈ నిర్ణయాన్ని గౌరవిస్తారు, ఆహ్వానిస్తారు. సురవరం వారికి గూడా మనం ప్రేమపూర్వకంగా, నివాళి అర్పించినట్టుంటుంది. ఒకరు ప్రాచీన వైతాళికునిగా, మరొకరు ఆధునిక తెలంగాణ వైతాళికునిగా ఉభయులను 'పాల్కుర్కి సోమన, సురవరం ప్రతాపరెడ్డి గారలను' సంభావించి, సముచిత గౌరవమిచ్చి తెలంగాణ జాతికి వారిచ్చిన అమూల్య సంస్కృతీ వారసత్వాన్ని గౌరవించుకున్నట్టుంటుంది. ఈ దిశగా ముఖ్యమంత్రి గారు, ప్రభుత్వం ఆలోచించవలసిందిగా మనవి చేస్తున్నాం.



డాక్టర్ సంగనభట్ల నరసయ్య
94400 73124

> తెలుగు భాష ప్రాచీనత్వం కోసం తెలంగాణ సాహిత్యాన్నే ఆధారంగా తీసుకొని ప్రాచీన హోదాను కేంద్రం నుంచి వాదించి, గెలిచి తెచ్చుకున్నాం. అలాంటి మనం ఓ విశ్వవిద్యాలయానికి అందులో ప్రాచీన సంస్కృతీ కళలకు పట్టుకొమ్మ అయిన విశ్వ విద్యాలయానికి ఒక ప్రాచీన మహాకవి పేరు పెట్టుకోలేమా? అసలు పాల్కుర్కి అధ్యయనాంశంగా ఒక పీఠమే ప్రభుత్వం ఏర్పర్చాలి. అలాంటిది ఇప్పటికే సిద్ధంగా ఉన్న ఈ తెలుగు విశ్వవిద్యాలయానికి ఈ మహాకవి పేరు పెట్టుకోవడం ఎంతో సముచితం.



మూలవాగు

మా ఊరి మూలవాగు
ఇసుక దేహంపై నీటి కొంగు సుట్టుకొని
కస్కెలు, శంఖులతో అలుగు దుంకితే
పట్టగొలుసులు పెట్టుకున్న ఆడబిడ్డ లెక్క ఉంటది.
అది సుడులు సుట్టుకొని సప్పుడు చేసే నీటి రాగానికి
కోటి కొంగలైన ఒంటికాలి
జపంతో ఎదురుసూడాల్సిందే...
దాని లెక్కల
పొర్కనీ, గడ్డిని తనతో కొంచవోయిందంటే
ముసలోళ్ల మంచి చెడ్డలర్సుకునే
పెద్ద మనిషైనట్టే...
అలిగి కూసున్నదంటే ఎండకాలం వచ్చినట్టే..
చలాకి ఉన్నదని
గవర్నమెంటోళ్లు చెక్‌డ్యామ్ కట్టి ఏడాదైనా కాలె
ఏ పాపపు దళారోడి కన్ను పడ్డదో ఏమో
నీటి కొంగు తొలచి వివస్త్రను చేసింద్రు
ఇసుక దేహాన్ని అమ్ముకొని
రాక్షసానందం పొందిన్రు
పాపం వాగు ఇప్పుడు మిగిలిన దుబ్బతో
నోరి తెర్సి ఎదురుచూసే పొలం
లెక్క బీటలు వారి చూస్తున్నది
ఎవరైనా చెరువు నీళ్లతోనైనా
గొంతు తడుపుతారని
ఒక నీటి బట్టను మళ్లీ సుట్టి పోతారని.



సందీప్
వొటారికారి
93902 80093

శబ్దార్థ హృదయ సంవేదన

యదార్థభావం వ్యథార్థ రూపంలో బయటపడితే అది ఫణి మాధవి కవిత్వం. రామాయణ మహా కావ్య సృజన కూడా శోకం నుంచే శ్లోకమై, కథనమై, కవిత్వమై, ఇతిహాసమై, చారిత్రక ప్రమాణమై, భారతీయ జీవన వేదమై భాసించింది. కాంతి పుంజానికి వెనకాల చీకటి ఉన్నట్లు సంతోషం వెనక దుఃఖం ఉంటుంది. సామభేదలో కవిత్వం అర్థవంతమై, వేదనారోదనలలో భేదం భావ యుక్తంగా రక్తి కట్టినది.

బాధతో నిండిన హృదయంలో మొలకెత్తిన భావ జ్వాలలకు ఆలోచనాజ్యం పోసి అక్షరాలలో ప్రజ్వలింపజేశారు ఫణి మాధవి. వామపక్ష వాద కవుల ప్రభావం ఆమెపై ఒకింత ఎక్కువగానే ఉంది. అందుకే ఆ భావన ఆమె కవితల్లో తొంగిచూస్తూనే ఉంటుంది. సచేతనమైన శరీరం నిర్జీవమైతే, బాహ్య ప్రపంచ బంధాల నుంచి విడుదలైనప్పుడు అది మరణమవుతుంది. ఆ మరణానికి కూడా కబురంపట మంటే!..



'మొన్న ఆఖరిసారిగా
మరణించినప్పుడు
శోకగానం ఆలపించలేదేం!?' అంటూ మరణం గురించి సరికొత్తగా చెప్పారు.

'దెబ్బ కాయటం తెలుసులే-- కానీ
రాయికెందుకో ఉబలాటం
పదేపదే గాయపరచడమే లక్ష్యం'.. అంటూ

రాళ్లలోనూ మనసు ఉంటుందని కొంగొత్తగా చెప్పారు. కనిపించకుండా విసిరిన చేయి అసలు ముద్దాయిగా తెలిశాక, తగిలిన గాయాన్ని సాక్ష్యంగా చూపెడుతుంది. మానవ జీవన జనన మరణ పరిభ్రమణంలో ఇది అనివార్యం. చనిపోయిన ప్రతిసారి కొత్తగా పుట్టక తప్పదు. ఆ పుట్టుక ఎలాంటిదనేదే ప్రశ్నార్థకమవుతుంది. బతకటం కష్టమైనప్పుడు మరణం అనివార్యమే కదా! ఇది చర్విత చరణం. అది కొత్తేమీ కాదు, కొత్తగా తెలుసుకున్నట్టు అనుకుంటాం. అదే మానవ జీవితంలో విచిత్రం. 'కబురు' కవితలో ఈ ధ్వని ఉంటుంది.

'జై రామ రాజ్యంలో
రావణ రథం ఊరేగుతుంది
పాండవ ధర్మ పాలనలో
కీచక జయధ్వానాలు
మిన్నంటుతున్నాయి' అంటూ

మతోన్మాదులను, వేర్పాటు వాదనను సమర్థించేవాళ్లను అందలాలు ఎక్కిస్తే దుర్మార్గమే రాజ్యమేలుతుందని చెప్పారు.

అఘాయిత్యాలు చేసేవాళ్లు కూడా అభినందనల కరచాలనం చేస్తారని, అవకాశం దొరికితే ఆబగా కబళించాలని చూస్తారని, తన భావాలు అరణ్య రోదనలేనని, కుచించుకుపోయిన ఆడతనం మహిళా దినోత్సవానికి పెద్దగా స్పందించదని.. మనుషులు పరిణతి చెంది మహిళల్లో తల్లిని, చెల్లిని చూడగలిగితే నిర్భయంగా తన భౌతిక దేహంపై మోజు పడని మగరాయుళ్ల ముందు కూడా ధైర్యంగా వెళ్లగలిగితే, అది నిజమైన మహిళా దినోత్సవమనేది కవయిత్రి ఉవాచ.

'తన అరుపులు
అరణ్య రోదనలేనని
ఆమె మౌనంగా
తిరుగు పయనమైంది' అంటూ
'ఎప్పటిలాగే ఎప్పటిలాగే'

కవితలో తన ఆంతర్యాన్ని చెప్పారు కవయిత్రి. నాన్న లేని కుటుంబ వేదన చెప్పినా, అమ్మే నాన్నయిందని అమ్మని ఆకాశానికెత్తినా,

'పూర్ణం మిగలాలంటే
పూరించాల్సిందేదో ఉంది
అర్థం చేసుకోలేని ఆల్గారిథం
బతుకు పుస్తకం నిండా' అని గణితం చెప్పినా, కిం కర్తవ్యంలో లోపలి చీకటిని పదాల్లో ఒంపినా, పెదాలపై పూసిన నవ్వును మనసుకు పట్టించుకోవడం, దేనికోసమంటే..

'చేతనకు రాదారి చీకటేనని
నిజాన్ని ఎరుక బట్టటం'
అని చెప్పినా కవయిత్రికే చెల్లుతుంది.

చివరి కవిత 'వెన్నుచూపకు'లో 'మనసు ఉక్కిరిబిక్కిరైనప్పుడు పక్కన కిటికీ తెరుస్తుంది. స్వచ్ఛమైన గాలిని ఆస్వాదిస్తూ, ఊపిరి ఒరిపిడిలోనూ భావం వదల్లేదని చెబుతుంది. గదిలోని చీకటి కాటుకలా నల్లనిదైనా దానిని ఏ వెలుగూ మసక బార్చదు' అంటుంది కవయిత్రి. మధ్య పుటలలో మానవ జీవిత సంగ్రహ సారాన్ని..

'ఉరిమే ఉరుముల మబ్బులలో
మెరిసే మెరుపుల తళుకులలో
కురిసే వడగళ్ల వర్షపు చినుకులు'గా కవి తీకరించారు. సామభేద గురించి చెప్పాలంటే ఇంకా చాలా ఉంది. ప్రతిఒక్కరూ చదవాల్సిన మానవ జీవన సంవేదనలు కలగలిసిన కవిత్వ సంపుటి సామభేద.



వేంకట రాణా ప్రతాప్
93984 32567

ప్రకటనలు

'రాత్రిసింఫని'కి సాహితీ అవార్డు

ప్రముఖ కవి డాక్టర్ బాణాల శ్రీనివాసరావు రచించిన 'రాత్రి సింఫని' కవితా సంపుటం 2023కు గాను పాలమూరు సాహితీ అవార్డుకు ఎంపికైంది. ఈ కార్యక్రమం సెప్టెంబర్ 1న మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని లిటిల్ స్కాలర్స్ హైస్కూల్‌లో గల కాళోజీ హాల్‌లో ఉదయం 10 గంటలకు జరుగుతుంది. అందరూ ఆహ్వానితులే.

- డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్
వ్యవస్థాపకులు, పాలమూరు సాహితీ అవార్డు



నేను తెలంగాణను

కోస్తా కన్నా ముందే నా గడ్డ నివాస యోగ్యమని
మానవ నాగరికత వికసించిన ఘనత నా నేలది!
అశ్మక ములక ముషక గణ రాజ్యాలన్నీ
బౌద్ధం కన్నా ముందే విలసిల్లిన చరిత్ర నాది!
కోటి లింగాలలో స్వాతంత్ర్యం ప్రకటించిన
శ్రీముఖ శాతవాహన రాజ్యాధికారం నేనే!
॥ నేను తెలంగాణను - తెలుగు ఆణెమును॥ 2

వాత్సాయనుడు నాగార్జునుడు కుతూహలుడు కుమారిలుడు
దార్శనికతతో వెదజల్లిన బౌద్ధ పరిమళం నేనే!
విష్ణుకుండిన గోవిందవర్మ తామ్ర శాసనం
నా గడ్డమీది తొలి శిలా దాన శాసనం!
జనాశ్రయుని ఛందో విచ్ఛిత్తిలోని సీస పద్యలక్షణమూ
అచ్చమైన తెలుగు ఛందో పద్య రచనకూ తార్కాణం నేనే!
॥ నేను తెలంగాణను - తెలుగు ఆణెమును॥ 2

'ఏకోరసః కరుణ ఏవ' సిద్ధాంతకర్త భవభూతి
నాటకాల జన్మస్థలం ప్రదర్శన క్షేత్రం విదర్భ నాదే!
గుజరాతు లాట దేశ చాళుక్యులు మొదటగా
వలస వచ్చిచేరిన పోదన (బోధన్), వేములవాడ రాజధానులు నేనే!
చాళుక్యుల కళా సాహిత్య పోషణలో విరాజిల్లిన
విలసిల్లిన వేములవాడ, కొలనుపాక ఆలయాలు నేనే!
॥ నేను తెలంగాణను - తెలుగు ఆణెమును॥ 2

యశస్తిలకుడు సోమదేవసూరి
కథాసరిత్సాగర కవనధారి ఆశ్రయం నాదే!
కన్నడ భారత కవి పంపని జినేంద్ర పురాణం
భాష ప్రాచీనతకు కట్టిన పట్టాభిషేకం నాదే!
జినవల్లభుని గంగాధర (కురిక్యాల) శాసన కందపద్యాలు
ప్రాచీన పద్య వైభవ ప్రాభవాలు నేనే!
॥ నేను తెలంగాణను - తెలుగు ఆణెమును॥ 2

(క్రీ.పూ. బౌద్ధం పూర్వం నుంచి
క్రీ.శ. 11వ శతాబ్దం పూర్వం వరకు
తెలంగాణ చారిత్రక, సాంస్కృతిక వైభవం)




డాక్టర్ బోయినపల్లి
ప్రభాకర్
9490901050

దాశరథి – జీవననాదం

తెలుగు సాహిత్యంలో జీవిత కథలు.. జీవన ప్రయాణాల చరిత్ర నిక్షిప్తాలు కొత్త కాదు. అతడు–ఆమె.. కాశీ యాత్ర నుంచి దాశరథి 'జీవనయానం' వరకు సుసంపన్నమైన సాహితీ భాండాగారం తెలుగు జాతిది. దాశరథి రంగాచార్యులు ఆంధ్రదేశపు రాజకీయ, సాంఘిక, సామాజిక చరిత్రతో సమాంతరంగా పయనించి రచనలు చేసిన సాహితీ స్రష్ట. నాడు–నేడు పై అంశాలలో పది నవలలు పేర్కొంటే వాటిలో సగం దాశరథి రచనలే ఉంటాయి. మోదుగు పూలు, చిల్లర దేవుళ్లు వంటివి కొన్ని మాత్రమే.

దాశరథి రంగాచార్యకు వేదం తెలుసు, జీవననాదం తెలుసు. అతని సోదరులు దాశరథి కృష్ణమాచార్యులు అక్షరాలతో అగ్నిధారలు కురిపించిన కవి. సినీ గేయ రచయితగానూ సుప్రసిద్ధులు. తమ్ముడు దాశరథి రంగాచార్యులు ఆధ్యాత్మిక సాహితీ శిఖరంలా వెలిగారు. తెలుగు సాహిత్యాన్ని అన్ని ప్రక్రియలలో సుసంపన్నం చేశారు. 'పలికెడిది భాగవతమట పలికించెడు వాడు రామభద్రుడని' వినయంగా చెప్పుకొన్న పోతన మాదిరిగా అత్యంత వినయంతో 'నేను నాలుగు వేదాల వచనానువాదం– కేవలం భగవదనుగ్రహంతో (24–1–1998 నాటికి) పూర్తి చేశాను' అన్నారు రంగాచార్యులు. వేదం ఆయన ప్రాణం, జీవననాదం. తెలుగుజాతి (కాదు.. భారతీయ) సంస్కృతి. సంప్రదాయ జీవనాడి ఆధారం.



'అన్ని వేదాల్లోనే ఉన్నాయిష' అన్న కన్యాశుల్కం వాక్కు అక్షర సత్యం. దాశరథి రంగాచార్యులు అక్షర నిధులతో రుజువు చేసిన వాస్తవం. 'ఈ మానవ జీవితం – సమాజ జీవితం – నాగరికత – సంస్కృతి అన్నీ వేదం నుంచి అవతరించినవే! జీవననాదం వేదం నుంచి ఆవిర్భవించింది' అని ఆయనే చెప్పుకున్నారు. వేదం మానవజాతికి వెలుగు ప్రసాదించింది. కనువిప్పు కలిగించింది. జీవననాదం వినిపించింది. జీవనాధారం చూపింది. జీవనసారం బోధించింది. దాశరథిగారి అక్షరరమ్యతను, జీవనానుభవాన్ని, జీవన సూత్రాల విస్తరణను ఈ చిన్న వ్యాసంలో వివరించడం సాధ్యం కాదు. ఆయనది సాహితీ వామనుని విశ్వరూప సందర్శనం. సాహిత్యంలో వేదానికి సంబంధించిన అతి సరళమైన వచనంతో వెలువడిన గ్రంథం 'వేదం జీవనాదం'.

> **దాశరథి జ్ఞాన సంపాదన సూత్రం వేదం. ఈ రచనలో ఆయన చరిత్ర, పోరాటాలు, సామాజికంగా 'మనిషి'లో కలిగిన పరిణామాలు, మృత్యు పరిష్వంగనలు వంటి వాటితో పాటు స్త్రీ సాధికారత కోసం ప్రారంభమైన పోరాటాలు ఈనాటివి కావని, నాటి రామాయణ, మహాభారత కాలాల నుంచి ఉన్నాయనేది ఇతిహాసపు రుజువులతో వివరిస్తారు.**

ఇతిహాసాల చరిత్రలో మహిళా విముక్తి ఉద్యమాల గురించి ఆయన స్థాలీపులాకన్యాయంగా ఉదహరించారు. ఇందుకు ఉదాహరణలుగా– మహిష్మతి నగరాన్ని పరిపాలించిన నిషధుడు, విశ్వామిత్రుడు– మేనక, మమత, బృహస్పతి వృత్తాంతాలను ప్రస్తావిస్తారు. యవనాశ్వుడు అనే ఇక్ష్వాకు వంశరాజు గురించి వివరించే క్రమంలో మగవారి గర్భధారణ గురించి ఆశ్చర్యపోయే అంశాలను అత్యంత సరళంగా, స్పష్టంగా చెప్పారు. కృత్రిమ సంతానం (టెస్ట్ ట్యూబ్ బేబీ) ఉదంతాన్ని ఐతిహాసిక ఆధారాలతో వివరించిన వైనం దాశరథి వేద విజ్ఞాన పటిమకు నిదర్శనం. ఏ ప్రక్రియ తీసుకున్నా ఆయన తనదైన ముద్రనే వేశారు. అక్షరాలకు భారతీయ ఆత్మతో కూడిన సంప్రదాయాత్మకమైన తాత్వికతనద్దిన ఆధ్యాత్మిక శిలి దాశరథి.

దాశరథి రంగాచార్యులు తెలంగాణ స్వాతంత్ర్య పోరాట యోధుడు. కలం వీరుడు. 1928 ఆగస్టు 24న మహబూబ్ నగర్ జిల్లాలోని చిన్న గూడూరులో జన్మించారు. మార్క్సిజం, సంప్రదాయం భిన్న ధ్రువాలు. ఆ రెండింటి లక్ష్యం ఒక్కటే అయినా దారులు వేరని గ్రహించిన దాశరథి నూతన చక్షువులతో సంప్రదాయాన్ని మార్క్సిజం దృక్పథంతో, మార్క్సిజాన్ని మానవతాదృక్పథంతో అనుసృజన చేశారు. ఉద్యమకాలంలో భారత, రామాయణాలను వ్యతిరేకించినా, స్వాతంత్ర్యం సిద్ధించి ఉద్యమాల నుంచి బయటకు వచ్చిన తర్వాత ఆయన దృక్పథంలో మార్పు వచ్చింది. నవలలు, కథలు, కవిత్వం, అనువాదాలు, వ్యాస సంకలనాలు వెలువరించారు. వేద సాహిత్యాన్ని, భారత, భాగవత, రామాయణాలను తమదైన శైలిలో రచించారు. ఆయనకు అనేక పురస్కారాలు లభించాయి. 2015 జూన్ 7న తన 86వ ఏట ఆయన మరణించారు. జాషువా అన్నట్టు 'కవియు మరణించె ఒక తార గగనమెక్కె'. ప్రజల నాలుకలపైన, సాహితీ సహృదయులు నిరంతరం స్మరించుకునే చిరస్మరణీయులు దాశరథి రంగాచార్యులు.



భమిడిపాటి
గౌరీశంకర్
94928 58395

- జిట్టాకు మాజీ మంత్రులు హరీశ్, తలసాని పరామర్శ



అనారోగ్యంతో హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు జిట్టా బాలకృష్ణారెడ్డిని మాజీ మంత్రులు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆదివారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని కోరారు. అనంతరం జిట్టా కుటుంబ సభ్యులతో హరీశ్‌రావు మాట్లాడారు. వారి వెంట ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి ఉన్నారు. – యాదాద్రి భువనగిరి, నమస్తే తెలంగాణ

వైద్యశాఖలో ఏజెన్సీల దందా

- కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది వేతనాల్లో కోతలు
- నెలకు 2 కోట్లు దండుకుంటున్న ఏజెన్సీలు
- ఏజెన్సీ కట్టాల్సిన పీఎఫ్, ఈఎస్‌ఐ సైతం వేతనాల్లో నుంచే కోత
- ఒక్కో కార్మికుడి నుంచి వెయ్యికి పైగా దోపిడీ



హైదరాబాద్, ఆగస్టు 25 (నమస్తే తెలంగాణ): వైద్యారోగ్య శాఖ పరిధిలోని కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బంది శ్రమదోపిడీకి గురవుతున్నారు. కాంట్రాక్టర్లు, మ్యాన్‌పవర్ ఏజెన్సీలు.. నిబంధనల మేరకు పూర్తి వేతనాలు చెల్లించడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో కార్మికుడికి ప్రతి నెలా సగటున రూ.వెయ్యి వరకు ఎగ్గొడుతున్నారని ఆరోపిస్తున్నారు. దీంతోపాటు వాస్తవంగా పనిచేస్తున్నవారి కంటే, రిజిస్టర్‌లో ఎక్కువ పేర్లు చూపుతున్నారని, ఇలా నెలకు కనీసం రూ.2 కోట్ల వరకు కాంట్రాక్టర్లు దండుకుంటున్నారని చెప్తున్నారు. వైద్యారోగ్య శాఖలో డీఎంఈ, టీవీవీపీలో పెద్ద ఎత్తున కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బంది పనిచేస్తున్నారు. ముఖ్యంగా శానిటేషన్, సెక్యూరిటీ, పేషంట్ కేర్ విభాగాల్లో వీరు విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 10 వేల మందికిపైగా పనిచేస్తున్నట్టు అంచనా. వీరికి ఇచ్చే అరకొర జీతాల్లో అడ్డగోలు కోతలు పెడుతున్నారని, ప్రభుత్వానికి ఇచ్చే లెక్కల్లో మాత్రం పూర్తిగా చెల్లిస్తున్నట్టు చూపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెండు రోజుల కిందట సూర్యాపేటలో వేతనం అందక ప్రభుత్వ దవాఖానలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ఆత్మహత్య నేపథ్యంలో కాంట్రాక్టర్లు, మ్యాన్‌పవర్ ఏజెన్సీల దోపిడీపై వైద్యవర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతున్నది. తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ సైతం ఇవే ఆరోపణలు చేస్తున్నది.

జీతంలో 4,500 కట్

2021 జూన్ 11న నాటి ప్రభుత్వం విడుదల చేసిన జీవో 60లో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలను స్పష్టం చేసింది. గ్రేడ్-1 వర్కర్లకు రూ.15,600, గ్రేడ్-2 వర్కర్లకు రూ.19,500, గ్రేడ్-3 వర్కర్లకు రూ.22,750 వేతనాలు ఇవ్వాలని జీవోలో స్పష్టంగా పేర్కొన్నది. దవాఖానల్లో పనిచేసే కార్మికులు గ్రేడ్-1 క్యాటగిరీలోకి వస్తారు. ఇందులో పీఎఫ్, ఈఎస్‌ఐ కింద రూ.3,507 పోగా, మిగిలిన రూ.12,093 కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాల్సి ఉంటుంది. కానీ, తమకు రూ.11 వేలు మాత్రమే ఇస్తున్నారని కార్మికులు ఆరోపిస్తున్నారు. అంటే ఒక్కొక్కరికి రూ.1093 చొప్పున తగ్గిస్తున్నారు. ఇదేమని అడిగితే పీఎఫ్, ఈఎస్‌ఐ కింద కడుతున్నట్టు చెప్తున్నారని కార్మికులు ఆరోపిస్తున్నారు. వాస్తవానికి కార్మికుల పీఎఫ్, ఈఎస్‌ఐకి సంబంధించి వారి వేతనాల్లో నుంచి సగం, మ్యాన్‌పవర్ ఏజెన్సీలు సగం చెల్లించాల్సి ఉంటుంది. కానీ మ్యాన్ పవర్ ఏజెన్సీలు కట్టాల్సింది కూడా కార్మికులకు వేతనాల్లో నుంచే తీసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దవాఖానల్లో పడకల ఆధారంగా శానిటేషన్, సెక్యూరిటీ, పేషంట్ కేర్ సిబ్బందిని నియమించాల్సి ఉంటుంది. ఉదాహరణకు వంద పడకల దవాఖానకు 45 మంది సిబ్బంది ఉండాలి. వీరు మూడు షిఫ్టుల్లో పనిచేయాలి. కానీ, అనేక చోట్ల పేపర్లపై లెక్కల కన్నా పనిచేసే సిబ్బంది తక్కువగా ఉంటున్నారని చెప్తున్నారు. ఈ వేతనాలు మొత్తం కాంట్రాక్టర్ల జేబుల్లోకి వెళ్తున్నాయని ఆరోపిస్తున్నారు.



బోనాల సందర్భంగా హైకోర్టులో ఆదివారం జరిగిన పూజా కార్యక్రమంలో పాల్గొన్న న్యాయమూర్తులు జస్టిస్ మాధవిదేవి, జస్టిస్ సూరేపల్లి నంద

మంత్రి కంపెనీ.. 'విదేశీ' ష్యూరిటీ

మొదటిపేజీ తరువాయి...

కాలం తీరిపోయాయని, కొత్త గ్యారెంటీలు సమర్పించాలని కోరింది. అంతవరకు బాగానే ఉన్నప్పటికీ, ఈసారి ఎగ్జింబ్యాంకు నుంచి కాకుండా ఏదైనా జాతీయ బ్యాంకు నుంచి కానీ, షెడ్యూల్డ్ బ్యాంకు నుంచి గ్యారెంటీలు సమర్పించాలని లేఖలో స్పష్టంగా పేర్కొన్నది. అయితే, బ్యాంకు గ్యారెంటీల గడువు జూన్ 30న ముగిస్తే ఈ నెల 18న ఏపీఎస్పీడీసీఎల్ లేఖ రాయడం గమనార్హం.

ఎక్కడి కంపెనీ.. ఎక్కడి గ్యారెంటీలు

హైదరాబాద్‌లో ఉండే రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీ ఎక్కడో కరీబియన్ దీవుల్లోని బ్యాంకు నుంచి గ్యారెంటీలు సమర్పించడం అనేక అనుమానాలకు తావిస్తున్నది. దేశంలో బోల్డన్ని బ్యాంకులు ఉండగా దేశం కాని దేశం వెళ్లి అక్కడి నుంచి గ్యారెంటీలు సమర్పించడం అందరినీ ఆశ్చర్యపరుస్తున్నది. మన రాష్ట్రంలో, ఆ మాటకొస్తే మన దేశంలో ఒక్క శాఖ కూడా లేని బ్యాంకు మంత్రి కంపెనీకి గ్యారెంటీలు సమర్పించడం విడ్డూరంగా ఉన్నది.

ఎగ్జింబ్యాంక్‌పై అనేక ఆరోపణలు

వెస్టిండీస్‌లోని సెయింట్ లూసియాలో కేంద్రంగా ఉన్న ఈ యూరో ఎగ్జింబ్యాంక్‌పై అనేక ఆరోపణలున్నాయి. మధ్యప్రదేశ్‌లో ఓ సంస్థ డిఫెన్స్ పనుల కాంట్రాక్టును సాధించింది. పనులు చేపట్టే ముందు ఈ బ్యాంకు నుంచే గ్యారెంటీలు సమర్పించింది. వాటిని ఆధారంగా చేసుకొని అధికారులు పనులు అప్పగించారు. చివరకు ఆ సంస్థ బిచాణా ఎత్తేసింది. పనులను పూర్తిచేయలేదు. దీంతో అధికారులు నష్టపరిహారం కోసం బ్యాంక్ గ్యారెంటీలను స్వాధీనం చేసుకుందామనుకుంటే వాళ్లు సమర్పించిన గ్యారెంటీలు చెల్లలేదు. వాటితో తమకు ఎలాంటి సంబంధమూ లేదని బ్యాంకు తేల్చి చెప్పింది. దీంతో రక్షణశాఖ న్యాయపోరాటం ప్రారంభించింది. యూరో ఎగ్జింబ్యాంక్ మన దేశంలో ఇస్తున్న బ్యాంక్ గ్యారెంటీల పరిస్థితిపై లోక్‌సభ సభ్యుడు కార్తి చిదంబరం భారతీయ రిజర్వు బ్యాంకు గవర్నర్ శక్తికాంతదాస్‌కు లేఖ రాశారు. మన దేశంలో ఎగ్జింబ్యాంక్ కార్యకలాపాలకు ఆర్బీఐ ఎప్పటి నుంచి అనుమతులు ఇస్తున్నది? అసలు వీటిని నమ్మవచ్చా? వీటిపై మనకు నియంత్రణ ఉంటుందా? వీటి పరిధిని ఎలా నిర్దేశించారంటూ ఈ ఏడాది జూలై 31వ తేదీన లేఖ రాశారు. ఎగ్జింబ్యాంక్ ఇచ్చే బ్యాంక్ గ్యారెంటీలపై లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు.

ఏపీలో రూ. 550 కోట్ల విలువైన గ్యారెంటీలు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి మైనింగ్, విద్యుత్తు పంపిణీ, ఉత్పత్తి సంస్థలు, గిడ్డంగుల సంస్థకు రూ. 550 కోట్లమేర ఎగ్జింబ్యాంకు నుంచి ఇచ్చిన గ్యారెంటీలే ఉన్నాయి. ఇక్కడ కాంట్రాక్టర్లు డిఫాల్టయి పనులు చేయలేకపోయినా, ప్రభుత్వానికి ఏదైనా నష్టం వాటిల్లినా బ్యాంకు గ్యారెంటీలను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తే ఎగ్జింబ్యాంకు తనకెలాంటి బాధ్యత లేదని ప్రకటిస్తే ప్రభుత్వాలు చేసేదేమీలేదు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కంపెనీలు విరివిగా ఎగ్జింబ్యాంకు గ్యారెంటీలనే సమర్పిస్తున్నట్టు ఏపీ అధికార వర్గాలు చెప్తున్నాయి.

తీగలకు అడ్డు వస్తే చెట్లను నరుకుతారా?

విద్యుత్తు అధికారులపై ఎమ్మెల్యే హరీశ్‌రావు ఫైర్

సిద్దిపేట, ఆగస్టు 25 : విద్యుత్తు తీగలకు అడ్డు వస్తున్నాయని కొమ్మలను గాకుండా చెట్లనే నరికి వేస్తారా? అంటూ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విద్యుత్తు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో చెట్లను నరకడాన్ని గమనించిన ఆయన ఈ విషయమై విద్యుత్ అధికారులను ప్రశ్నించారు. 'పసిపిల్లల్లా ఇరవై ఏండ్లుగా చెట్లను పెంచాం.. కరెంట్ తీగలకు అడ్డం వస్తే చెట్లను కాదు.. కొమ్మలను నరకండి.. పూర్తిగా చెట్లను నరికివేయడం ఏమిటి? అని నిలదీశారు. ముందుచూపు లేకుండా, పర్యవేక్షణ లేకుండా గుడ్డిగా కార్మికులను పెట్టి చెట్లను తొలగించడంపై మండిపడ్డారు. పర్యావరణానికి ఎంతో ఉపయోగపడే చెట్లను విచక్షణారహితంగా తొలగించడం దుర్మార్గమని, తొలగించాలని ఆదేశించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

మరో పోరాటానికి ఆర్టీసీ కార్మికులు సిద్ధం

- ఉద్యమ కార్యాచరణను ప్రకటించిన జేఏసీ
- 27న నల్లబ్యాడ్జీలతో ఆర్టీసీ ఉద్యోగుల నిరసనలు
- అక్టోబర్ 1న ఇందిరాపార్క్ వద్ద సామూహిక దీక్ష

హైదరాబాద్, ఆగస్టు 25 (నమస్తే తెలంగాణ): పెండింగ్ సమస్యల పరిష్కారంతో పాటు ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తమకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ కార్మికులు మరో పోరాటానికి సిద్ధమయ్యారు. ఈ మేరకు ఆదివారం బాగ్‌లింగంపల్లిలో జరిగిన టీజీఎస్‌ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశంలో జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, థామస్‌రెడ్డి తమ ఉద్యమ కార్యాచరణను ప్రకటించారు. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీన ప్రక్రియను పూర్తి చేయడంతోపాటు కార్మికులకు బకాయిలతో సహా రెండు పీఆర్సీలు చెల్లిస్తామని, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అన్ని వసతులు, సదుపాయాలు కల్పిస్తామని ఇచ్చిన హామీలను నెరవేర్చాలని రేవంత్ సర్కారును కోరారు. అధునాతన సౌకర్యాలతో కొత్త సర్వీసులు ప్రారంభిస్తామని, యూనియన్లను పునరుద్ధరిస్తామని, కార్మికులను పీఆర్సీ పరిధిలోకి తీసుకొస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. 9 నెలలు గడుస్తున్నా ఒక్క హామీని నెరవేర్చలేదని మండిపడ్డారు. రేవంత్ సర్కారు తీరును ఎండగడుతూ ఈ నెల 27న రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ ఉద్యోగులంతా నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపాలని పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 10న డిమాండ్స్ డే బ్యాడ్జీలు ధరించి విధులు నిర్వర్తిస్తామని, అక్టోబర్ 1న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద సామూహిక దీక్ష నిర్వహిస్తామని వెంకన్న, థామస్‌రెడ్డి తెలిపారు.


తల్లిని హతమార్చి.. కొడుకు ఆత్మహత్య

నల్లగొండ జిల్లా నిడమనూరులో ఘటన

నిడమనూరు, ఆగస్టు 25: మద్యానికి డబ్బులు ఇవ్వలేదన్న కోపంతో ఓ వ్యక్తి తల్లి గొంతు కోసి ఆపై తాను ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లా నిడమనూరులో ఆదివారం వెలుగుచూసింది. పోలీసులు కథనం ప్రకారం.. రావిరాల శివకుమార్(36) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి అక్క కూతురితో వివాహమైంది. ఆ తరువాత అతడు భార్యతో తరచూ గొడవ పడేవాడు. మూడు నెలల క్రితం పంచాయితీ పెట్టి విడాకులు తీసుకున్నారు. ఈ ఘటన తర్వాత మద్యానికి డబ్బులివ్వాలంటూ తల్లి దండ్రులతో గొడవ పడేవాడు. శనివారం రాత్రి కూడా తల్లిని డబ్బులివ్వాలని కోరగా లేవని చెప్పింది. ఆమెపై మరింత కోపం పెంచుకున్నాడు. బయటకు వెళ్లి మద్యం తాగి అర్ధరాత్రి ఇంటికి వచ్చాడు. అప్పటికే మంచంపై నిద్రిస్తున్న తల్లి గొంతును కూరగాయల కత్తితో కోశాడు. ఆమె ప్రాణాలు విడవగానే.. అదే కత్తితో శివకుమార్ తన గొంతు కోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

విద్య, వైద్యంపై సర్కారు నిర్లక్ష్యం

- గాంధీ, ఉస్మానియాలో మందులు లేవు
- గురుకులాల్లో కలుషితాహారం
- సుపరిపాలన వేదిక అధ్యక్షుడు పద్మనాభరెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 25 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక నెరవేర్చేందుకు సతమతమవుతున్నదని సుపరిపాలన వేదిక అధ్యక్షుడు పద్మనాభరెడ్డి విమర్శించారు. రాష్ట్రంలో విద్య, వైద్యం అధ్వానంగా తయారైందని, గాంధీ, ఉస్మానియా వంటి ప్రధాన దవాఖానల్లో మందులు లేవని మండిపడ్డారు. ఓ యూట్యూబ్ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. ధర్మాసుపత్రుల్లో ఓపీలు మాత్రమే నడుస్తున్నాయని, ఫార్మసీల్లో మందులు లేకపోవడంవల్ల ప్రైవేటు దుకాణాల్లో కొనుగోలు చేయాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. గురుకులాల్లోనూ కలుషితాహారం ఘటనలు తరచూ వెలుగులోకి వస్తున్నాయని తెలిపారు. ఇప్పటికైనా ఉచితాలకు బ్రేకులు వేసి నాణ్యమైన విద్య, వైద్యంపై ప్రభుత్వం దృష్టిపెట్టాలని సూచించారు.

హైడ్రా బాధితులకు ప్రభుత్వం స్థలం కేటాయించాలి

హైడ్రా చేపడుతున్న చర్యలపై పద్మనాభరెడ్డి స్పందిస్తూ, పేదలు, మధ్యతరగతి వర్గాలపై మానవీయ కోణంలో వ్యవహరించాలని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు మంజూరు చేసిన అధికారులపై చర్యలకు ప్రభుత్వం ఓ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. అన్ని అనుమతులూ ఉండటంతో పేద, మధ్యతరగతి వర్గాలు కూడబెట్టుకున్న సొమ్ముతో ఇండ్లను కొనుగోలు చేశారని, ఇప్పుడు వాటిని కూలగొట్టడంతో తీవ్ర ఇబ్బందుల్లో పడ్డారని పేర్కొన్నారు. ప్రభుత్వ అనుమతులు ఉన్నాయనే భరోసాతో కొనుగోలు చేసినవారికి మరోచోట ప్రభుత్వం స్థలాలు కేటాయించాలని కోరారు.

రాబడి

ఫిక్స్‌డ్ Vs ఫ్లోటింగ్


గృహ రుణాలపైనున్న ఈ వడ్డీరేట్లలో తేడాలేంటి?

ఫిక్స్‌డ్ రేటు

మనం తీసుకున్న గృహ రుణంపై వడ్డీరేటు ఫిక్స్‌డ్‌గా ఉంటే.. రుణ కాలపరిమితి మొత్తం ఒకే రకమైన వడ్డీరేటు ఉంటుంది. దీంతో ఈఎంఐ (నెలవారీ వాయిదా మొత్తాలు)ల్లో ఎలాంటి మార్పులూ ఉండవు. అయితే కొన్ని బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)లు కొంత కాలం తర్వాత ఫిక్స్‌డ్ రేటును ఫ్లోటింగ్ రేటుగా మార్చుకునేందుకు రుణగ్రహీతలకు అవకాశం ఇస్తున్నాయి.

ఫ్లోటింగ్ రేటు


తీసుకున్న హోమ్ లోన్‌పై ఫ్లోటింగ్ వడ్డీరేటు ఉంటే.. రుణ కాలపరిమితిలో వడ్డీరేట్లు మారుతూ ఉంటాయి. మార్కెట్ ఒడిదొడుకులు, రిజర్వ్ బ్యాంక్ రెపో రేటు ఆధారంగా వడ్డీరేట్లలో హెచ్చుతగ్గులకు వీలుంటుంది. దీనివల్ల రుణ గ్రహీతలు చెల్లించే ఈఎంఐలు కూడా ఎక్కువ, తక్కువ అవుతుంటాయి. లేదా రుణ కాలపరిమితి తగ్గుతూ, పెరుగుతూ ఉంటుంది.



	ఫిక్స్‌డ్ రేటు	ఫ్లోటింగ్ రేటు
వడ్డీరేటు	రుణ కాలపరిమితి మొత్తంగా ఒకేలా ఉంటుంది.	బెంచ్‌మార్క్ రేటు ప్రకారం మారుతుంది.
ఆరంభంలో	ఫ్లోటింగ్ రేటు కంటే 1-2% ఎక్కువగా ఉంటుంది.	ఫిక్స్‌డ్ రేటు కంటే తక్కువగా ఉన్నా తర్వాత పెరుగుతుంది.
టెన్యూర్	రుణ కాలపరిమితి మారదు.	వడ్డీరేట్లనుబట్టి కాలపరిమితి మార్పు
ఈఎంఐ	మారదు.	వడ్డీరేట్లు తగ్గినప్పుడు, పెరిగినప్పుడు మారగలదు.
ముందస్తు చెల్లింపు	జరిమానాలుంటాయి.	జరిమానాలు పడవు.
ఎప్పుడు ఎంచుకోవచ్చు	వడ్డీరేట్లు పెరిగే వీలుందని తెలిస్తే ఫిక్స్‌డ్ రేట్లు ఉత్తమం.	వడ్డీరేట్లు తగ్గుతాయనుకుంటే ఫ్లోటింగ్ రేట్లే లాభం.
గుర్తుంచుకోండి	5-10 ఏండ్ల వ్యవధితో రుణాలు తీసుకుంటే ఇది లాభం.	15-20 ఏండ్లపాటు రుణ చెల్లింపులుంటే దీనివల్ల ప్రయోజనం.


- కాబట్టి గృహ రుణం తీసుకునే ముందు ఏ రేటు మంచిదో తెలుసుకునిమరీ ఓ నిర్ణయానికి రావడం తెలివైన పని.

ఎఫ్‌డీ రేట్లు పెరిగాయ్



ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) అనేది ఓ సురక్షిత పెట్టుబడి సాధనం. అంతేగాక హామీపూర్వక రాబడి పథకం కూడా. నిర్దిష్ట రీతిలో చేసే ఏకకాల నగదు మొత్తాలపై నిర్ణీత కాలవ్యవధులకుగాను స్పష్టమైన వడ్డీరేట్లను ఇందులో చెల్లిస్తారు. పోస్టాఫీస్, ప్రభుత్వ-ప్రైవేట్ రంగ బ్యాంకులు, స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)ల్లో ఎఫ్‌డీ స్కీములు అందుబాటులో ఉంటున్నాయి. మార్కెట్ రిస్కులకు దూరంగా ఉండాలనుకునే మదుపరులకు ఈ ఎఫ్‌డీలు చక్కని పెట్టుబడి సాధనాలని చెప్పవచ్చు. అలాగే తమ పెట్టుబడుల్లో వైవిధ్యాన్ని చూపుతూ మార్కెట్, నాన్-మార్కెట్ లింక్డ్ ఆప్షన్లను ఎంచుకోవాలనుకునేవారికీ ఎఫ్‌డీలు సరైనవే. అయితే సాధారణ డిపాజిటర్లకు, సీనియర్ సిటిజన్స్‌కు వడ్డీరేట్లలో తేడాలూ ఉంటాయి. సీనియర్ సిటిజన్స్‌కు కొంత ఎక్కువ మొత్తంలో ఆయా బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు వడ్డీ రేటునిస్తున్నాయి. కాగా, బ్యాంకులు రుణాలను ఎక్కువగా ఇస్తున్నాయని, డిపాజిట్లు మాత్రం తగ్గిపోతున్నాయని, రెండింటి మధ్య బ్యాలెన్స్ లేకపోతే చిక్కులు తప్పవని అటు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ), ఇటు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో బ్యాంకింగ్ రంగం ఎఫ్‌డీల వృద్ధిపై దృష్టి సారించింది. ఇందులో భాగంగానే డిపాజిటర్లను ఆకర్షించేందుకు వివిధ కాలపరిమితి ఎఫ్‌డీలపై ఇటీవల వడ్డీరేట్లను పెంచాయి. ప్రస్తుతం జనరల్, సీనియర్ సిటిజన్స్‌కు అత్యుత్తమ వడ్డీరేట్లు ఏ సంస్థల్లో, మరే టెన్యూర్స్‌పై ఉన్నాయో ఒక్కసారి చూద్దాం.

- 500 రోజుల ఎఫ్‌డీపై ఆర్బీఎల్ బ్యాంక్ సాధారణ కస్టమర్లకు అత్యధికంగా 8.10 శాతం వడ్డీ ఇస్తున్నది. సీనియర్ సిటిజన్లకైతే 8.60 శాతం ప్రకటించింది.
- 4 ఏండ్ల 7 నెలల (55 నెలలు) ఎఫ్‌డీపై హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 7.40 శాతం వడ్డీరేటును అందిస్తున్నది.
- 666 రోజుల ఎఫ్‌డీపై బ్యాంక్ ఆఫ్ ఇండియా వడ్డీరేటు 7.30 శాతం.
- 444 రోజుల ఎఫ్‌డీపై ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ 7.30 శాతం వడ్డీరేటును ఇస్తున్నది.
- 444 రోజుల ఎఫ్‌డీలపై ఎస్బీఐ, కెనరా బ్యాంకులు 7.25 శాతం వడ్డీరేటునిస్తున్నాయి. సీనియర్ సిటిజన్లకైతే 7.75 శాతం వడ్డీనిస్తున్నది ఎస్బీఐ.
- 15 నెలలు-రెండేండ్ల కాలవ్యవధి ఎఫ్‌డీలకుగాను ఐసీఐసీఐ బ్యాంక్ 7.25 శాతం వడ్డీరేటును ప్రకటించింది.
- 399 రోజుల ఎఫ్‌డీపై బ్యాంక్ ఆఫ్ బరోడాలో 7.25 శాతం వడ్డీరేటు నడుస్తున్నది. సీనియర్ సిటిజన్లకు 7.75 శాతం వడ్డీ వస్తుంది. 333 రోజుల ఎఫ్‌డీ కూడా ఉన్నది. దీనిపై సాధారణ డిపాజిటర్లకు 7.15 శాతం, సీనియర్ సిటిజన్లకు 7.65 శాతం వడ్డీ అందుతుంది.
- 400 రోజుల ఎఫ్‌డీపై పంజాబ్ నేషనల్ బ్యాంక్ 7.25 శాతం వడ్డీరేటును చెల్లిస్తున్నది.
- 400 రోజుల ఎఫ్‌డీపై సాధారణ డిపాజిటర్లకు 7.25 శాతం, సీనియర్ సిటిజన్లకు 7.75 శాతం వడ్డీ ఇండియన్ బ్యాంక్ ఇస్తున్నది. 300 రోజుల ఎఫ్‌డీకి వడ్డీరేట్లు వరుసగా 7.05 శాతం, 7.55 శాతంగా ఉన్నాయి.
- 17 నెలల ఎఫ్‌డీకి యాక్సిస్ బ్యాంక్ 7.20 శాతం వడ్డీరేటును ఆఫర్ చేస్తున్నది.
- 375 రోజుల ఎఫ్‌డీపై ఐడీబీఐ బ్యాంక్ వడ్డీరేటు 7.25 శాతం. సీనియర్ సిటిజన్లకు 7.75 శాతం. 444 రోజుల ఎఫ్‌డీపై సాధారణంగా 7.35 శాతం వడ్డీ వస్తున్నది. సీనియర్ సిటిజన్లకు 7.85 శాతం లభిస్తుంది.



ఎఫ్‌డీల్లో ఏయే రకాలు?

ఫిక్స్‌డ్ డిపాజిట్లలో అనేక రకాలున్నాయి. కాబట్టి పెట్టుబడులు పెట్టే ముందు వాటి గురించి తెలుసుకోవడం ఉత్తమం. అప్పుడే మీ అవసరాలకు తగిన విధంగా డిపాజిట్లు చేయగలరు.

- **కార్పొరేట్ ఎఫ్‌డీలు**
  ఈ ఎఫ్‌డీలను కంపెనీలు (బ్యాంకులు మినహా) చేస్తాయి.
- **స్టాండర్డ్ ఎఫ్‌డీలు**
  ఇవి బేసిక్ ఇన్వెస్ట్‌మెంట్ స్కీములు. నిర్దిష్ట కాలవ్యవధి పూర్తయిన తర్వాత డిపాజిట్లను తీసుకోవచ్చు.
- **సీనియర్ సిటిజన్ ఎఫ్‌డీలు**
  60 ఏండ్ల వయసు దాటినవారు మాత్రమే వీటికి అర్హులు. చాలా సంస్థలు వీరికి ప్రత్యేకంగా వడ్డీరేటును అధికంగా చెల్లిస్తాయి.
- **ట్యాక్స్-సేవింగ్ ఎఫ్‌డీలు**
  వీటికి పన్ను మినహాయింపులుంటాయి. అయితే గరిష్ఠంగా ఏటా రూ.1.5 లక్షల వరకే డిపాజిట్ చేసుకోవచ్చు. ఎఫ్‌డీ కాలవ్యవధి కూడా ఐదేండ్లుంటుంది.
- **క్యుములేటివ్ ఎఫ్‌డీలు**
  త్రైమాసిక, అర్ధవార్షిక, వార్షిక ప్రాతిపదికన వడ్డీల జమ ఉంటుంది. కాలపరిమితి తీరితేనే వడ్డీ చెల్లింపు.
- **నాన్-క్యుములేటివ్ ఎఫ్‌డీలు**
  నెల, త్రైమాసిక, అర్ధవార్షిక లెక్కన వడ్డీ మొత్తాలను తీసుకోవచ్చు. రెగ్యులర్ ఇన్‌కమ్ కోరుకునేవారికి అనువైనవి. పెన్షనర్లకు లాభం.
- **ఫ్లెక్సీ ఎఫ్‌డీ ప్లాన్లు**
  వీటిలో డిపాజిటర్లు తమ సేవింగ్స్ అకౌంట్‌తో ఎఫ్‌డీ అకౌంట్‌ను అనుసంధానం చేసుకోవచ్చు. అధిక వడ్డీ రేట్లను పొందే వీలున్నది.
- **ఎన్ఆర్‌వో ఎఫ్‌డీ అకౌంట్**
  ఎన్నారైలు భారత్ నుంచి పొందే ఆదాయాన్ని ఈ నాన్-రెసిడెంట్ ఆర్డినరీ (ఎన్ఆర్‌వో) ఖాతాల్లో డిపాజిట్ చేసుకోవచ్చు. దీనిపై వచ్చే వడ్డీని పూర్తిగా తీసుకోవచ్చు. కానీ పన్నులు వర్తిస్తాయి. అలాగే చేసిన డిపాజిట్‌లో మాత్రం నిర్దేశిత పరిమితి మేరకే ఉపసంహరించుకోవడానికి వీలుంటుంది.
- **ఎన్ఆర్ఈ ఎఫ్‌డీ అకౌంట్**
  ప్రవాస భారతీయులు ఈ నాన్-రెసిడెంట్ ఎక్స్‌టర్నల్ (ఎన్ఆర్ఈ) ఖాతాను భారత్‌లో నిర్వహించవచ్చు. విదేశాల్లో సంపాదించిన సొమ్మును ఇందులో డిపాజిట్ చేసుకోవచ్చు. అలాగే ఈ డిపాజిట్లను, వాటిపై పొందే వడ్డీ మొత్తాలను పూర్తిగా వెనక్కి తీసుకోవచ్చు. పైగా వడ్డీలకు పన్ను ఉండవు.



అప్రమత్తత అవసరం

దేశీయ స్టాక్ మార్కెట్లు గత వారం లాభాల్లో కదలాడాయి. మదుపరులలో కొనుగోళ్ల ఉత్సాహం కనిపించింది. దీంతో ఓవరాల్‌గా క్రిందటి వారం మార్కెట్లు లాభాలనే సంతరించుకున్నాయి. ఫలితంగా అంతకు ముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 649.37 పాయింట్లు ఎగిసి 81,086.21 వద్ద స్థిరపడింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 282 పాయింట్లు ఎగబాకి 24,823.15 దగ్గర నిలిచింది. అయితే సూచీలు వరుస లాభాల్లో, పైగా ఆల్‌టైమ్ హై దరిదాపుల్లో ఉన్నందున ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉన్నది. సెల్లింగ్ ప్రెషర్ లేదా లాభాల స్వీకరణకు ఆస్కారం ఉందని మెజారిటీ మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇదిలావుంటే ఈ వారం ఒడిదొడుకులకు అవకాశం కనిపిస్తున్నదంటున్నారు. వివిధ పరిణామాలు మార్కెట్లపై ప్రభావం చూపనున్నాయి. కాగా, అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 24,600 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 24,300 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 25,100-25,300 మధ్యకు నిఫ్టీ వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

చివరగా..

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. ట్రేడింగ్‌ను అనేక అంశాలు ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం మంచిది. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.

• గిరిజనులకు తప్పని తాగునీటికష్టాలు



వానకాలంలోనూ గిరిజనులకు నీటి కష్టాలు తప్పలేదు. పదిహేను రోజులుగా మిషన్ భగీరథ నీరు రాక సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం మెడుకుంద్యా తండాలోని గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో కిలో మీటరు దూరంలోని చెరువు నుంచి తాగేందుకు నీటిని తెచ్చుకుంటున్నారు. చెరువు నీటిని వాడటం వల్ల పిల్లలకు వాంతులు, విరేచనాలు, విషజ్వరాలు సోకుతున్నాయని వారు ఆందోళన చెందుతున్నారు.

– వట్‌పల్లి

• పట్టాల మధ్యలో మృత్యుంజయురాలు



వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలంలోని ఓ తండాకు చెందిన గిరిజన మహిళ ఆదివారం సాయంత్రం పనులు ముగించుకుని ఇంటికి వెళ్తున్నది. నవంద్గి (బషీరాబాద్) రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలు దాటుతుండగా.. వేగంగా గూడ్స్ రైలు దూసుకొచ్చింది. దీంతో గమనించిన ఆమె ధైర్యం చేసి పట్టాల మధ్యలో పడుకున్నది. రైలు వెళ్లిపోయాక పైకి లేచింది. దీంతో అక్కడ ఉన్న వారు ఆమె ధైర్యాన్ని మెచ్చుకున్నారు.

– బషీరాబాద్



మాట్లాడుతున్న బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు

మధ్యాహ్న భోజన కార్మికుల వేతనం పెంచాలి

బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు

చిక్కడపల్లి, ఆగస్టు 25 : మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10వేల వేతనం ఇవ్వాలని బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఇందిరాపార్క్ వద్ద నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.వెయ్యి వేతనం 3వేలకు పెంచారని గుర్తు చేశారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో వంట కార్మికులకు 10వేలు ఇస్తామని మభ్యపెట్టి ఓట్లు వేయించుకున్న రేవంత్‌రెడ్డి అమలుచేయకుండా మోసగించారని మండిపడ్డారు. ధర్నాకు మల్కాజిగిరి ఎంపీ ఈటల మద్దతు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు హన్మాండ్లుచారి, ప్రధాన కార్యదర్శి బాబాయి, భా రతి, సంతోష, మంజుల, శేషన్న పాల్గొన్నారు.

• మున్నూరుకాపుల మౌనదీక్ష



మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేసి జనాభా ప్రతిపాదికన తమకు అన్ని రంగాల్లో రిజర్వేషన్ కల్పించాలని మున్నూరు కాపు కులస్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలకేంద్రంలోని మున్నూరుకాపు సంఘ భవనంలో ఆదివారం మౌనదీక్ష చేపట్టారు.

– మద్నూర్

డెంగ్యూతో యువకుడి మృతి

విషజ్వరంతో చిన్నారి..

రామారెడ్డి/కొత్తగూడ, ఆగస్టు 25: రాష్ట్రంలో డెంగ్యూ, విషజ్వరాల బారిన పడి ప్రజలు ప్రాణాలు కోల్పోతూనే ఉన్నారు. ఆదివారం డెంగ్యూతో యువకుడు, విషజ్వరంతో చిన్నారి మృతిచెందారు. కామారెడ్డి జిల్లా సదాశివనగర్‌కు చెందిన చిలుక నరేశ్(28) ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో ఉంటున్నాడు. అతడికి మూడ్రోజుల క్రితం జ్వరం రావడంతో కామారెడ్డిలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చేర్చారు. పరిస్థితి విషమించగా హైదరాబాద్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం హనుమాన్‌తండాకు చెందిన భూక్యా రాజేందర్–సంధ్య దంపతుల కూతురు రూప(18 నెలలు)కు ఐదురోజుల క్రితం జ్వరం రావడంతో నర్సంపేటలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎంకు తరలిస్తుండగా మృతి చెందింది.

అమెరికాలో సూర్యాపేట జిల్లా వాసి మృతి

సూర్యాపేట, ఆగస్టు 25(ఆత్మకూర్.ఎస్) : సూర్యాపేట జిల్లా ఆత్మకూర్.ఎస్ మండలం పాతర్లపహాడ్‌కు చెందిన ప్రవీణ్‌కుమార్ (39) అమెరికాలోని స్విమ్మింగ్‌పూల్‌లో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. ప్రవీణ్ ఐదేండ్ల క్రితం టీచర్‌గా అమెరికా వెళ్లాడు. భారత కాలమానం ప్రకారం శనివారం ఉదయం 8 గంటలకు ప్రవీణ్‌కుమార్ సమీపంలోని స్విమ్మింగ్ పూల్‌కు వెళ్లి ప్రమాదవశాత్తు అందులో మునిగి మృతి చెందినట్టు అతడి భార్య కుటుంబ సభ్యులకు తెలిపింది.

నల్లగొండ దవాఖానలో మరో దారుణం

- డాక్టర్ల నిర్లక్ష్యంతో ప్రసవంలోనే శిశువు మృతి!
- ప్రైవేట్‌కు తరలిస్తుండగా అడ్డగించి ప్రసవం చేసిన వైద్యులు
- డాక్టర్లు, నర్సుల నిర్లక్ష్యమేనంటూ బాధితుల ఆందోళన
- కుర్చీలో గర్భిణి ప్రసవం ఘటన మరువక ముందే..



మీడియాతో మాట్లాడుతున్న బాధితురాలు శ్రీలత భర్త రాజు

రామగిరి, ఆగస్టు 25 : నల్లగొండ జిల్లా కేంద్ర దవాఖానలో మరో దారుణ ఘటన చోటుచేసుకున్నది. కుర్చీలో గర్భిణి ప్రసవం జరిగిన విషయం మరువకముందే వైద్యులు, సిబ్బంది నిర్వాకంతో మరో మహిళ గర్భంలోనే శిశువు మృతిచెందింది. శ్రీలత భర్త రాజు మీడియాకు తెలిపిన వివరాల ప్రకారం.. మాడ్గులపల్లి మండలం గారకుంట పాలేనికి చెందిన చెరుకుపల్లి శ్రీలతను ప్రసవం కోసం కుటుంబ సభ్యులు శుక్రవారం నల్లగొండలోని మాతా శిశు సంరక్షణ కేంద్రానికి తీసుకొచ్చారు. శనివారం సాయంత్రం 6 గంటల వరకు వైద్యులు పట్టించుకోకపోవడంతో ఆందోళన చెందిన బాధితులు ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్తుండగా సిబ్బంది, డ్యూటీ డాక్టర్ అడ్డగించారు. హడావిడిగా రాత్రి ఆపరేషన్ థియేటర్‌కు తీసుకెళ్లి ఆపరేషన్ చేస్తుండగానే మగ శిశువు గర్భంలోనే మృతిచెందింది. సకాలంలో వైద్యం అందకపోవడంతోనే శిశువు చనిపోయినట్టు బాధితులు ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు. శిశువు శరీరంపై గాయాలున్నాయని, వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతి చెందినట్టు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. గురువారం ఇదే దవాఖానలో 'కుర్చీలోనే ప్రసవం' ఘటనకు సంబంధించి అదనపు కలెక్టర్ పూర్ణచందర్ సంబంధిత డాక్టర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. దాంతో శనివారం డాక్టర్లు మూకుమ్మడిగా సెలవులు పెట్టడంతో వైద్య సేవలు కొనసాగలేదు. ఈ క్రమంలోనే శ్రీలత మాతాశిశు సంరక్షణ కేంద్రానికి రావడం.. సరైన సమయంలో వైద్యం అందక పోవడం, ఆపరేషన్ చేస్తున్న క్రమంలో శిశువు మృతి చెందడంతో ఈ దవాఖాన పేరు మరోమారు చర్చల్లోకి ఎక్కింది. రాత్రి నల్లగొండ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి, దవాఖాన ఎదుట ధర్నాకు దిగారు.

బాలికపై బాలుడి లైంగికదాడి

ఆసిఫాబాద్ టౌన్, ఆగస్టు 25 : 16 ఏండ్ల బాలుడు.. 13ఏండ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన కుమ్రంభీం జిల్లా కేంద్రంలో ఆదివారం ఆలస్యంగా వెలుగుచూసింది. డీఎస్పీ సదయ్య కథనం ప్రకారం.. ఆసిఫాబాద్‌కు చెందిన ఓ బాలుడు మత్తు పదార్థాలకు బానిసయ్యాడు. ఈ క్రమంలో ఓ బాలికతో స్నేహం చేసి ప్రేమ పేరుతో దగ్గరయ్యాడు. ఇటీవల వీడియోకాల్ చేసి నగ్నంగా కన్పిస్తూ మాట్లాడాలని కోరాడు. మొదట ఒప్పుకోని ఆ బాలిక తర్వాత అంగీకరించింది. ఆమె ఫోన్‌లో నగ్నంగా కన్పించగా స్క్రీన్ షాట్స్ తీశాడు. తరువాత ఆ ఫొటోలు చూపించి బ్లాక్‌మెయిల్ చేసి లైంగికదాడి చేశాడు. విషయం తెలుసుకున్న బాలిక తండ్రి 23న పోలీసులకు ఫిర్యాదు చేయగా, అతడిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్, ఇన్‌చార్జి జువెనైల్ జస్టిస్ బోర్డు ఆసిఫాబాద్ కోర్టు ఎదుట హాజరుపర్చారు.

వానకాలంలోనూ భారీగా విద్యుత్తు వినియోగం

- వేసవి తరహాలో గణనీయంగా పెరిగిన డిమాండ్



హైదరాబాద్, ఆగస్టు 25 (నమస్తే తెలంగాణ): వానకాలంలో సహజంగా విద్యుత్తు వినియోగం తక్కువగా ఉంటుంది. కానీ, ఇప్పుడు రాష్ట్రంలో పరిస్థితి ఇందుకు విరుద్ధంగా ఉన్నది. జోరు వానకాలంలోనూ విద్యుత్తు వినియోగం ఎండాకాలాన్ని తలపిస్తున్నది. గత నెల వరకు మధ్యస్థంగా ఉన్న విద్యుత్తు వినియోగం ఈ నెలలో అమాంతం పెరిగింది. ఈ డిమాండ్‌ను అధిగమించేందుకు రాష్ట్ర విద్యుత్తు సంస్థలు విద్యుత్తును కొనాల్సిన పరిస్థితి. విద్యుత్తు వినియోగం అంచనాలకు మించి పెరుగుతుండటంతో డిస్కమ్‌లు రోజుకు రూ.8–9 కోట్లు వెచ్చించి విద్యుత్తును కొనుగోలుచేయాల్సి వస్తున్నది. డిమాండ్ మరింత పెరిగితే విద్యుత్తు కొనుగోలుకు మరింత ఖర్చు చేయాల్సి వస్తున్నదని విద్యుత్తు సంస్థల అధికారులు చెప్తున్నారు.

జూలైలో వినియోగం తక్కువే

వాస్తవానికి ఈ ఏడాది జూలైలో విద్యుత్తు వినియోగం తక్కువగానే నమోదైంది. గత నెలలో రాష్ట్రవ్యాప్తంగా రోజుకు సగటున 180 మిలియన్ యూనిట్ల విద్యుత్తు మాత్రమే వినియోగమైంది. కానీ, గత వారంలో ఈ వినియోగం 190 మిలియన్ యూనిట్లకు చేరింది. జూలైలో గరిష్ఠ విద్యుత్తు డిమాండ్ 10 వేల మెగావాట్ల కంటే తక్కువగా ఉండగా.. ఈ నెలలో అది 14 వేల మెగావాట్లకు పెరిగింది. సెలవు దినంగా పరిగణించే ఆగస్టు 15న గరిష్ఠ డిమాండ్ 14,268 మెగావాట్లకు, విద్యుతు వినియోగం 287.48 మిలియన్ యూనిట్లకు చేరుకున్నది. ఇది ఏప్రిల్, మే నెలల్లో నమోదయ్యే వినియోగం కంటే అధికం కావడం గమనార్హం. ఇటీవల వర్షాలతో కృష్ణా రిజర్వాయర్లలో ఇన్‌ఫ్లో పెరగడంతోపాటు భూగర్భజలాలు సైతం వృద్ధి చెందాయి. ఫలితంగా వ్యవసాయానికి నీటి వినియోగం తగ్గడంతో మోటర్లు, పంపుసెట్లు నడపాల్సిన అవసరం అంతంతమాత్రంగానే ఉన్నది. వేసవితో పోల్చితే ఉష్ణోగ్రతలు తగ్గడంతో గృహ విద్యుత్తు వినియోగం క్రమంగా తగ్గుతున్నది.

పీక్ డిమాండ్

తేదీ	మెగావాట్లు
16-8-2024	14,698
15-8-2024	14,268
14-8-2024	14,765
13-8-2024	14,563

విద్యుత్తు వినియోగ తీరు

తేదీ	మిలియన్ యూనిట్లు
ఆగస్టు 13	290.542
ఆగస్టు 14	294.414
ఆగస్టు 15	287.486
ఆగస్టు 16	288.52



ఇండియా డే వేడుకల్లో జాతీయ నాయకులు, తెలంగాణ ప్రముఖుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న అనిల్ కూర్మాచలం తదితరులు

లండన్‌లో ఇండియా డే వేడుకలు

- మన రాష్ట్రానికి టాక్ ప్రాతినిథ్యం
- తెలంగాణ స్టాల్‌ను ప్రారంభించిన కార్పొరేషన్ మాజీ చైర్మన్ కూర్మాచలం

హైదరాబాద్, ఆగస్టు 25 (నమస్తే తెలంగాణ): లండన్‌లో భారత హై కమిషన్‌తో పాటు దేశానికి చెందిన వివిధ రాష్ట్రాల ప్రవాస సంఘాల ఆధ్వర్యంలో భారత 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'ఇండియా డే వేడుకలు' ఘనంగా నిర్వహించారు. వేడుకలకు తెలంగాణ అసోసియేషన్ అఫ్ యునైటెడ్ కింగ్డమ్(టాక్) రాష్ట్రానికి ప్రాతినిథ్యం వహించింది. భారత హైకమిషనర్ విక్రమ్ దొరైస్వామి జాతీయ జెండా ఆవిష్కరించారు. టాక్ ఏర్పాటు చేసిన స్టాల్‌ను రాష్ట్ర ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, టాక్ వ్యవస్థాపకుడు అనిల్ కూర్మాచలం ప్రారంభించారు. యూకే నలుమూలల నుంచి వేలమంది ప్రవాస భారతీయులు హాజరయ్యారు. విక్రమ్ దొరైస్వామి, ఎన్నారై, మాజీ ఎంపీ వీరేంద్రశర్మ, స్థానిక సంస్థల ప్రతినిధులు తెలంగాణ స్టాల్‌ను సందర్శించారు. స్టాల్‌లో ఏర్పాటుచేసిన జాతీయ నాయకులు, తెలంగాణ ప్రముఖుల చిత్రపటాలకు నివాళులర్పించారు. హైదరాబాద్ బిర్యాని రుచి చూశారు. కార్యక్రమంలో టాక్ కార్యదర్శి రవి రేతినేని, ఉపాధ్యక్షుడు సత్య చిలుముల, సీనియర్ నేత నవీన్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు సత్య చిలుముల, వెంకట్ రెడ్డి, సురేశ్ బుడగం, రవి రేతినేని, స్వాతి, రవి పులుసు, క్రాంతి రేతినేని తదితరులు పాల్గొన్నారు.

• ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల పని రైతులదేనా?



మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం రూప్లాతండా పరిధిలోని సబ్‌స్టేషన్ సమీపంలో 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్ పోవడంతో కరెంటు సరఫరా నిలిచియింది. స్థానికులు విలేజ్ హెల్పర్‌కు పలుమార్లు ఫోన్ చేసినా స్పందించ లేదు. బీల్యాతండాకు చెందిన రైతు లాకవత్ రవి మిరప తోట నాటు వేసేందుకు నీళ్లు పెట్టాల్సి ఉంది. చేసేది లేక తానే స్వయంగా ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కి ఫ్యూజులు వేసి టవల్‌తో ట్రాన్స్‌ఫార్మర్ ఆన్ చేశాడు.

– నర్సింహులపేట

కరెంట్ స్తంభం విరిగి పడి బాలుడి మృతి

అలంపూర్, ఆగస్టు 25: విద్యుత్ స్తంభం విరిగి బాలుడిపై పడడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్‌లో ఆదివారం చోటు చేసుకున్నది. పట్టణంలోని 8వ వార్డులోని తెలుగు మానస, చిన్నమద్దిలేటి దంపతులకు కుమారుడు మహేశ్(4), కూతురు ఉన్నారు. చిన్న మద్దిలేటి ఇంటి పక్కన ఉన్న వారి ఇంట్లో పెండ్లి పందిరి వేసేందుకు చెట్టుకొమ్మలు తొలగిస్తుండగా అవి విద్యుత్‌తీగలపై పడ్డాయి. స్తంభం విరిగి ఇంటి ముందు ఆడుకుంటున్న మహేశ్‌పై పడగా మృతి చెందాడు.

25 పబ్బుల్లో ఎక్సైజ్ తనిఖీలు

హైదరాబాద్, ఆగస్టు 25 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోని 25 పబ్బుల్లో ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం అర్ధరాత్రి తనిఖీలు చేపట్టారు. పలువురిని డ్రగ్ డిటెక్షన్ కిట్స్‌తో పరీక్షించారు. కొందరి నుంచి శాంపిళ్లు సేకరించారు. వీకెండ్స్‌లో పలువురు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు డ్రగ్స్ తీసుకుంటున్నారన్న సమాచారం మేరకు సోదాలు చేశామని, ఎవరికీ పాజిటివ్ రాలేదని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. జాయింట్ డైరెక్టర్ ఖురేషి, అసిస్టెంట్ కమిషనర్లు అనిల్‌కుమార్‌రెడ్డి, ఆర్ కిషన్, డీఎస్పీ తిరుపతి పాల్గొన్నారు.

టీటీడీపీ కమిటీలన్నీ రద్దు

హైదరాబాద్, ఆగస్టు 25 (నమస్తే తెలంగాణ) : ఆంధ్రప్రదేశ్‌లో అధికారాన్ని దక్కించుకున్న టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఇప్పుడు తెలంగాణలోనూ తమ పార్టీని బలోపేతం చేయడంపై దృష్టి సారించారు. అందులో భాగంగా ఆదివారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో టీటీడీపీ నేతలతో భేటీ అయ్యారు. టీటీడీపీని బలోపేతం చేయడంతోపాటు పార్టీ రాష్ట్ర శాఖ నూతన అధ్యక్షుడి ఎంపిక, సభ్యత్వ నమోదు, పంచాయతీ ఎన్నికల్లో పోటీకి అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ.. టీటీడీపీకి చెందిన గ్రామ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయి కమిటీలన్నింటినీ రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. త్వరలో టీటీడీపీ అధ్యక్షుడి ఎంపికతో పాటు నూతన కమిటీలను ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. ఆన్‌లైన్‌లో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలని నేతలకు దిశానిర్దేశం చేశారు.

చంద్రబాబుతో బాబూమోహన్ భేటీ

సినీనటుడు, మాజీ మంత్రి బాబూమోహన్ ఆదివారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌కు వచ్చారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడును కలసి, కొద్దిసేపు మాట్లాడిన బాబూమోహన్ ఒకింత భావోద్వేగానికి గురయ్యారు. దీంతో ఆయన మళ్లీ టీడీపీలో చేరనున్నట్టు ప్రచారం జరుగుతున్నది.



యూత్ ఫర్ యాంటీ కరప్షన్ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆర్పీ పట్నాయక్

నిజాయితీ అధికారుల సమాచారమివ్వండి: ఆర్పీ

యూత్ ఫర్ యాంటీ కరప్షన్ పోస్టర్ ఆవిష్కరణ

హైదరాబాద్, ఆగస్టు 25 (నమస్తే తెలంగాణ): సమాజంలో నిజాయితీగా పనిచేసిన, చేస్తున్న అధికారుల సమాచారాన్ని యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థకు అందించాలని ఆ సంస్థ సలహాదారుడు, ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ ప్రజలను కోరారు. ఆదివారం యూత్ ఫర్ యాంటీ కరప్షన్ కేంద్ర కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. సమాజంలో అవినీతి పెరిగిపోతున్నదని, దానిని నిర్మూలించే క్రమంలో నిజాయితీగా పనిచేసే వారిని గుర్తించి సత్కరిస్తూ నేటి తరానికి పరిచయం చేయబోతున్నామని చెప్పారు. సంస్థ ఫౌండర్ రాజేంద్ర మాట్లాడుతూ.. సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లో నిజాయితీ గల అధికారులను సన్మానించనున్నట్టు తెలిపారు. యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సభ్యులు కొమటి రమేశ్‌బాబు, బత్తిని రాజేశ్, జీ హరి ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



భగ్గుమన్న పశ్చిమాసియా

లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులతో ఉద్రిక్తత > 7

మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA

పోటీ పరీక్షలు, అకడమిక్‌కు సంబంధించిన మెటీరియల్ నేటి 'నిపుణ' ఈ పేపర్‌లో..

సోమవారం MONDAY 26.8.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4 Pages: 12+4 | సంపుటి (Volume): 14 ‖ సంచిక (Issue): 82 ‖ వెల (Price) రూ.6.50 | శ్రీకృష్ణ జన్మాష్టమి

సోమవారం, సూర్యోదయం: 6-01, సూర్యాస్తమయం: 6-34. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు శ్రావణ మాసం కృష్ణ పక్షం తిథి: అష్టమి రాత్రి 2-20 వరకు. నక్షత్రం: కృత్తిక పగలు 3-55 వరకు. వర్జ్యం: లేదు. రాహుకాలం: ఉదయం 7-36 నుంచి ఉదయం 9-09 వరకు. దుర్ముహూర్తం: పగలు 12-42 నుంచి పగలు 1-32 వరకు. అమృతకాలం: పగలు 1-36 నుంచి పగలు 3-08 వరకు.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

మంత్రి కంపెనీ.. 'విదేశీ' ష్యూరిటీ


పొంగులేటి సంస్థ రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు కరేబియన్ దీవుల్లోని బ్యాంకు గ్యారెంటీ



అమాత్యుడి మ్యాజిక్

- సంస్థకు 800 కోట్ల ఏపీ ఎస్పీడీసీఎల్ కాంట్రాక్టు
- దేశంలో శాఖే లేని ఎగ్జిమ్‌బ్యాంకు నుంచి 80 కోట్ల గ్యారెంటీలు సమర్పణ.. జూన్‌తో ముగిసిన గడువు
- ఈసారి దేశంలోని బ్యాంకుల నుంచే గ్యారెంటీలు సమర్పించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం షరతు
- విండీస్ బ్యాంకుతో పొత్తులో మతలబు ఏమిటో!

హైదరాబాద్, ఆగస్టు 25 (నమస్తే తెలంగాణ): మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి సంబంధించిన ఓ వివాదం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశమైంది. ఆయనకు చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ వెస్టిండీస్‌లోని ఎగ్జిమ్‌బ్యాంకు నుంచి ఏపీ ప్రభుత్వానికి గ్యారెంటీలు ఇచ్చినట్టు తెలిసి అనేక అనుమానాలకు బీజం వేసింది. ఈ కంపెనీ ఆంధ్రప్రదేశ్ స్టేట్ పవర్ డిస్ట్రిబ్యూషన్ (ఏపీఎస్పీడీసీఎల్) ప్రాజెక్టు డివిజన్‌కు సంబంధించి రూ. 800 కోట్ల విలువైన పనులను దక్కించుకుంది. ఇందులో భాగంగా నెల్లూరు జిల్లాతోపాటు పలు ప్రాంతాల్లో ఫీడర్లు, డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ పనులు చేయాల్సి ఉంది. ఈ పనులు చేపట్టేందుకు ఏపీఎస్పీడీసీఎల్‌కు రాఘవ కన్‌స్ట్రక్షన్స్ రూ. 80 కోట్ల బ్యాంకు గ్యారెంటీలు సమర్పించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో వెస్టిండీస్‌కు చెందిన ఎగ్జిమ్‌బ్యాంకు గ్యారెంటీలను సమర్పించింది. అనుమానించిన ఏపీ ప్రభుత్వం రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు లేఖ రాసింది. ఆ గ్యారెంటీలు ఈ ఏడాది జూన్ 30 నాటికే > 10వ పేజీలో


SOUTHERN POWER DISTRIBUTION COMPANY OF A.P. LTD

Yours sincerely

CHIEF GENERAL MANGER/PROJECTS
APSPDCL: TIRUPATI

ఎగ్జిమ్ బ్యాంక్ ష్యూరిటీ గడువు ముగిసిందని.. ఈ సారి దేశీయ బ్యాంకుల గ్యారెంటీలను సమర్పించాలని పొంగులేటి సంస్థకు ఏపీ ప్రభుత్వం రాసిన లేఖ

డైవర్షన్ హైడ్రామా

ప్రజా సమస్యలను పక్కదారి పట్టించేందుకే కుట్రలు: హరీశ్



తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీమంత్రి హరీశ్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

- ప్రభుత్వ లక్ష్యం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలే
- పార్టీ మారలేదనే పల్లాపై కక్ష సాధింపు
- ఆ కుటుంబంపై ఇప్పటికే ఆరు కేసులు
- పల్లా విద్యాసంస్థలు బఫర్‌జోన్‌లో ఒక్క అంగుళం ఉన్నా మేమే కూల్చేస్తం
- అనుమతులున్నా బుల్డోజింగ్ సరికాదు
- రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి
- రుణమాఫీపై సర్కారు కుంటిసాకులు
- మాఫీపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్

పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిపై అక్రమ మైనింగ్ కేసులు పెట్టి రూ.300 కోట్ల జరిమానా విధించారు. ఆయనను నానా ఇబ్బందులు పెట్టారు. చివరికి ఆయన కాంగ్రెస్ కండువా కప్పుకోగానే మైనింగ్ కేసు అటకెక్కింది.


రాజకీయ కక్షలకు విద్యాసంస్థలు, దవాఖానలను వాడుకోవద్దు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డిని కాంగ్రెస్ నాయకులు లక్ష్యంగా చేసుకున్నారు. పార్టీ మారనందుకే పల్లాపై పగబట్టారు. ఆయన భార్య, పిల్లలపైనా కేసులు పెట్టారు. హైడ్రాకు మేం వ్యతిరేకం కాదు. ఆ పేరుతో జరుగుతున్న కక్ష సాధింపులకు వ్యతిరేకం.

- మాజీ మంత్రి హరీశ్

కాంగ్రెస్ అప్పు 65 వేల కోట్లు

- ప్రతి నెలా రూ.8,125 కోట్ల అప్పు చేస్తున్న రేవంత్ సర్కార్
- ఆ లెక్కన వచ్చే ఐదేండ్లలో 4.87 లక్షల కోట్ల అప్పు చేస్తది
- అప్పులపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలి
- బహిరంగ చర్చకు రెడీ: హరీశ్

హైదరాబాద్, ఆగస్టు 25 (నమస్తే తెలంగాణ): రుణమాఫీ కోసం లక్షలమంది రైతులు ధర్నాలు, ఆందోళనలు చేస్తుంటే ప్రభుత్వం మాత్రం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నదని సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. హైడ్రా పేరుతో హైడ్రామా నడుపుతూ కక్షసాధింపులకు పాల్పడుతున్నదని మండిపడ్డారు. ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిలతో కలిసి ఆదివారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను లక్ష్యంగా చేసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైడ్రాకు తాము వ్యతిరేకం కాదని, అయితే ఆ పేరుతో జరుగుతున్న కక్ష సాధింపులకు తాము వ్యతిరేకమని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరలేదనే > 2వ పేజీలో



• సలకం చెరువులో ఒవైసీ కాలేజీ


బండ్లగూడ మండలం సలకం చెరువును ఆక్రమించి ఒవైసీ బ్రదర్స్ నిర్మించిన ఫాతిమా విద్యాసంస్థలే హైడ్రా తదుపరి లక్ష్యమని జోరుగా ప్రచారం జరుగుతున్నది. చెరువులో ఆక్రమణలు స్పష్టంగా కనిపిస్తున్నా ఎందుకు కూల్చడం లేదంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. గూగుల్ మ్యాప్ చిత్రాలతో సోషల్‌మీడియాలో పెట్టిన పోస్టులు వైరల్‌గా మారాయి.

హైడ్రా చట్టబద్ధమేనా?

రాజ్యాంగ సంస్థల అధికారాల పరిధిలోకి చొరబాటు!

- ఓఆర్ఆర్ వరకు పరిధి విస్తరణ చెల్లుతదా?
- ఈవీడీఎం అధికారాలను ఇంకా రద్దు చేయకుండానే హైడ్రాను రుద్దిన సర్కార్
- చట్టం లేకుండానే హైడ్రాకు హక్కులెట్ల?
- ఓఆర్ఆర్ వరకు టీసీయూఆర్ పరిధి నిర్ధారణలో చట్టపరమైన సమస్యలెన్నో
- హైడ్రా రాజ్యాంగ ఉల్లంఘనే: నిపుణులు

ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలోని అక్రమ నిర్మాణాల కూల్చివేతలపై దూకుడుగా వ్యవహరిస్తున్న హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) చట్టబద్ధతపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్(టీసీయూఆర్) పరిధికి సంబంధించి ప్రభుత్వం చట్టం చేయలేదని న్యాయ నిపుణులు చెప్తున్నారు.



హైదరాబాద్, ఆగస్టు 25(నమస్తే తెలంగాణ): రాజ్యాంగబద్ధంగా ఏర్పాటైన స్థానిక సంస్థల అధికారాల్లోకి హైడ్రా చట్ట విరుద్ధంగా ప్రవేశించిందని, ఇది రాజ్యాంగ ఉల్లంఘనే అవుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. జీవో-99 ప్రకారం టీసీయూఆర్ పరిధిని హైడ్రాకు అప్పగించారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని ప్రాంతాలతోపాటు ఔటర్ రింగురోడ్డు లోపలి ప్రాంతాలు టీసీయూఆర్ పరిధిలో ఉన్నట్టు పేర్కొన్నారు. అయితే, టీసీయూఆర్ > 2వ పేజీలో

రాష్ట్ర బీజేపీలో అంతర్యుద్ధం?

- హైడ్రా కూల్చివేతలపై ఎంపీల తలోమాట
- ఈటల, రఘునందన్ విరుద్ధ వ్యాఖ్యలు
- ఆధిపత్యం కోసం నాయకుల ఆరాటమా?



హైదరాబాద్, ఆగస్టు 25 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో హైడ్రా చేపడుతున్న కూల్చివేతలు బీజేపీలో అంతర్యుద్ధానికి కారమయ్యాయి. సఖ్యతగా ఉండే ఇద్దరు ఎంపీల మధ్య ఇది విభేదాలకు కారణమైంది. ప్రముఖ సినీ నటుడు అక్కినేని నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్ సహా కూల్చివేతలపై వారు పరస్పర విరుద్ధంగా చేస్తున్న వ్యాఖ్యలు బీజేపీలోని అంతర్యుద్ధాన్ని కండ్లకు కడుతున్నాయి. కేంద్రమంత్రి వర్గంలో ప్రాతినిధ్యం వహిస్తున్న కిషన్‌రెడ్డి, బండి సంజయ్ మధ్య ఇప్పటికే విభేదాలు పొడసూపగా, ఇప్పుడు ఎంపీలు ఈటల రాజేందర్, రఘునందన్‌రావు ఆ జాబితాలో చేరారు. వీరిద్దరి మధ్య సఖ్యత ఉన్నట్టు బయటకు కనిపిస్తున్నప్పటికీ వారి వైఖరి మాత్రం > 2వ పేజీలో

గీతానుసారమే కూల్చివేతలు: సీఎం




- ప్రభుత్వ భాగస్వాములకు ఫాంహౌస్‌లు ఉన్నయ్
- నాపై ఎన్నో ఒత్తిళ్లు.. అయినా వారినీ వదిలిపెట్ట
- తప్పిదాలెన్నో చేస్తుంటం.. వాటిని సరిదిద్దుకోవాలె
- హెరిటేజ్ టవర్ శంకుస్థాపనలో సీఎం రేవంత్
- అదే వేదికపై బఫర్‌జోన్‌లో ఫాంహౌస్‌ఉన్న 'పట్నం' > 2

జీహెచ్‌ఎంసీ కార్యాలయాన్నీ కూల్చేస్తరా?



- ఎఫ్‌టీఎల్‌లో ఉన్న నెక్లెస్‌రోడ్ సంగతేంది?
- గోల్కొండ చెరువులో గోల్ఫ్‌క్లబ్ ఎట్లొచ్చింది?
- హైడ్రాకు ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ప్రశ్నలు > 2



> 7

అమెరికాలో కాల్పులు.. ప్రముఖ తెలుగు వైద్యుడు మృతి

- దవాఖానలు నిర్మించి ఎందరికో ఉపాధి కల్పించిన రమేశ్‌బాబు
- అమెరికాలో ఓ వీధికి ఆయన పేరు

కాంగ్రెస్ మెడకు వాల్మీకి ఉచ్చు

స్కాంలో తెలంగాణ కాంగ్రెస్ నేతలెవరు?.. వాళ్లను రక్షిస్తున్నదెవరు?



వాల్మీకి స్కాంలో సిట్, సీఐడీ, ఈడీ హైదరాబాద్‌లో దాడులు నిర్వహించినా.. ఆ సమాచారం మీడియాలో రాకుండా అడ్డుకున్నదెవరు? రేవంత్‌రెడ్డి సహా కీలక కాంగ్రెస్ నేతలు కొంతమంది మీడియాను మేనేజ్ చేసినా.. మరో నాలుగైదు రోజుల్లో అన్ని విషయాలు బయటకొస్తాయి. *- కేటీఆర్*

- హైదరాబాద్‌లోని 9 బ్యాంకు ఖాతాలకు కర్ణాటక నుంచి 45 కోట్ల నగదు బదిలీ
- నిందితులెవరు?.. ఆ ఖాతాలు ఎవరివి?
- వీ6 బిజినెస్ సంస్థ యజమాని ఎవరు?
- లోక్‌సభ ఎన్నికల్లో ఆ డబ్బులే వాడారా?
- రాహుల్‌గాంధీ స్పందించాలి: కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు 25 (నమస్తే తెలంగాణ): కర్ణాటకలో వాల్మీకి స్కాం తీగలాగితే డొంకంతా తెలంగాణ కాంగ్రెస్ నేతల వైపు కదులుతున్నదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఆ కుంభకోణంలో తెలంగాణకు చెందిన కీలక కాంగ్రెస్ నేతల హస్తం ఉన్నట్టు ఆధారాలు ఉన్నా ఎందుకు చర్యలు తీసుకోవటం లేదని ప్రశ్నించారు.ఆ స్కాంలో భారీగా అవినీతి జరిగిందని ఆ రాష్ట్ర సీఎం సిద్ధరామయ్యే అసెంబ్లీలో అంగీకరించటంతో.. అందులో ఉన్న అందరి పేర్లు బయటకు రావాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. పార్లమెంట్ ఎన్నిలకు ముందు దాదాపు రూ.180 కోట్ల ప్రభుత్వ > 3వ పేజీలో



ఖర్గే ట్రస్టుకు భూసంతర్పణ

- కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడి సంస్థకు అక్రమ లబ్ధి
- బెంగళూరు హైటెక్ డిఫెన్స్ ఏరోస్పేస్ పార్కులో 5 ఎకరాలు కట్టబెట్టిన కర్ణాటక ప్రభుత్వం
- వాళ్లు ఏమైనా ఏరోస్పేస్ ఆంత్రప్రెన్యూర్లా?
- సిద్ధరామయ్య సర్కార్‌పై విపక్షాల విమర్శలు

బెంగళూరు, ఆగస్టు 25: ముడా, వాల్మీకి కార్పొరేషన్ స్కామ్‌లు ఇప్పటికే కర్ణాటక కాంగ్రెస్ సర్కార్‌ను కుదిపేస్తుండగా.. మరో సంచలన వ్యవహారం తాజాగా బయటకు వచ్చింది. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కుటుంబానికి చెందిన 'సిద్ధార్థ విహార ట్రస్టు'కు రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా భూమి > 7వ పేజీలో

- బీసీగణన కోసం ఠాణాలోనూ దీక్ష



బీసీ కుల గణనను డిమాండ్ చేస్తూ దీక్ష చేపట్టిన జక్కని సంజయ్‌కుమార్‌ను పోలీసులు అరెస్టు చేయడంతో.. అఫ్జల్‌గంజ్ ఠాణాలో ఆయన దీక్షకు సంఘీభావం తెలుపుతున్న బీఆర్‌ఎస్ నేతలు శ్రీనివాస్ గౌడ్, పల్లె రవికుమార్ తదితరులు

కొనసాగింపా? కొత్తదా?

బీసీ కమిషన్ పొడిగింపుపై సందిగ్ధత

- 31తో ముగియనున్న కాలపరిమితి
- రిజర్వేషన్లపై ఇప్పటికీ పూర్తికాని నివేదిక
- కొత్త కమిషన్ ఏర్పడితే మరింత జాప్యం

హైదరాబాద్, ఆగస్టు 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర బీసీ కమిషన్ గడువును పొడిగిస్తారా? లేక కొత్త కమిషన్‌ను ఏర్పాటు చేస్తారా? అన్నదానిపై బీసీ సంఘాల్లో జోరుగా చర్చ కొనసాగుతున్నది. కొత్త కమిషన్ ఏర్పాటు కంటే పాత కమిషన్ గడువు పొడిగింపుతోనే ఎక్కువ ప్రయోజనముంటుందని, స్థానిక సంస్థల ఎన్నికలను త్వరగా నిర్వహించుకునేందుకు మార్గం సుగమం అవుతుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొత్త కమిషన్ ఏర్పాటు వల్ల ఎన్నికలు > 5వ పేజీలో

18 కూల్చివేతలు.. 43.94 ఎకరాలు స్వాధీనం

ప్రభుత్వానికి హైడ్రా ఆపరేషన్ నివేదిక

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 25 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ ఫిలింనగర్‌లో లోటస్‌పాండ్ పార్కు స్థలం కాంపౌండ్ వాల్ కూల్చివేత మొదలు.. శనివారం మాదాపూర్ ఎన్ కన్వెన్షన్ సెంటర్ నేలమట్టం సహా 18 చోట్ల కట్టడాలను హైడ్రా కూల్చివేసింది. 43.94 ఎకరాలకు విముక్తి కల్పించింది. ఈ మేరకు హైడ్రా కమిషనర్ ఆదివారం ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. విపత్తు నిర్వహణ, ఆస్తుల రక్షణ కోసం ఏర్పాటైన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అస్సెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) కమిషనర్ ఏవీ రంగనాథ్ నేతృత్వంలో కొనసాగుతున్నది. హైడ్రా రోజుకు 40 నుంచి 50 వరకు అక్రమ కట్టడాలు, కబ్జాలపై ఫిర్యాదులను స్వీకరిస్తున్నది. రంగంలోకి దిగి ఆయా కట్టడాలను నేలమట్టం చేస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో వెలిసిన నిర్మాణాలను కూల్చివేసి 43.94 ఎకరాలకు విముక్తి కల్పించినట్టు హైడ్రా కమిషనర్ తన నివేదికలో పేర్కొన్నారు.

కూల్చివేతల్లో ప్రముఖుల నిర్మాణాలు

లోటస్‌పాండ్, మన్సురాబాద్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, గాజుల రామారం, బాచుపల్లి, చందానగర్, రాజేంద్రనగర్, అమీర్‌పేట తదితర ప్రాంతాల్లో వివిధ నిర్మాణాలను నేలమట్టం చేసినట్టు అధికారులు పేర్కొన్నారు. ఇందులో పల్లం రాజు సోదరుడు పల్లం ఆనంద్, కావేరీ సీడ్స్ అధినేత జీవీ భాస్కర్‌రావు, బీజేపీ అసెంబ్లీ అభ్యర్థి సునీల్‌రెడ్డి, ప్రొ కబడ్డీ యజమాని అనుపమ, సినీ నటుడు నాగార్జున, బీఆర్ఎస్ నేత రత్నాకర్ రాజు తదితరుల నిర్మాణాలు ఉన్నట్టు అధికారులు పేర్కొన్నారు. నందగిరి హిల్స్‌లో కబ్జాలను అడ్డుకునేందుకు వచ్చిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో హైడ్రా అధికారులు కేసు నమోదు చేశారు. జంట జలాశయాల పరిధిలో కట్టడాలను హైడ్రా కూల్చివేయడం, పరిధి దాటి చర్యలకు దిగడం పట్ల హైడ్రాపై విమర్శలు వచ్చాయి. ప్రభుత్వం మాత్రం హైడ్రా పరిధిని మరింత విస్తరించి 111 జీవో పరిధిలో దృష్టి సారించిందన్న చర్చ జరుగుతున్నది.

హైడ్రా కూల్చివేతల వివరాలు ఇవే

ప్రాంతం	కూల్చివేతలు జరిపిన తేదీ/తొలగించినవి	ఆక్రమణలు/వాటి విస్తీర్ణం (ఎకరాల్లో)
ఫిలింనగర్ కోఆపరేటివ్ సొసైటీ	జూన్ 27 / 1	లోటస్‌పాండ్ పార్కు స్థలం కాంపౌండ్ వాల్ /0.16
మన్సురాబాద్/సహస్రఎస్టేట్ రోడ్	1-7-24/1	రహదారి ఆక్రమణ/0.2
ఎంపీ, ఎమ్మెల్యే కాలనీ ప్లాన్ నం 315	4-7-24/3	పార్కు స్థలం కబ్జా/0.06
బంజారాహిల్స్, మిథిలా నగర్	5-7-24/2	పార్కు స్థలం /1.04
ఫిలింనగర్, బీజేఆర్ నగర్	14-7-24/1	నాలా ఆక్రమణ/ 5
గాజుల రామారం, మహదేవ్‌పూర్	21-7-24/1	పార్కు స్థలంలో నిర్మాణాలు /0.01
గాజుల రామారం, భూదేవిహిల్స్	23-7-24 /5	చెరువు ఆక్రమణ /1.1
జూబ్లీహిల్స్ బేబీలాన్ రెస్టారెంట్	27-7-24/1	ఫుట్‌పాత్‌ల ఆక్రమణ /0.05
అమీర్‌పేట నాలా	3-8-24 /3	నాలా ఆక్రమణ /0.01
చింతల్ చెరువు, గాజుల రామారం	6-8-24/54	చెరువు ఆక్రమణ /3.5
జూబ్లీహిల్స్ నందగిరి హిల్స్	9-8-24/16	పార్కు స్థలం కబ్జా/0.18
రాజేంద్రనగర్, బుమారక్ లేక్	10-8-24/45	చెరువుల్లో ఆక్రమ నిర్మాణాలు/12
చందానగర్/ఈర్ల చెరువు	10-8-24/ 3	చెరువుల్లో అక్రమ నిర్మాణాలు /0.16
బాచుపల్లి/ఎర్రకుంట	14-8-24/3	చెరువుల్లో అక్రమ నిర్మాణాలు /0.29
బోడుప్పల్ సర్వే నం 3	14-8-24/1	ప్రభుత్వ స్థలం కబ్జా /0.03
ఖానాపూర్, గండిపేట	18-8-24/14	చెరువుల్లో భవనాలు /8.75
గండిపేట/చిలుకూరు	18-8-24/10	ఉస్మాన్‌సాగర్ చెరువు పరిధిలో నిర్మాణాలు /6.5
ఎన్ కన్వెన్షన్, తుమ్మిడికుంట చెరువు	24-8-24/2	చెరువు ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలు/4.9
మొత్తం కాపాడిన స్థలం		43 ఎకరాల 94 గుంటలు



తెలంగాణ భవన్‌లో ఆదివారం మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు. చిత్రంలో ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు

డైవర్షన్ హైడ్రామా

మొదటిపేజీ తరువాయి...

ఆయన విద్యాసంస్థలపై తప్పుడు కేసులు పెడుతున్నారని విమర్శించారు. పల్లా కుటుంబంపై ఇప్పటి వరకు ఆరు కేసులు నమోదు చేశారని గుర్తుచేశారు. పల్లా విద్యా సంస్థలకు రెవెన్యూ, నీటిపారుదల, హెచ్ఎండీఏ, కలెక్టర్ అనుమతులు ఉన్నాయని తెలిపారు. సమస్యల పరిష్కారానికి బదులు సంచలనాల కోసమే ఈ ప్రభుత్వం సమయం కేటాయిస్తోందని విమర్శించారు. పల్లారాజేశ్వర్‌రెడ్డి తెలంగాణ ఉద్యమకారుడని, నిజాయితీగా పనిచేసిన నాయకుడని కితాబిచ్చారు. రేవంత్‌రెడ్డి కొందరిని టార్గెట్ చేసుకొని కాంగ్రెస్ కండువా కప్పుకోవాలని ఒత్తిడి తీసుకొస్తున్నారని, లేదంటే ఆస్తులు కూల్చేస్తాం, కేసులు పెడతాం అని బెదిరిస్తున్నారని ఆరోపించారు. చీమకు కూడా హాని చేయని పల్లా కుటుంబంలో ఆయన భార్య, పిల్లలపైనా కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు.

హైడ్రా పేరుతో డ్రామాలు

ప్రత్యర్థులను మానసికంగా, రాజకీయంగా, ఆర్థికంగా ఇబ్బంది పెట్టాలని ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని హరీశ్‌రావు ఆరోపించారు. నోటీసులు ఇవ్వకుండా హైడ్రా పేరుతో డ్రామాలు చేస్తున్నారని మండిపడ్డారు. పల్లా కాలేజీలు ఒక్క అంగళం ప్రభుత్వ భూమిలో ఉన్నట్టు చెప్పినా ఆయనే తొలగిస్తారని చెప్పారు. ఆయన మెడికల్ కాలేజీలో ఎంతోమంది వైద్యం పొందుతున్నారని తెలిపారు. ఉద్దేశపూర్వకంగానే ఆయన కాలేజీలపై దాడి చేస్తున్నారని పేర్కొన్నారు. ఎఫ్టీఎల్‌లో కానీ, బఫర్‌జోన్‌లో కానీ ఆయన కాలేజీలు లేవని రెవెన్యూ, ఇరిగేషన్‌శాఖ ఇచ్చిన సర్వే రిపోర్ట్‌ను ఆయన మీడియాకు చూపించారు. మెడికల్ కాలేజీ 813/పీ సర్వే నంబర్‌లో ఎలాంటి బఫర్ భూమి లేదని అప్పటి జిల్లా కలెక్టర్ రిపోర్టు ఇచ్చారని తెలిపారు. హెచ్ఎండీఏ అనుమతితోనే భవనాలు నిర్మించారని, ఆ భూమిని వ్యవసాయ భూమి నుంచి వ్యవసాయేతర భూమిగా 2018 ఏప్రిల్ 30న మార్పు చేశారని తెలిపారు. పల్లాపై జరుగుతున్నది రాజకీయ కుట్రేనని తేల్చి చెప్పారు. అధికారం ఉందని రాత్రికి రాత్రే బుల్డోజింగ్ సరి కాదని హితవు పలికారు.

మండలి చైర్మన్‌కు డెంగ్యూ

విష జ్వరాలతో ప్రజలు బాధపడుతుంటే ప్రభుత్వం మాత్రం ప్రత్యర్థుల మీద విషం చిమ్మే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని హరీశ్‌రావు దుయ్యబట్టారు. డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యాలతో ప్రజలు వణికిపోతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో విష జ్వరాలు ప్రబలుతున్నాయని, శాసనమండలి చైర్మన్ కూడా చికున్‌గున్యా బారినపడ్డారని హరీశ్‌రావు తెలిపారు. డెంగ్యూ కేసులో ఈసారి 36 శాతం పెరిగాయని, 5,200 కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. ఉస్మానియా, గాంధీ దవాఖానల్లో సాధారణ మందులు కూడా అందుబాటులో లేవని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించి ఒక డ్రైవ్ చేపట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఇంట్లోనే మూడు రోజులుగా చెత్త ఎత్తడం లేదని ఆమె చెప్పారని గుర్తు చేశారు.

రుణమాఫీపై కుంటిసాకులు

రుణమాఫీపై మంత్రులు కుంటిసాకులు చెప్తున్నారని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. పొంగులేటి, ఉత్తమ్, తుమ్మల, భట్టి ఒక్కొక్కరు ఒక్కోలా మాట్లాడుతున్నారని విమర్శించారు. రుణమాఫీపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎప్పటిలోగా రుణమాఫీ పూర్తిచేస్తారో చెప్పాలని నిలదీశారు. రుణమాఫీపై ఆర్మూరులో రైతులు స్వచ్ఛందంగానే రోడ్లపైకి వచ్చి ఆందోళన చేశారని తెలిపారు. తమ ప్రభుత్వ హయాంలో రూ. 72 వేల కోట్ల రైతుబంధు ఇచ్చామని, రూ. 30 వేల కోట్ల రుణమాఫీ చేశామని, రూ. 10 వేల కోట్లు రైతు బీమాకు ఖర్చు చేశామని వివరించారు. రేవంత్‌రెడ్డి ద్వంద్వ ప్రమాణాలతో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని పేర్కొన్నారు. ఆయనకు నోటితో తిట్టడం తప్ప ఇచ్చిన మాట మీద నిలబడడం చేతకాదని విమర్శించారు. దేవుళ్లనే మోసం చేసిన ఆయనకు ప్రజలను మోసం చేయడం లెక్కకాదని పేర్కొన్నారు. రైతులకు ఇంకా రూ. 14 వేల కోట్లు ఇవ్వాల్సి ఉన్నదని, దేవుళ్లకు రేవంత్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఒక్క అంగుళం కూడా బఫర్‌జోన్‌లో లేదు

తాను విద్యా సంస్థలను ప్రారంభించి 25 సంవత్సరాలు అవుతున్నదని, ఇప్పటి వరకు ఏ ప్రభుత్వమూ ఏనాడూ వ్యక్తిగతంగా, రాజకీయంగా ఇంతగా ఇబ్బందులు పెట్టలేదని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తనపైనా, తన కుటుంబంపైనా, తన విద్యా సంస్థలపైనా దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. రెవెన్యూశాఖ, నీటిపారుదలశాఖ, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఇంటెలిజెన్స్, పోలీసులు ఇలా అన్ని వ్యవస్థలతో తనను బెదిరిస్తున్నారని ఆరోపించారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. తమ కాలేజీ, యూనివర్సిటీ దేశంలోనే ఎన్ఐఆర్ఎఫ్‌లో ఐదో ర్యాంకులో నిలిచాయని గుర్తు చేశారు. తను కాలేజీ, యూనివర్సిటీకి అనుమతులు ఉన్నాయని, అంగుళం భూమిని కూడా అక్రమించలేదని స్పష్టం చేశారు. తన ముందు సర్వే చేసి అంగుళం భూమి బఫర్‌జోన్‌లో ఉన్నదని చెప్పినా కూల్చివేస్తానని తెలిపారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, గట్టు రాంచందర్‌రావు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అప్పు రూ. 65 వేల కోట్లు

అప్పుల పేరు చెప్పి ప్రభుత్వం తప్పించుకొనే ప్రయత్నం చేస్తున్నదని హరీశ్‌రావు పేర్కొన్నారు. 8 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 65 వేల కోట్ల అప్పు చేసిందని, అంటే నెలకు రూ.8,125 కోట్ల చొప్పున అప్పు చేస్తున్నదని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎఫ్ఆర్‌బీఎం కింద రూ. 42,118 కోట్లు, వివిధ కార్పొరేషన్ల నుంచి 22,840 కోట్లు అప్పు చేసిందని తెలిపారు. కాంగ్రెస్ తన ఐదేండ్ల పాలనలో రూ. 4,87,500 కోట్ల అప్పు చేస్తుందని అంచనా వేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 9 ఏండ్లలో రూ. 4,26,499 కోట్లు మాత్రమే అప్పు చేసిందని గుర్తు చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల జీతాల కంటే, మిత్తిలకే ఎక్కువ మొత్తం అవుతుందని భట్టివిక్రమార్క అంటున్నారని, దీనిపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై తాను బహిరంగ చర్చకు సిద్ధమని ప్రకటించారు. పంచాయతీలు, మున్సిపాలిటిలకు పైసా నిధులు ఇవ్వడం లేదని, పంచాయతీ కార్యదర్శులు మూకుమ్మడి సెలవులు పెట్టాలని నిర్ణయం తీసుకుంటున్నారని తెలిపారు.

హైడ్రా కూల్చివేతలు సబబే

- సీపీఐ నేత కే నారాయణ



హైదరాబాద్, ఆగస్టు 25 (నమస్తే తెలంగాణ)/మాదాపూర్: హైడ్రాను రాజకీయ కక్ష సాధింపు చర్యలకు సీఎం రేవంత్‌రెడ్డి ఉపయోగించొద్దని, పారదర్శకంగా, రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ సూచించారు. సినీ నటుడు నాగార్జున తుమ్మిడికుంట చెరువును కబ్జా చేసి ఎన్ కన్వెన్షన్ సెంటర్ నిర్మించారని ఆరోపించారు. నేలమట్టమైన ఎన్ కన్వెన్షన్ స్థలాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. హైడ్రా కూల్చివేతలను స్వాగతిస్తున్నట్టు నారాయణ చెప్పారు. వందల కోట్ల సంపాదన ఉన్న ఎన్ కన్వెన్షన్ అధినేత నాగార్జునకు కక్కుర్తి ఎందుకని నారాయణ ప్రశ్నించారు. చెరువు ఎఫ్‌టీఎల్‌లో ఫంక్షన్ హాలు కట్టడమేమిటని ప్రశ్నించారు. చెరువును ఆక్రమించి నాగార్జున నిర్మించిన ఎన్ కన్వెన్షన్‌లో సంపాదించిన డబ్బును, నష్టపరిహారంతోసహా కక్కించాలని, అలా వచ్చిన సొమ్ముతో పేదలకు ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. ఆయన వెంట సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పశ్య పద్మ, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, సభ్యులు పర్వతాలు, శేరిలింగంపల్లి నియోజకవర్గ కార్యదర్శి రామకృష్ణ, చందుయాదవ్, వెంకట్‌స్వామి తదితరులు ఉన్నారు.

హైడ్రా పేరుతో పేదల ఇండ్లు కూల్చొద్దు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



నయీంనగర్, ఆగస్టు 25: హైదరాబాద్‌లో హైడ్రా పేరుతో సామాన్యుల ఇండ్లు కూలగొట్టడం సరికాదని, దశాబ్దాల నుంచి నివసిస్తున్న వారికి అనుమతులిచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హనుమకొండలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఒక పార్టీపై గెలిచి మరో పార్టీలోకి మారే ఎమ్మెల్యేల పదవిని తక్షణమే రద్దు చేసే విధానం రావాలని ఆశాభావం వ్యక్తం చేశారు.



కోకాపేటలో హెరిటేజ్ టవర్ శంకుస్థాపనలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి తదితరులు

గీతానుసారమే ఆక్రమణల కూల్చివేత

- ప్రభుత్వ భాగస్వాములకు ఫాంహౌస్‌లు ఉన్నయ్
- నాపై ఎన్నో ఒత్తిళ్లు.. అయినా వారినీ వదిలిపెట్ట
- తప్పిదాలెన్నో చేస్తుంటం.. వాటిని సరిదిద్దుకోవాలె
- హెరిటేజ్ టవర్ శంకుస్థాపనలో సీఎం రేవంత్

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 25 (నమస్తే తెలంగాణ): భగవద్గీత బోధనానుసారమే చెరువులను కాపాడుతున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. కోకాపేటలో హరేకృష్ణ ఫౌండేషన్ 430 అడుగుల ఎత్తుతో నిర్మించతలపెట్టిన హెరిటేజ్ టవర్ పనులకు ముఖ్యమంత్రి ఆదివారం శంకుస్థాపన చేసి, మాట్లాడారు. వందేళ్ల క్రితమే హైదరాబాద్‌ను నిజాం లేక్ సిటీగా అభివృద్ధి చేశారని వెల్లడించారు. దాహార్తిని తీర్చే చెరువుల పరిధిలో విలాసాల కోసం కొందరు ఫామ్ హౌస్‌లు నిర్మించుకున్నారని, గండిపేట్, హిమాయత్ సాగర్‌లోకి ఫామ్‌హౌస్‌ల నుంచి వ్యర్థాలు వదులుతున్నారని తెలిపారు. హైడ్రా ద్వారా అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్నామని, రాజకీయాలు, కక్షల కోసం చేపట్టిన కార్యక్రమం కాదని స్పష్టం చేశారు.



మహేందర్‌రెడ్డి ఫాంహౌస్

మిత్రుల ఫాంహౌస్‌లను వదలం

మిత్రుల ఫాంహౌస్‌లు ఉన్నా తొలగించేందుకే హైడ్రాను ఏర్పాటు చేసినట్టు రేవంత్ చెప్పారు. ప్రభుత్వంలో భాగస్వాములైనా వాటన్నింటినీ పట్టించుకోదల్చుకోలేదు' అని సీఎం నొక్కి చెప్పారు. రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్న వేదికపైనే ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి ఉన్నారు. కొన్ని రోజులుగా పట్నం మహేందర్‌రెడ్డి ఫాంహౌస్ కూడా ఎఫ్‌టీఎల్ పరిధిలోనే ఉన్నట్టు ఆరోపణలు ఉన్నాయి. పట్నం ఫాంహౌస్‌ను కూల్చుతారా? వదిలేస్తారా? అని అక్కడి వచ్చిన ప్రజలు గుసగుసగా మాట్లాడుకోవడం కనిపించింది.

శాంతిసరోవర్‌కు అండగా ఉంటాం

గచ్చిబౌలిలోని శాంతి సరోవర్ క్యాంపస్‌లో నిర్వహించిన 'బ్రహ్మ కుమారీస్ – శాంతి సరోవర్' ద్వి దశాబ్ది ఉత్సవాల్లో ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. బ్రహ్మకుమారీస్ బాటలోనే తెలంగాణ ప్రభుత్వం ముందుకెళ్తున్నదని తెలిపారు. మంత్రులు శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వర్‌రావు, ఎంపీ రఘువీర్ రెడ్డి, ప్రభుత్వ విప్ రాంచంద్రు నాయక్, ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, ఎమ్మెల్సీలు పట్నం మహేందర్ రెడ్డి, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిత్రపురికాలనీలో అక్రమ నిర్మాణాలకు నోటీసులు

మణికొండ, ఆగస్టు 25: మణికొండ మున్సిపాలిటీ చిత్రపురి కాలనీలో నిర్మించిన 225 విల్లాలకు నిర్మాణ అనుమతులు లేవని మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్ ఆదివారం నోటీసులు జారీ చేశారు. ప్రస్తుతం జారీ చేసిన జీవో నంబర్ 658(రెవెన్యూ)కు తూట్లు పొడుస్తూ 225 రో హౌజ్‌ల నిర్మాణాలు చేపట్టారని పేర్కొన్నారు. గత సొసైటీ పాలకవర్గం జీప్లస్1 అనుమతులు పొంది జీప్లస్2 నిర్మాణాలు చేసిందని, 15 రోజుల్లో నోటీసులకు జవాబు ఇవ్వాలని కమిషనర్ తెలిపారు. జవాబు లేనిపక్షంలో కూల్చివేతలు తప్పవని హెచ్చరించారు.

సలకం చెరువులో ఓవైసీ కాలేజీ

- సలకం చెరువు సగం ఆక్రమించి ఫాతిమా విద్యాసంస్థలు
- హైడ్రా తరువాతి లక్ష్యం అదేనని జోరుగా ప్రచారం



హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 25 (నమస్తే తెలంగాణ): చెరువుల్లో చేపట్టిన అక్రమ నిర్మాణాలు కూల్చేస్తున్న హైడ్రా తరువాతి లక్ష్యం ఓవైసీ బ్రదర్స్ అంటూ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నది. ఓవైసీ బ్రదర్స్‌కు చెందిన అక్రమ కట్టడాలపై ఎక్స్ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి, హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదులు చేశారు. హైదరాబాద్ జిల్లా పాతనగరంలోని బండ్లగూడ మండల పరిధిలోని సలకం చెరువులో ఓవైసీ బ్రదర్స్ అక్రమంగా విద్యాసంస్థలు నిర్మించారని ఫిర్యాదు చేశారు. చెరువును సగం ఆక్రమించి ఫాతిమా విద్యాసంస్థలు నిర్మించారని అసద్‌పై ఆరోపణలు ఉన్నాయి. చెరువులోనే బిల్డింగులు కనిపిస్తున్నా ఎందుకు కూల్చడంలేదని ఎక్స్‌లో సీఎం రేవంత్‌ను పాతబస్తీ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఎంపీ అసదుద్దీన్ కూడా హైడ్రా కూల్చివేతలపై స్పందించారు. కొన్ని ప్రభుత్వ భవనాలు కూడా చెరువు ఎఫ్‌టీఎల్‌లో కట్టారని, వాటిని కూల్చుతారా అని ప్రశ్నించారు.

చెరువుగా గుర్తించిన హెచ్ఎండీఏ లేక్ ప్రొటెక్షన్...

హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ నిర్వహిస్తున్న లేక్ ప్రొటెక్షన్ వెబ్‌సైట్‌లో బండ్లగూడ మండల పరిధిలోని బండ్లగూడ కల్సా గ్రామ రెవెన్యూ పరిధిలోని సలకం చెరువుకు సంబంధించిన ఎఫ్‌టీఎల్ సరిహద్దులను గుర్తించి, కెడాస్ట్రల్ మ్యాప్‌లను రూపొందించి ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచింది. లేక్ గుర్తింపు నంబరుగా 4001/1(13-12-2016) పేరుతో ప్రిలిమినరీ నోటిఫికేషన్‌ను ప్రకటించింది. ఈ చెరువులోనే స్పష్టంగా ఓవైసీకి చెందిన విద్యాసంస్థ ఉన్నట్టు గూగుల్‌మ్యాప్‌లో కనిపిస్తోంది. ఇదే చిత్రాన్ని సోషల్ మీడియాలో పలువురు వైరల్ చేస్తున్నారు.

జీహెచ్ఎంసీ ఆఫీసును కూడా కూల్చేస్తారా?: ఒవైసీ

రాష్ట్రంలో అక్రమ నిర్మాణాలు, కబ్జాలంటూ కూల్చివేతలకు పాల్పడుతున్న హైడ్రాకు చట్టబద్ధత లేదని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ విమర్శించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తమ పార్టీకి చెందిన కార్పొరేటర్లు ఇప్పటికే మేయర్ విజయలక్ష్మిని కలిసి హైడ్రాకు చట్టబద్ధత లేదని వివరించారని తెలిపారు. ఎమ్మెల్యే కౌసర మొయినుద్దీన్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసి హైడ్రా చట్టబద్ధతను ప్రశ్నించినట్టు చెప్పారు. తన చిన్నతనంలో ప్రస్తుతం జీహెచ్ఎంసీ కార్యాలయం ఉన్న ప్రదేశంలో వాటర్‌ఫాల్ ఉండేదని, నెక్లెస్‌రోడ్డు హుస్సేన్‌సాగర్ ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉండేదని చెప్పారు. హైడ్రా అధికారులు వాటిని కూడా తొలగిస్తారా అని ప్రశ్నించారు. గోల్కొండలో ఉన్న చెరువులో గోల్ఫ్ కోర్స్ ఉన్నదని, అక్కడ ఐపీఎస్, ఐఏఎస్ అధికారులు గోల్ఫ్ ఆడతారని చెప్పారు. కావాలంటే ఆ ఫొటోలు ఇస్తానని తెలిపారు. నిజాంల కాలంలోనే ఎఫ్‌టీఎల్‌కు సంబంధించిన హద్దురాళ్లను ఏర్పాటు చేశారని, అధికారులు వాటిని ఇప్పటికీ చూసుకోవచ్చని పేర్కొన్నారు. మేయర్‌తోపాటు చీఫ్ సెక్రటరీకి ఇదే విషయాన్ని వివరించినట్టు పేర్కొన్నారు.

హైడ్రా చట్టబద్ధమేనా?

మొదటిపేజీ తరువాయి...

పరిధికి సంబంధించి సరియైన చట్టం చేయలేదని న్యాయ నిపుణులు చెప్తున్నారు. ఉత్తర్వులు ఇస్తే సరిపోదని, సరైన చట్టం కూడా చేయాలని స్పష్టం చేస్తున్నారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ లోపించిందనే కారణంతో హైడ్రాను జీహెచ్ఎంసీ పరిధికి మించి ఓఆర్ఆర్ వరకు విస్తరించడం కూడా చట్టబద్ధం కాదని అంటున్నారు. జీహెచ్ఎంసీ యాక్ట్ వెలుపల ఉన్న గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలపై రుద్దడం గ్రామ పంచాయతీ యాక్ట్ మున్సిపల్ యాక్ట్‌కు విరుద్ధమని, ఇది ఆయా స్థానిక సంస్థలకు రాజ్యాంగబద్ధంగా ఉన్న అధికారాలను ఉల్లంఘించడమేనని పేర్కొంటున్నారు.

స్థానిక సంస్థల అధికారాల్లో జోక్యం

జీవో-99 ప్రకారం టీసీయూఆర్ పరిధిలో విపత్తుల నిర్వహణ కోసం హైడ్రాను ఓ ఏకీకృత ఏజెన్సీగా ఏర్పాటు చేశారు. ఇది తెలంగాణ మున్సిపాలిటీల చట్టం-2019, తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం-2018, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ చట్టం-1955, హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం-2008 తదితర వాటితోపాటు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని అధికారుల అధికారాలను స్వాధీనం చేసుకున్నది. ఒకవేళ హైడ్రాను ఔటర్ రింగురోడ్డు పరిధి వరకు ఏర్పాటు చేస్తే, అందులోని ప్రస్తుతమున్న జీహెచ్ఎంసీ సహా స్థానిక సంస్థల చట్టాల్లో సైతం ఆ మేరకు సవరణలు చేయాల్సి ఉంటుందని న్యాయ నిపుణులు చెప్తున్నారు. లేనిపక్షంలో ఆయా ఏజెన్సీలకు చెందిన అధికారాల పరిధిలోకి హైడ్రా చొచ్చుకొని పోయినట్లేనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హైడ్రా అధికారాలకు సంబంధించి సరియైన చట్టబద్ధత లేదని స్పష్టం చేస్తున్నారు.


ఈవీడీఎం ఉనికి ఉందా, లేదా?

మరోవైపు, విపత్తుల నివారణకు జీహెచ్ఎంసీ చట్టం ప్రకారం ఇప్పటికే ఎన్‌ఫోర్స్‌మెంట్ విజిలెన్స్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్(ఈవీడీఎం) విభాగం ఉంది. దీని అధికారాలు, విధులకు సంబంధించి స్పష్టత ఉంది. ఈవీడీఎం స్థానంలో హైడ్రాను తెచ్చినప్పటికీ ఈవీడీఎం అధికారాలు రద్దు చేస్తున్నట్టు ఎక్కడా చట్టం చేయలేదు. చట్టబద్ధంగా ఏర్పడ్డ అనేక సంస్థలు, అధికారులను నియంత్రించే అధికారాలు ఎటువంటి చట్టం లేకుండానే హైడ్రాకు కల్పించడాన్ని తప్పుబడుతున్నారు. ఒకవేళ ప్రభుత్వం హైడ్రా వంటి ఏజెన్సీని ఏర్పాటు చేయాలనుకుంటే దాని అధికారాలు, పరిధికి సంబంధించి శాసన ప్రక్రియ ద్వారా కొత్తగా చట్టాన్ని చేసి ఉండాల్సిందని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. టీసీయూఆర్ పరిధిని ఓఆర్ఆర్ వరకు నిర్ధారించడంతో అనేక చట్టపరమైన సమస్యలు ఉన్నాయని వివరించారు. ముఖ్యంగా జీఓ-99లో భాగంగా హైడ్రాకు కల్పించిన అధికారాలకు ఎటువంటి చట్టబద్ధత లేదనని, ఈ జీఓకు సంబంధించి చట్ట పరమైన ఫ్రేమ్ వర్క్ లేదని అంటున్నారు. స్థానిక సంస్థలుగా ఉన్నా ప్రాంతాల్లో హైడ్రా అధికారం చెలాయించడం అక్కడి స్థానిక సంస్థల స్వయంప్రతిపత్తికి, అధికారాలకు భంగం వాటిల్లుతుందని చెప్తున్నారు.

రాష్ట్ర బీజేపీలో అంతర్యుద్ధం?

మొదటిపేజీ తరువాయి...

అనుమానాలకు తావిస్తున్నది. 'రాష్ట్రం ఏమైనా నీజాగీరా? నువ్వెట్ల కూలగొడ్తవ్?' అని కూల్చివేతల వ్యవహారంలో సీఎం రేవంత్‌రెడ్డిపై ఈటల రాజేందర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'హీరోలా పోజులు కొట్టడం మంచిది కాదు. కూల్చివేతలతో ప్రజలను కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నవ్' అని ఫైరయ్యారు. అంతేకాదు, 'కాంగ్రెస్ పార్టీ 30, 40 ఏండ్ల క్రితం అధికారంలో ఉన్నప్పుడు పట్టాలు ఇచ్చిన భూమి ఎఫ్‌టీఎల్ భూమి అని తెల్వదా? ఇప్పుడెట్లా కూలగొడ్తావ్' అని నిలదీశారు. హైడ్రాను అడ్డంపెటుకుని నువ్వు చేస్తున్న దంతా గురించి తాను మాట్లాడబోనని కానీ, ఆ పేరుతో పేదల జోలికి వెళ్తే మాత్రం ఊరుకునేది లేదని హెచ్చరించారు.



కాంగ్రెస్‌కు అనుకూలంగా రఘునందన్‌రావు

ఈటల రాజేందర్ హైడ్రాను ఏకపక్షంగా వ్యతిరేకిస్తే.. ఎంపీ రఘునందన్‌రావు మాత్రం అందుకు విరుద్ధంగా స్పందించారు. కూల్చివేతలు తప్పుకాదన్నట్టుగా మాట్లాడారు. ఎప్పుడో కూల్చాల్సిందని, ఇప్పటికే ఆలస్యమైనట్టుగా చెప్పుకొచ్చారు. హైకోర్టు స్టే ఆదేశాలపైనా స్పందించారు. రాష్ట్ర బీజేపీలో ఇద్దరు కీలక నేతలుగా ఉన్న ఎంపీలు ఇలా పరస్పర విరుద్ధంగా మాట్లాడి ప్రజలను గందరగోళ పరుస్తుండడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తున్నది. పార్టీలో ఆధిపత్య పోరుకు ఇది నిదర్శనమని చెప్తున్నారు. ఆయా వర్గాల నేతల రహస్య సమావేశాల్లో జరిగిన చర్చలు, నిర్ణయాల వివరాలు వెంటనే మరో వర్గానికి తెలిసిపోతుండడం, మీడియాకు సైతం లీకవుతుండటం వారిని కలవరానికి గురిచేస్తున్నది. తాజాగా కూల్చివేతలపై ఇద్దరు ఎంపీలు అనుసరిస్తున్న వైఖరి పలు అనుమానాలకు తావిస్తున్నది. మరోవైపు, కర్ణాటకలో వెలుగుచూసిన భారీ కుంభకోణంపై బీజేపీ ఇప్పటి వరకు స్పందించకపోవడంపైనా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

రుణమాఫీ పక్కదోవకే హైడ్రామా

- బీజేపీఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి



సంగారెడ్డి ఆగస్టు 25(నమస్తే తెలంగాణ): రుణమాఫీపై రైతుల ఆందోళనలను పక్కదోవ పట్టించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి హైడ్రా పేరుతో డ్రామాలు ఆడుతున్నారని బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మండిపడ్డారు. ఆదివారం సంగారెడ్డి జిల్లా కందిలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో సభ్యత్వ నమోదులోఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. ఆరు గ్యారెంటీల అమలును విస్మరించి రేవంత్‌రెడ్డి డైవర్ట్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో అక్రమ నిర్మాణాలకు సంబంధించి సీఎం తమ్ముడు, మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులపైనా ఆరోపణలు వస్తున్నాయని, వారి నిర్మాణాలను సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు తొలిగించరని ప్రశ్నించారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఇతరులు అక్రమ నిర్మాణాలు చేపట్టినట్టు ఆరోపణలు వస్తున్నాయని, రేవంత్‌రెడ్డికి దమ్ముంటే వారి భవనాలను తొలిగించాలని డిమాండ్ చేశారు. దానం నాగేందర్‌పై కేసు నమోదు చేసిన ప్రభుత్వం ఆయనను ఎందుకు అరెస్టు చేయటంలేదని ప్రశ్నించారు. చెరువుల్లో అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన అధికారులపై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవటంలేదని నిలదీశారు. హైదరాబాద్‌తోపాటు తెలంగాణలో చెరువులను ఆక్రమించి చేపట్టిన అక్రమ నిర్మాణాలపై ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



వంచనగిరిలోని పీఏసీఎస్ కార్యాలయం

వంచనగిరిలో రైతుల వంచన

- మంత్రి కొండా సురేఖ గ్రామంలో 30 శాతం మందికే రుణమాఫీ
- పీఏసీఎస్‌లో 681 మంది రుణం పొందితే 200 మంది రైతులకే మాఫీ వర్తింపు
- ఆందోళనలో మిగతా 481 మంది
- అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం

వరంగల్, ఆగస్టు 25 (నమస్తేతెలంగాణ): దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ స్వగ్రామం వరంగల్ జిల్లా గీసుగొండ మండలం వంచనగిరిలో అన్నదాతలకు జరిగిన రుణమాఫీ తీరు.. కాంగ్రెస్ సర్కారు డొల్లతనానికి అద్దంపడుతున్నది. 681 మంది వంచనగిరి పీఏసీఎస్ ద్వారా రుణాలు పొందారు. రుణమాఫీకి వీరంతా అర్హులేనని అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు. ప్రభుత్వం మూడు విడతల్లో రూ.2 లక్షల రుణమాఫీ చేయగా వంచనగిరి పీఏసీఎస్ నుంచి రుణం పొందిన వారిలో 200 మందికి మాత్రమే మాఫీ వర్తించింది. మిగతా 481 మంది మాఫీ కోసం పీఏసీఎస్ చుట్టూ తిరుగుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదిస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే మాఫీ అవుతుందని చెబుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యమే కారణం

వంచనగిరి పీఏసీఎస్ అధికారుల నిర్లక్ష్యం, అక్రమాలు, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం వల్ల గ్రామంలో 481 మంది రైతులకు మూడు విడతల్లోనూ రుణమాఫీ జరగలేదని తెలిసింది. వంచనగిరి నుంచి 50 మంది రైతులు 2023 డిసెంబర్ 9లోపు రుణాలను పొందగా.. వంచనగిరి పీఏసీఎస్ అధికారులు 2023 డిసెంబర్ 9 తర్వాత నమోదు చేశారు. దీంతో ఈ యాభై మంది రైతులు రుణమాఫీకి దూరం కావాల్సి వచ్చింది. రుణమాఫీ వర్తించని రైతుల్లో పలువురు 2023 డిసెంబర్ 9లోగా గతంలో తీసుకున్న రుణాలను వడ్డీతో సహా చెల్లించి కొత్తగా మళ్లీ రుణం పొందితే.. వంచనగిరి పీఏసీఎస్ అధికారులు పాత రుణాలను చెల్లించి కొత్తగా రుణాలను పొందిన రైతుల పేర్లను పేర్కొనలేదు. రైతులు చెల్లించిన పాత రుణాల డబ్బు ఏమైంది? ఆ రుణాలను వడ్డీ సహా చెల్లించిన రైతులకు పీఏసీఎస్ అధికారులు ఇచ్చిన రసీదులు నకిలీవా? అనేది ఇప్పుడు చర్చనీయాంశమైంది. రుణమాఫీని కోల్పోయిన రైతులు అధికారుల తీరుపై మండిపడుతున్నారు.

1.5 లక్షలకు రూ.58,254 మాఫీ



నేను వంచనగిరి పీఏసీఎస్‌లో రెండు విడతల్లో రూ.25 వేల రుణం తీసుకున్న. ప్రభుత్వం రుణమాఫీ చేసిన సమయంలో కొంత రుణం మాఫీ అయింది. వడ్డీ సహా మొత్తం రుణం చెల్లించాలని అధికారులు అడగ్గా 2023 సెప్టెంబర్ 4న రూ.55,700 పీఏసీఎస్‌లో చెల్లించి రశీదు తీసుకున్న. అదే నెల 29న ఇదే పీఏసీఎస్ నుంచి కొత్తగా రూ.1.5 లక్షల రుణం పొందాను. తాజాగా ప్రభుత్వం మూడు విడతలుగా చేసిన రుణమాఫీలో అర్హత ఉన్నా 1.5 లక్షల రుణం మాఫీ కాలేదు. గత సెప్టెంబర్ 4న చెల్లించిన రూ.55,700 పాత రుణానికి సంబంధించిన రుణం వడ్డీ సహా రూ.58,254 మాఫీ అయింది. 2023 సెప్టెంబర్ 4 నుంచి ఇటీవల ప్రభుత్వం రుణమాఫీ చేసే వరకు రూ.55,700కు వడ్డీ రూ.2,554 కావటం వల్ల నాకు మాఫీ రూ.58,254 వర్తించింది. ఇదేమిటని నేను వంచనగిరి పీఏసీఎస్ కార్యాలయానికి వెళ్లి అడిగాను. సెప్టెంబర్ 4న చెల్లించిన రూ.55,700 నా ఖాతాలో జమ కాలేదని, పీఏసీఎస్ అధికారుల జేబులోకి వెళ్లిందని తేలింది. పాత రుణానికి సంబంధించిందే రూ.58,254 రుణం ఉన్నట్టు అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. గత సెప్టెంబర్ 29న పీఏసీఎస్ నుంచి పొందిన రూ.1.5 లక్షల రుణం మాఫీ కోసం ప్రభుత్వానికి పంపిన జాబితాలో అధికారులు ప్రస్తావించలేదు. అధికారుల నిర్లక్ష్యం వల్ల రూ.1.5 లక్షల మాఫీ వర్తించకుండా పోయింది. బాధ్యులై చర్యలు తీసుకొని న్యాయం చేయాలి.

- గంగుల పెంటయ్య, రైతు

'భరోసా' లేని ఎవుసం

- అరకొర రుణమాఫీ.. అందని రైతు భరోసా
- మళ్లీ అప్పలపాలైతున్న రాష్ట్ర రైతులు
- రైతుభరోసా ఎప్పడిస్తారో చెప్పని సర్కారు
- రుణమాఫీనే రైతు భరోసా అనుకోవాల్నా?
- సర్కారు మాటలు.. పనులకు పొంతన లేదు
- అమలు చేస్తున్న పథకాల్లోనూ కోతలే
- సరైన టైంలో వర్షాల్లేక సాగుపైనా ప్రభావం
- 8 లక్షల ఎకరాలు తగ్గిన సాగు



హైదరాబాద్, ఆగస్టు 25(నమస్తే తెలంగాణ): రైతులందరికి కావాల్సిన రుణమాఫీ కొందరికే అయింది. ఇప్పటికే ఖాతాలో పడాల్సిన రైతు భరోసా పడలేదు.. సరైన వర్షాలు కురువక కాలం సైతం కక్షగట్టింది.. వెరసి రాష్ట్రంలో రైతులు ఆగమైతున్నరు. సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్నారు. కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం మాత్రం.. రాజకీయాలే ప్రధాన ఎజెండాగా ముందుకు సాగుతున్నదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తొలి నుంచి కూడా రైతులకు చెప్పున్న మాటలకు, చేస్తున్న పనులకు ఏ మాత్రం పొంతనం ఉండటం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ఏ పథకాన్నీ పూర్తిస్థాయిలో అమలు చేయటం లేదు. ఇప్పటికే అమల్లో ఉన్న పథకాల్లోనూ కోతలు పెడుతున్నది. దాంతో రైతులను ఆగం చేస్తున్నది.

రైతు భరోసా ఇంకెప్పుడు?

పంటల సాగుకు పెట్టుబడి సాయంగా అందించాల్సిన రైతు భరోసా(రైతుబంధు) పంపిణీపై ప్రభుత్వం ఊసెత్తడం లేదు. వానకాలం సాగు దాదాపు పూర్తయింది. అయినా ప్రభుత్వం నుంచి రైతులకు నయాపైసా పెట్టుబడి సాయం అందలేదు. గత ఏడాది బీఆర్ఎస్ సర్కారు జూన్ 26న రైతు బంధు పంపిణీని ప్రారంభించి ఆగస్టు 23 వరకు రైతులందరి ఖాతాల్లో పెట్టుబడి సాయాన్ని జమచేసింది. దాంతో రైతులకు పెట్టుబడి సాయానికి ఇబ్బంది రాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మాత్రం రైతు భరోసా ఎప్పుడు ఇస్తారనే అంశంపై స్పష్టత కరువైంది. అసలు ఇస్తారా? లేక ఈ సీజన్‌కు మంగళం పాడుతారా? అన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. రుణమాఫీ చేస్తున్నాం కదా.. ఇంకా రైతుభరోసా ఇవ్వటం ఎందుకని ప్రభుత్వం భావిస్తున్నదా? రైతుభరోసా పైసలను రుణమాఫీ కింద ఇచ్చేసి చేతులు దులుపుకొనే ఆలోచనలో ఉన్నదా? అన్న అనుమానాలు కలుగుతున్నాయి. ప్రభుత్వం నుంచి పెట్టుబడి సాయం అందకపోవటంతో రైతులు మళ్లీ అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నది. పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు.

మంత్రుల కమిటీ ఏమైంది?

అనర్హులకు పెట్టుబడి సాయం అందుతున్నదనే సాకుతో రైతుబంధు పథకంలో కోతలు పెట్టేందుకు ప్రభుత్వం సిద్ధపడింది. వివిధ నిబంధనల పేరుతో రైతుల సంఖ్యను తగ్గించేందుకు చర్యలు చేపట్టింది. రైతుల సంఖ్యలో కోతలు పెట్టేందుకు నలుగురు మంత్రులతో సబ్‌కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ 15 రోజుల్లో నివేదిక ఇస్తుందని, ఈ నివేదిక ఆధారంగా అసెంబ్లీలో చర్చించి కొత్త విధివిధానాలు రూపొందించి రైతుభరోసా ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. కానీ కమిటీ ఏర్పాటై 2 నెలలు కావొస్తున్నా.. ఇప్పటికీ కమిటీ నివేదిక లేదు. అసెంబ్లీలో చర్చించిందీ లేదు.

రుణమాఫీ కాకపాయే!

ప్రభుత్వం ఎంతో గొప్పగా చెప్తున్న రుణమాఫీ కూడా రైతులకు పూర్తిగా దక్కడం లేదు. రాష్ట్రంలో 70 లక్షల మంది రైతులుంటే ఇప్పటి వరకు 22 లక్షల మందికి మాత్రమే రుణమాఫీ చేసింది. అంటే 50 లక్షల మంది రుణమాఫీకి దూరమయ్యారు. అదేవిధంగా రూ.31 వేల కోట్లు మాఫీ చేయాల్సి ఉండగా చేసింది మాత్రం 18 వేల కోట్లే. అర్హులైన రైతులకు రుణమాఫీ కాకపోవడంతో వాళ్లంతా ఎవుసం పనులన్నీ వదిలేసి బ్యాంకుల చుట్టూ, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

కక్షగట్టిన కాలం.. తగ్గిన సాగు

మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టు కాంగ్రెస్ ప్రభుత్వంలో పథకాలకు దూరమవుతున్న రైతులపై కాలం కూడా కక్ష గట్టిందనే అభిప్రాయాలున్నాయి. గతంతో పోల్చితే ఈ సీజన్‌లో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవడం లేదు. ఈ వారం, పది రోజులుగా కురుస్తున్న వర్షాలే తప్ప సాగుకు అవసరమైన సమయంలో వర్షాలు కురవలేదు. దీనికి తోడు కాళేశ్వరంపై కక్షగట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం.. నీళ్లను ఎత్తిపోయడంలో నిర్లక్ష్యం వహించిందనే విమర్శలున్నాయి. ఆ ప్రభావం సాగుపై స్పష్టంగా కనిపిస్తున్నది. గత ఏడాదితో పోల్చితే ఈ సీజన్‌లో సాగు ఏకంగా 8 లక్షల ఎకరాల్లో తగ్గింది. గత ఈ సమయానికి 1.09 కోట్ల ఎకరాలు సాగు కాగా, ప్రస్తుం 1.01 కోట్ల ఎకరాలే సాగు అవుతున్నది. గత ఏడాది మొత్తంగా రికార్డు స్థాయిలో 1.35 కోట్ల ఎకరాల్లో సాగైంది.

పథకాల్లో కోతలు

కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని పథకాల్లో కోతలు పెడుతున్నదన్న ఆరోపణలు వస్తున్నాయి. ఎన్నికల సమయంలో రైతులందరికీ రుణమాఫీ చేస్తామని, రైతు బంధు ఇస్తామని ప్రకటించి.. ఇప్పుడు మాత్రం అడ్డదిడ్డంగా కోతలు పెడుతున్నదని రైతన్నలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇది రైతు ప్రభుత్వం కాదని, కోతల ప్రభుత్వం అంటూ విమర్శిస్తున్నారు.

రైతుబంధు సొమ్ముతో రుణమాఫీ?

సీజన్ ముగుస్తున్నప్పటికీ ఇంకా రైతుబంధు (రైతు భరోసా) ఇవ్వకపోవటంతో రైతుల్లో కొత్త అనుమానాలు రేకెత్తుతున్నాయి. ప్రభుత్వం అరకొరగా, అడ్డదిడ్డంగా కోతలతో రుణమాఫీ చేస్తున్న విషయం తెలిసిందే. అందుకే రైతుభరోసా ఆపిందనే వాదనలు వినిపిస్తున్నాయి. రైతుబంధు సొమ్ముతో రుణమాఫీ చేశారా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రైతుభరోసా కింద కాంగ్రెస్ సర్కారు ఎకరానికి రూ.7,500 చొప్పున ఇవ్వాలంటే దాదాపు రూ.12 వేల కోట్లు కావాలి. కానీ ప్రభుత్వం ఈ నిధులను ఆపేసింది. ఆ నిధులతోనే రుణమాఫీ చేశారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

- గత వానకాలంలో బీఆర్ఎస్ సర్కారు రైతు బంధు ప్రారంభించింది జూన్ 26
- రైతుబంధు పంపిణీ పూర్తి చేసింది ఆగస్టు 23
- రైతుభరోసాపై కాంగ్రెస్ ప్రభుత్వ కదలిక శూన్యం
- రైతుబంధు నిబంధనల్లో మార్పుల కోసం జూలై 2 నలుగురు మంత్రులతో సబ్ కమిటీ ఏర్పాటు
- క్యాబినెట్ సబ్‌కమిటీ 15 రోజుల్లో నివేదిక ఇవ్వాల్సి ఉండగా నేటికీ ఇవ్వలేదు.
- అసెంబ్లీలో చర్చించి నిబంధనలు రూపొందిస్తామన్న సర్కారు.. ఆ ముచ్చటే మర్చిపోయింది.
- రూ.2 లక్షల చొప్పున రుణమాఫీ చేయాల్సింది 70 లక్షల మంది రైతులకు. కానీ ప్రభుత్వం ఇప్పటి వరకు చేసింది 22 లక్షల మందికే.
- రూ.31 వేల కోట్ల రుణమాఫీకి.. చేసింది రూ.18 వేల కోట్లే.
- 50 లక్షల మందికి ఇటు రుణమాఫీ కాలేదు.. అటు రైతుభరోసా రాలేదు.
- వర్షాలు లేక 8 లక్షల ఎకరాల సాగు తగ్గింది.

లోకం పోకడ



రెండు లక్షల వరకు రుణమాఫీ అంటే.. రెండు లక్షల డబ్బులా? రెండు లక్షల మంది రైతులా?

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	32.6°c	23.3°c
మెదక్	31.5°c	21.4°c
నిజామాబాద్	30.4°c	22.9°c
హైదరాబాద్	29.4°c	22.6°c
రంగారెడ్డి	29.2°c	22.9°c
కరీంనగర్	29.0°c	24.0°c
వరంగల్	29.0°c	24.0°c
నల్లగొండ	29.0°c	23.2°c
మహబూబ్‌నగర్	28.1°c	21.3°c
ఖమ్మం	28.0°c	26.0°c

రాష్ట్రంపై అల్పపీడన ప్రభావం

మరో ఐదు రోజులు భారీ వర్షాలు

హైదరాబాద్, ఆగస్టు 25 (నమస్తే తెలంగాణ) : అల్పపీడనం ప్రభావంతో రానున్న ఐదురోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఆదివారం నుంచి సోమవారం ఉదయం వరకు పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రికొత్తగూడెం జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. సోమవారం నుంచి మంగళవారం వరకు ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, భద్రాద్రికొత్తగూడెం, ఖమ్మం, వికారాబాద్, సంగారెడ్డి, వనపర్తి, నారాయణపేట, జోగులాంబగద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వానలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. మంగళవారం నుంచి బుధవారం వరకు ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రిభువనగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశమున్నట్టు తెలిపింది. గడిచిన 24గంటల్లో అత్యధికంగా సిద్దిపేట జిల్లా మిరుదొడ్డిలో 7.2సెం.మీ వర్షపాతం నమోదైంది.

రిజిస్ట్రేషన్ శాఖలో త్రిముఖ వ్యూహం

- రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో పారదర్శకత పాటించాలి
- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు25 (నమస్తే తెలంగాణ): రిజిస్ట్రేషన్ శాఖలో త్రిముఖ వ్యూహాన్ని రూపొందించాలని రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ ఉద్యోగులతో ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో ఆదివారం ప్రత్యేక ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాబోయే రెండేండ్లలో ప్రభుత్వ భవనాల్లో రిజిస్ట్రేషన్ కార్యాలయాలు సేవలు అందిస్తాయని తెలిపారు. ఇతర రాష్ట్రాల్లోని రిజిస్ట్రేషన్ శాఖల్లో ఉన్న ఉత్తమ విధానాలను అధ్యయనం చేయాలని చెప్పారు. నూతన టెక్నాలజీని వినియోగించాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో ఎలాంటి ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని ఉద్యోగులకు సూచించారు. నిజాయితీ, అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. అద్దెలు, తదితర వసతులకు అవసరమైన బడ్జెట్‌ను త్వరలోనే మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ప్రభుత్వ కార్యదర్శి, స్టాంపులు రిజిస్ట్రేషన్ల కమిషనర్ బుద్ధప్రకాశ్ జ్యోతి మాట్లాడుతూ 2014లో రూ.2,746 కోట్లుగా ఉన్న రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం నిరుడికి 14,588 కోట్లకు చేరుకున్నదని వివరించారు. అనంతరం రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ వార్షిక నివేదికను మంత్రి విడుదల చేశారు. సమావేశంలో అదనపు ఐజీలు, డీఐజీలు, జిల్లా రిజిస్ట్రార్లు, సబ్ రిజిస్ట్రార్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్ సస్పెన్షన్‌పై వివాదం

హైదరాబాద్, ఆగస్టు 25 (నమస్తే తెలంగాణ) : నిజామాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఈ నెల 19న కురిసిన భారీ వర్షానికి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద భారీగా నీరు నిలిచింది. ఆ సమయంలో ఆర్టీసీ డ్రైవర్ సాంబయ్య నీళ్లలోనే బస్సు తీసుకెళ్లడంతో సగం వరకు నీటిలో మునిగింది. ఈత వచ్చినవాళ్లు బస్సులోంచి దూకి బయటకు రాగా, మహిళలు, పిల్లలు బస్సులో చిక్కుకుపోయారు. స్థానికులు స్పందించి మహిళలు, చిన్నారులను సురక్షితంగా బయటకుచేర్చారు. దీనిపై విచారణ జరిపిన ఆర్టీసీ ఉన్నతాధికారులు డ్రైవర్‌ను సస్పెండ్ చేశారు. మున్సిపల్, రైల్వే అధికారుల తప్పిదాలకు డ్రైవర్‌ను అన్యాయంగా బలిచేశారని విమర్శలు వెలువెత్తుతున్నాయి.

బీసీ ఉద్యమనేత ఆమరణ దీక్ష

బీసీ డిక్లరేషన్ అమలుచేయాలని సంజయ్ డిమాండ్

- బీసీల జీవితాలతో సర్కారు చెలగాటం
- కాంగ్రెస్‌కు రాజకీయ సమాధి తప్పదు!
- కులగణన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి
- 42 శాతం రిజరేషన్లు అమలు చేయాల్సిందే..
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె



దీక్ష చేస్తున్న సంజయ్ కుమార్‌ను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

హిమాయత్‌నగర్/దుండిగల్, ఆగస్టు 25: కామారెడ్డి సభలో కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్‌ను సర్కారు తక్షణమే అమలు చేసి, బీసీ కులగణన చేపట్టాలన్న ప్రధాన డిమాండ్లతో బీసీ ఆజాది యూత్ ఫెడరేషన్ అధ్యక్షుడు జక్కని సంజయ్‌కుమార్ నేతృత్వంలో బీసీ నేతలు ఆమరణ నిరాహారదీక్షలకు దిగారు. బీసీ రిజర్వేషన్ల ప్రదాత బీపీ మండల్ జయంతి సందర్భంగా హైదరాబాద్ హైదర్‌గూడలో ఫెడరేషన్ కేంద్ర కార్యాలయంలో సంజయ్‌కుమార్ తోపాటు హిందూ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల సిద్ధేశ్వర్లు, ప్రతినిధి చాపర్తి కుమార్‌కు పూల మాలలు వేసి సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి ఆమరణ నిరాహార దీక్షలను ప్రారంభించారు. బీసీల హక్కుల కోసం జక్కని సంజయ్‌కుమార్ ఆధ్వర్యంలో చేపట్టిన ఆమరణ నిరహార దీక్ష శిబిరం వద్దకు సీఐ చంద్రశేఖర్, డీఎస్సై వెంకటేశ్ దీక్షా శిబిరానికి వచ్చి శాంతియుతంగా ఆమరణ నిరహార దీక్ష చేస్తున్న వారిని బలవంతంగా అరెస్ట్ చేశారు. అనంతరం సంజయ్‌కుమార్ పోలీస్‌స్టేషన్‌లోనే దీక్ష కొనసాగిస్తున్నారు. అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లో సంజయ్‌కుమార్‌ను మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్ పరామర్శించి, సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీల జీవితాలతో చెలగాటమాడుతున్న కాంగ్రెస్ సర్కారుకు రాజకీయ సమాధి తప్పదని వారు హెచ్చరించారు. రాష్ట్రంలోని బీసీల విశ్వసనీయత కోల్పోకముందే బీసీ కులగణన ప్రక్రియను ప్రభుత్వం మొదలుపెట్టాలని డిమాండ్ చేశారు. బీసీలు విద్యా, ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక రంగాల్లో అణిచివేతకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక విప్లవం కోసం బీసీల పోరాటాన్ని మొదలు పెట్టామని, బీసీలకు 42 శాతం రిజరేషన్లను పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

అరెస్టులతో బీసీ ఉద్యమాన్ని ఆపలేరు: రాజారాం యాదవ్

హిమాయత్‌నగర్, ఆగస్టు 25: అరెస్టులు, అణచివేతలతో బీసీ ఉద్యమాన్ని ఆపలేరని బీసీ జన సభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్ హెచ్చరించారు. హైదర్‌గూడలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న బీసీ ఆజాది యూత్ ఫెడరేషన్ అధ్యక్షుడు జక్కని సంజయ్ కుమార్, హిందూ బీసీ మహాసభ అధ్యక్షుడు బత్తుల సిద్ధేశ్వర్లు, నేత చాపర్తి కుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేయడాన్ని ఆదివారం ఒక ప్రకటనలో ఖండించారు. అరెస్ట్ చేసిన బీసీ నేతలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇది ఈ ముగ్గురితోనే ఆగిపోదని, భవిష్యత్తులో అనేక మంది బీసీ నేతలు ఆమరణ దీక్షలకు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. బీసీ సంఘాల నేతలకు ఎలాంటి హాని జరిగినా ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని హెచ్చరించారు.

బీసీ సంఘాల సంఘీభావం

బీసీల హక్కుల కోసం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన బీసీ ఆజాది యూత్ ఫెడరేషన్ అధ్యక్షుడు జక్కని సంజయ్‌కుమార్‌కు పలువురు బీసీ, ఇతర సంఘాల నేతలు సంఘీభావం ప్రకటించారు. దీక్షా శిబిరంలో వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు రాయబండి పాండురంగాచారి, ప్రతినిధులు దాసోజు లలిత, పోశం అశోక్, పటేల్ వనజ, కొంగర నరహరి, సుజ్జి, వెంకటేశ్, అజయ్ పాల్గొని సంజయ్‌కుమార్ దీక్షలకు సంఘీభావం ప్రకటించారు. పోలీస్‌స్టేషన్‌లో బీసీ సంఘాల నేతలు మేకపోతుల నరేందర్‌గౌడ్, దాసు సురేశ్, నల్ల సూర్యప్రకాశ్ తదితరులు సంజయ్‌కుమార్‌ను పరామర్శించి సంఘీభావం తెలిపారు.

బీసీ కమిషన్ ఎప్పుడు?

మొదటిపేజీ తరువాయి...

మరింత జాప్యం కావచ్చుని, తద్వారా ఇప్పటికే గాడితప్పిన పంచాయతీల్లో పాలన మరింత దిగజారుతుందనే వాదనలు వినిపిస్తున్నాయి. కానీ, ప్రభుత్వం మాత్రం కొత్త కమిషన్‌ను నియమించేందుకే మొగ్గుచూపుతున్నదని, ఆ కమిషన్ చైర్మన్‌గా విశ్రాంత జడ్జిని నియమించేందుకు కసరత్తు చేస్తున్నదని వినికిడి.

మధ్యలోనే ఆగిపోయిన స్థిరీకరణ

సుప్రీంకోర్టు జారీ చేసిన ట్రిపుల్ టెస్ట్ మార్గదర్శకాలను అనుసరించి స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను స్థిరీకరించేందుకు 2021లో రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్‌రావు నేతృత్వంలో ఉపేందర్, శుభప్రద్‌పటేల్, కిశోర్‌గౌడ్ సభ్యులుగా డెడికేటెడ్ బీసీ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ ఇప్పటికే కర్ణాటక, మధ్యప్రదేశ్ సహా అనేక రాష్ట్రాల్లో పర్యటించి, అక్కడి బీసీ కమిషన్లతో చర్చించింది. బీసీ రిజర్వేషన్ల స్థిరీకరణకు ఆయా రాష్ట్రాల్లో అనుసరించిన విధివిధానాలను అధ్యయనం చేసి, తెలంగాణలో అనుసరించాల్సిన విధివిధానాలపై కసరత్తు ప్రారంభించింది. బీసీల రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాలను క్రోడీకరిస్తూ నిర్దిష్ట నమూనాను, బీసీల డాటా సేకరణకు కావాల్సిన ప్రశ్నావళిని సిద్ధంచేసే పనిలో నిమగ్నమైంది. ఇదే సమయంలో తెలంగాణలో ప్రభుత్వం మారి, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. రాష్ట్రంలో కులగణన చేపట్టి, బీసీల రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతామని కామారెడ్డి డిక్లరేషన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో బీసీ కమిషన్ డైలామాలో పడిపోయింది. కులగణన ద్వారా రిజర్వేషన్లను స్థిరీకరించాలా? లేక ఓటర్ జాబితా ప్రకారం చేయాలా? అన్నదానిపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి మార్గదర్శకాలను జారీ చేయకపోవడమే ఇందుకు కారణం. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం జారీచేసిన టీవోఆర్‌కు అనుగుణంగా బీసీ రిజర్వేషన్ల ప్రక్రియ చేపట్టేందుకు కూడా రేవంత్ సర్కారు సహకరించకపోవడంతో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు బీసీ కమిషన్ ఎలాంటి కార్యాచరణ చేపట్టలేదు. ఈ కమిషన్ గడువు ఈ నెల 31తో ముగియనుండటంతో బీసీ రిజర్వేషన్ల స్థిరీకరణ మధ్యలోనే నిలిచిపోయింది.

కమిషన్‌ను కొనసాగించడమే ఉత్తమం

ప్రస్తుత కమిషన్‌ను కొనసాగిస్తేనే రిజర్వేషన్ల స్థిరీకరణ త్వరగా పూర్తవుతుందని బీసీ సంఘాలు అభిప్రాయపడుతున్నాయి. అన్నివిధాలా లాభదాయకమని స్పష్టం చేస్తున్నాయి. కాదని కొత్త కమిషన్‌ను నియమిస్తే రిజర్వేషన్ల స్థిరీకరణతోపాటు స్థానిక ఎన్నికలు తీవ్ర జాప్యమవుతాయని పేర్కొంటున్నాయి. ఒకవేళ కులగణన నిర్వహించినా కూడా దానికి కమిషన్ ఆమోదం తప్పనిసరి. అప్పుడే రిజర్వేషన్లకు సాధికారత లభిస్తుంది. లేదంటే స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు చెల్లుబాటు కావని, కమిషన్ గడువును పొడగించి పని పూర్తిచేసుకోవడం సముచితంగా ఉంటుందని విశ్లేషకులు చెప్తున్నారు.

కొత్త కమిషన్ ఏర్పాటుకే సర్కారు మొగ్గు

వకుళాభరణం కమిషన్ గడువు ముగియగానే కాంగ్రెస్‌కు చెందినవారితో కొత్తగా బీసీ కమిషన్‌ను నియమించాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం. చైర్మన్‌గా విశ్రాంత జడ్జిని నియమించాలని యోచిస్తున్నట్టు లీకులు వస్తున్నాయి. కొత్త కమిషన్‌లో చైర్మన్ పదవి కోసం ఓ బీసీ సంఘానికి చెందిన కీలక నేత ఇప్పటికే కాంగ్రెస్‌లోని బీసీ నేతలు, ఢిల్లీ పెద్దలతో మంతనాలు సాగిస్తున్నట్టు జోరుగా వినిపిస్తున్నది. దీన్నిబట్టే ప్రభుత్వం కొత్త బీసీ కమిషన్‌ను నియమించాలని భావిస్తున్నట్టు స్పష్టమవుతున్నది.

మహిళ నిర్ణయాత్మక శక్తిగా ఎదగాలి

బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్, ఆగస్టు 25 (నమస్తే తెలంగాణ): మహిళ అన్నిరంగాల్లో నిర్ణయాత్మక శక్తిగా ఎదగాలని, అప్పుడే అభివృద్ధి చెందిన సమసమాజం ఏర్పడుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. హైదరాబాద్‌లోని స్టాన్లీ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో అఖిల భారత విద్యాసంఘాల సమాఖ్య (ఐఫియా), తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టీఆర్‌టీఎఫ్) సంయుక్తంగా నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. మహిళా సాధికారత ఇంకా పరిపూర్ణం కాలేదని ఆవేదన వ్యక్తంచేశారు. మహిళాభివృద్ధి మరింతగా జరగాలంటే మహిళలందరూ విద్యావంతులు కావాలని సూచించారు. రాజకీయ, ఆర్థిక వ్యవస్థల్లో మహిళా భాగస్వామ్యం మరింతగా పెరగాలని ఆంకాంక్షించారు. మహిళల ఆత్మగౌరవాన్ని పెంపొందించడానికే రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ వసతి కల్పించినట్టు చెప్పారు. సదస్సులో వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, ప్రొఫెసర్ వై ప్రశాంతి, ఐఫియా అధ్యక్షుడు సుధీర్‌కుమార్, ప్రధాన కార్యదర్శి నబ్‌కుమార్ కర్మకార్, సలహాదారు కే సుబ్బారెడ్డి, టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కటకం రమేశ్, ప్రధాన్య కార్యదర్శి మారెడ్డి అంజిరెడ్డి, స్టాన్లీ కళాశాలల చైర్మన్ కే కృష్ణారెడ్డి, వివిధ రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు. బీసీ సంక్షేమ హాస్టళ్ల మెస్, భవనాల అద్దె, కరెంటు బిల్లులను వెంటనే చెల్లించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్ కృష్ణయ్య, బీసీ సంఘాల నేతలు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. విదేశీ విద్యా స్కాలర్‌షిప్పులను అర్హులందరికీ ఇవ్వాలని కోరారు.

సిరిసిల్లలో మరో నేత కార్మికుడి ఆత్మహత్య

ఉపాధి లేక.. ఆర్థిక ఇబ్బందులు తాళ లేక బలవన్మరణం

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 25: రాజన్న సిరిసిల్ల జిల్లాలో మరో నేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. తంగళ్లపల్లి మండలం మండెపల్లిలోని కేసీఆర్‌నగర్‌కు చెందిన గోవింది సదానందం (38) నేత కార్మికుడిగా పని చేస్తున్నాడు. 3నెలల క్రితం రూ.3 లక్షల వరకు అప్పు చేసి తుంటి ఆపరేషన్ చేయించుకున్నాడు. కోలుకున్న తరువాత ఉపాధి లేక మద్యానికి బానిసయ్యా డు. మద్యం తాగి ఇంటికి వచ్చి న సదానందాన్ని భార్య మందలించింది. మరునాడు 24న గడ్డిమందు తాగగా, దవాఖానలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు.



అభివాదం చేస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌యాదవ్, తదితరులు

కులగణన చేయకుంటే అగ్గి రాజేస్తాం

- పార్లమెంట్‌లో బీపీ మండల్ చిత్రపటాన్ని పెట్టాలి: జాజుల శ్రీనివాస్‌గౌడ్

రవీంద్రభారరతి, ఆగస్టు 25: కులగణన చేయకుంటే దేశవ్యాప్తంగా అగ్గి రాజేస్తామని బీసీ సంక్షేమం సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ కేంద్రప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆదివారం సామాజిక న్యాయ జేఏసీ అధ్యక్షుడు ప్రొఫెసర్ ప్రభంజన్‌యాదవ్ ఆధ్వర్యంలో బీపీ మండల్ 106 జయంతి వేడుకలు రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. కేంద్రప్రభుత్వం బీపీ మండల్ విగ్రహాన్ని పార్లమెంట్‌లో ప్రతిష్ఠించాలని, జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. బీపీ మండల్ మనువడు, హైకోర్టు అడ్వకేట్ శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

అండర్-15 చాంప్ తన్వి

ఫైనల్‌లో ఘనవిజయం



చెంగ్డూ (చైనా): ఆసియా సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో తన్వి పత్రి చాంపియన్‌గా నిలిచింది. చైనాలోని చెంగ్డూ వేదికగా ఆదివారం జరిగిన అండర్-15 బాలికల బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ ఫైనల్‌లో 13 ఏండ్ల తన్వి.. 22-20, 21-11తో హుయెన్ ఎంగ్వుయెన్ (వియత్నాం)ను చిత్తు చేసి స్వర్ణం సాధించింది. 34 నిమిషాల్లోనే ముగిసిన ఈ మ్యాచ్‌లో తొలి గేమ్‌లో 11-17తో వెనుకబడ్డ తన్వి.. ప్రత్యర్థి చేసిన తప్పులను రెండుచేతులా ఒడిసిపట్టుకుని ఒక్కో పాయింట్ దక్కించుకుని ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. రెండో గేమ్‌లోనూ అదే ఊపుతో ఆడి గేమ్‌తో పాటు మ్యాచ్‌నూ కైవసం చేసుకుంది. ఈ టోర్నీలో ఆడిన 5 మ్యాచ్‌లలోనూ తన్వి ఒక్క గేమ్ కూడా ఓడిపోకుండా పూర్తిస్థాయి ఆధిపత్యం చెలాయించడం గమనార్హం. ఈ విజయంతో ఒడిషాకు చెందిన తన్వి.. అండర్ -15 బాలికల చాంపియన్‌షిప్ గెలిచిన మూడో భారత షట్లర్‌గా నిలిచింది. గతంలో సమియ ఇమాద్, తస్నీమ్ మిర్ ఈ ఘనత సాధించారు. ఈ టోర్నీ అండర్-17 బాలుర చాంపియన్‌షిప్‌లో తెలంగాణ అబ్బాయి జ్ఞానదత్తు కాంస్యం గెలుచుకున్న విషయం విదితమే.

నేటి నుంచే యూఎస్ ఓపెన్

సీజన్ ఆఖరి గ్రాండ్‌స్లామ్ టోర్నీకి సర్వం సిద్ధం



న్యూయార్క్: టెన్నిస్ క్యాలెండర్‌లో ఆఖరి గ్రాండ్‌స్లామ్ టోర్నీ అయిన ప్రతిష్ఠాత్మక యూఎస్ ఓపెన్‌కు రంగం సిద్ధమైంది. న్యూయార్క్ వేదికగా జరుగబోయే ఈ టోర్నీకి సోమవారం నుంచి తెరలేవబోతోంది. నేటి నుంచి పురుషుల, మహిళల సింగిల్స్ మ్యాచ్‌లు మొదలుకానున్నాయి. డిఫెండింగ్ చాంపియన్లు నొవాక్ జొకోవిచ్ (పురుషుల), కోకో గాఫ్ (మహిళల) తమ టైటిల్స్‌ను నిలబెట్టుకునేందుకు బరిలోకి దిగుతున్నారు. పురుషుల కేటగిరీలో కార్లోస్ అల్కారజ్, జన్నిక్ సిన్నర్, డేనియల్ మెద్వెదెవ్, ఆండ్రీ రుబ్లెవ్, అలగ్జాండర్ జ్వెరెవ్, ఫ్రాన్సెస్ టియాఫో, టేలర్ ఫ్రిట్జ్ వంటి స్టార్లు టైటిల్ వేటలో ఉన్నారు. మహిళల సింగిల్స్‌లో ప్రపంచ నెంబర్ వన్ ఇగా స్వియాటెక్, అరీనా సబలెంక, జాస్మిన్ పలోని, ఎలీనా రిబాకినా, జలెనా ఒస్టపెంకొ, యువ సంచలనం మిర్రా అంఢ్రీవాతో పాటు పారిస్ ఒలింపిక్ స్వర్ణ విజేత కిన్వెన్ జెంగ్ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. గతేడాది ఇక్కడే తన కెరీర్‌లో 24వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ నెగ్గి 25వ టైటిల్ కోసం ఏడాదిగా వేచి చూస్తున్న జొకోవిచ్ మరోసారి తనకు అచ్చొచ్చిన యూఎస్ ఓపెన్‌లో సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నాడు. ఈ ఏడాది ఆస్ట్రేలియా, ఫ్రెంచ్, వింబుల్డన్ టోర్నీలలో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయినా ఇటీవలే ముగిసిన విశ్వ క్రీడలలో స్వర్ణం సాధించడం జొకోలో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది.



అఖిల్‌కు రెండో స్థానం

చెన్నై: ఇండియన్ రేసింగ్ ఫెస్టివల్‌లో తొలిరోజు నిరాశపరిచిన హైదరాబాద్ బ్లాక్ బర్డ్స్ రెండోరోజు సత్తా చాటింది. ఈ పోటీలలో భాగంగా చెన్నైలోని మద్రాస్ ఇంటర్నేషనల్ సర్క్యూట్‌లో ఆదివారం జరిగిన ఇండియన్ రేసింగ్ లీగ్ (ఐఆర్ఎల్) మొదటి రౌండ్ రెండో రేసులో హైదరాబాద్ రేసర్ అఖిల్ రవీంద్ర రెండో స్థానంతో రన్నరప్‌గా నిలిచాడు. 27 నిమిషాల 19.810 సెకన్లలో రేసును పూర్తిచేసిన అతడు తృటిలో అగ్రస్థానాన్ని కోల్పోయాడు. శ్రాచి బెంగాల్ టైగార్స్ డ్రైవర్ అలీస్టర్ యూంగ్.. 27 నిమిషాల 15.266 సెకన్లలో రేసును పూర్తిచేశాడు. గోవా ఏసెస్ జేఏ రేసింగ్ జట్టు డ్రైవర్ గాబ్రియెల్లా జిల్కోవా మూడో స్థానంలో నిలిచింది.

చెన్నై 'కమాల్'

చెన్నై: అల్టిమేట్ టేబుల్ టెన్నిస్ (యూటీటీ)-2024లో ఆతిథ్య చెన్నై లయన్స్ బోణీ కొట్టింది. ఆదివారం ఇక్కడి జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో 8-7తో దబాంగ్ ఢిల్లీని ఓడించింది. ఢిల్లీకి ఇది వరుసగా రెండో పరాభవం. పురుషుల సింగిల్స్‌లో చెన్నై లయన్స్ ప్యాడ్లర్ ఆచంట శరత్ కమల్ 2-1తో ఆండ్రీస్ లెవెంకొను ఓడించి తన జట్టుకు తొలి విజయాన్ని అందించాడు. ఆ తర్వాత సకురా మోరి, జుసెల్ రొలండ్ మిక్స్‌డ్ డబుల్స్‌లో శరత్, సకురా విజయాలు సాధించారు. బైస్య 0-3తో దియా చిటాలె చేతిలో ఓడిపోయింది.

వారెవ్వా బంగ్లా

పాకిస్థాన్‌పై తొలి టెస్టు గెలుపు • రావల్పిండిలో చారిత్రాత్మక విజయం

మెహిది హసన్, షకిబ్ స్పిన్ మాయాజాలం • ఆఖరి రోజు తడబడ్డ పాక్

'రికార్డులనేవి ఉన్నది బ్రేక్ చేయడానికే'.. పాకిస్థాన్‌తో రావల్పిండి వేదికగా జరిగిన తొలి టెస్టుకు ముందు పాత్రికేయులతో నిర్వహించిన సమావేశంలో బంగ్లాదేశ్ సారథి నజ్ముల్ హోసెన్ శాంతో చెప్పిన మాటలవి! కట్ చేస్తే సరిగ్గా ఐదు రోజుల తర్వాత అతడి మాటలే నిజమయ్యాయి. ఈ టెస్టుకు ముందు పాకిస్థాన్‌తో ఆడిన 13 టెస్టులకు గాను 12 మ్యాచ్‌లలోనూ బంగ్లాకు పరాభవమే. కానీ రావల్పిండిలో పర్యాటక జట్టు అద్భుతమే చేసింది. ఐదో రోజు ఆటలో క్రమశిక్షణతో కూడిన బౌలింగ్‌తో అనిశ్చితికి మారుపేరైన పాక్‌ను బోల్తా కొట్టించి చిరస్మరణీయ విజయాన్ని అందుకుంది. నాలుగు రోజులూ బ్యాటర్లకు అనుకూలించిన రావల్పిండి పిచ్ ఐదో రోజు అనూహ్యంగా 'మలుపు' తీసుకోవడంతో మ్యాచ్ పాక్ చేతుల నుంచి చేజారింది.



రావల్పిండి: పాకిస్థాన్ పర్యటనలో బంగ్లాదేశ్ క్రికెట్ జట్టు సరికొత్త చరిత్ర సృష్టించింది. గడిచిన రెండు నెలలుగా దేశంలో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా పోరాడి 'అధికార మార్పు' ఆందోళనలతో అతలాకుతలమైన అక్కడి ప్రజలకు కాస్త స్వాంతన చేకూర్చుతూ ఆ దేశ క్రికెట్ జట్టు పాకిస్థాన్‌పై చారిత్రాత్మక విజయాన్ని నమోదుచేసింది. రావల్పిండి వేదికగా పాకిస్థాన్‌తో జరిగిన తొలి టెస్టును 10 వికెట్ల తేడాతో గెలుచుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ తమ ఎదుట ఉంచిన 117 పరుగుల ఆధిక్యాన్ని తగ్గించి పర్యాటక జట్టుకు లక్ష్యాన్ని నిర్దేశించే క్రమంలో షాన్ మసూద్ సారథ్యంలోని పాక్.. 55.5 ఓవర్లలో 146 పరుగులకే చేతులెత్తేసింది. బంగ్లా స్పిన్ ద్వయం మెహిది హసన్ మిరాజ్ (4/21), షకిబ్ అల్ హసన్ (3/44) స్పిన్ మాయాజాలానికి పాక్ స్టార్ బ్యాటర్లంతా పెవిలియన్‌కు క్యూ కట్టారు. అనంతరం పాక్ నిర్దేశించిన 30 పరుగుల లక్ష్యాన్ని బంగ్లా ఓపెనర్లు వికెట్ నష్టపోకుండా పూర్తిచేసి ఆ జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించారు. బంగ్లా తరఫున తొలి ఇన్నింగ్స్‌లో భారీ శతకం చేసిన ముష్ఫికర్ రహీమ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది. 23 ఏండ్లుగా పాక్‌తో టెస్టులు ఆడుతున్న బంగ్లాకు ఇదే తొలి విజయం.

స్పిన్ తంత్రానికి కుదేలు..

23/1. ఐదో రోజు ఆట ప్రారంభానికి ముందు పాక్ స్కోరు అది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యానికి 94 పరుగులు వెనుకబడ్డ పాక్ అనూహ్యంగా తడబడింది. కెప్టెన్ మసూద్ (14)ను రెండో ఓవర్‌కే హసన్ మహ్మద్ ఔట్ చేసి పాక్ పతనానికి దారులు వేశాడు. డ్రింక్స్ విరామం తర్వాత నహిద్ రాణా బౌలింగ్‌లో బాబర్ ఆజమ్ (22), ఆ మరుసటి ఓవర్లోనే షకిబ్ బౌలింగ్‌లో సాద్ షకీల్ (0) స్టంపౌట్ అవడంతో పాక్ కష్టాలు రెట్టింపయ్యాయి. అదే ఊపులో షకిబ్.. షఫీక్ (37)ను పెవిలియన్‌కు పంపాడు. ఇక లంచ్‌కు రెండు ఓవర్ల ముందు మిరాజ్.. అఘా సల్మాన్ (0)నూ ఔట్ చేయడంతో పాక్ పీకల్లోతు కష్టాల్లో పడింది. లంచ్ తర్వాత మిరాజ్.. షహీన్ అఫ్రిది (2)ని వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. నసీమ్ షా (3)ను షకిబ్ ఔట్ చేశాడు. ఈ క్రమంలో పాక్ వికెట్ కీపర్ బ్యాటర్ మహ్మద్ రిజ్వాన్ (51) ఆ జట్టు వికెట్ల పతనాన్ని కాసేపు అడ్డుకున్నాడు. కానీ మిరాజ్ మరోసారి మాయ చేసి అతడిని క్లీన్ బౌల్డ్ చేయడంతో ఆ జట్టు ఆశలు అడుగంటాయి. ఇక స్వల్ప లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో జకీర్ హసన్ (15 నాటౌట్), ఇస్లాం (9 నాటౌట్) తడబాటు లేకుండా లాంఛనాన్ని పూర్తిచేశారు.

సంక్షిప్త స్కోర్లు

పాకిస్థాన్ తొలి ఇన్నింగ్స్: 448/6 డిక్లేర్ (రిజ్వాన్ 171, షకీల్ 141), **బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్:** 565 ఆలౌట్ (ముష్ఫికర్ 191, మిరాజ్ 77) **పాక్ రెండో ఇన్నింగ్స్:** 146 ఆలౌట్ (రిజ్వాన్ 51, మిరాజ్ 4/21, షకిబ్ 3/44) **బంగ్లా రెండో ఇన్నింగ్స్ :** 30/0 (జకీర్ 15 నాటౌట్)

1 **పాకిస్థాన్‌పై బంగ్లాదేశ్‌కు ఇదే తొలి టెస్టు (14 మ్యాచ్‌లలో) విజయం.**

పాక్‌ను స్వదేశం (టెస్టుల)లో 10 వికెట్ల తేడాతో ఓడించిన తొలి జట్టు బంగ్లా.

భువనగిరిలో అంతర్జాతీయ టెన్నిస్ క్రీడలు షురూ



యాదాద్రి భువనగిరి, ఆగస్టు 25 (నమస్తే తెలంగాణ): యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని న్యూడైమెన్షన్ టెన్నిస్ అకాడమీలో రాజ నర్సింహారావ్ మెమోరియల్ అంతర్జాతీయ జూనియర్స్ జె 6- అండర్-18 టెన్నిస్ క్రీడలు ఆదివారం అట్టహాసంగా మొదలయ్యాయి. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ఈ పోటీలను ప్రారంభించారు. వారం రోజుల పాటు నిర్వహించే ఈ పోటీలలో యూఎస్ఏ, ఆస్ట్రేలియా, కెనడా తదితర దేశాల నుంచి 17 మందికి పైగా క్రీడాకారులు పాల్గొననున్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా అంతర్జాతీయ ప్రమాణాలతో 8 కోర్టులను ఏర్పాటు చేయడం అభినందనీయమని కుంభం అన్నారు.

స్పోర్ట్స్ విలేజ్‌గా గచ్చిబౌలి

మారథాన్ అవార్డుల ప్రదానోత్సవంలో సీఎం



హైదరాబాద్, ఆగస్టు 25 (నమస్తే తెలంగాణ): రాబోయే రోజుల్లో గచ్చిబౌలిని స్పోర్ట్స్ విలేజ్‌గా తీర్చిదిద్దుతామని, అందుకు అనుగుణంగా అన్ని వసతులను కల్పిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ఎన్ఎండీసీ హైదరాబాద్ మారథాన్ 2024 బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని గచ్చిబౌలి స్టేడియంలో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి ముఖ్య అతిథిగా హాజరైన రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. క్రీడలను ప్రోత్సహించేందుకు తమ ప్రభుత్వం ఒక్కో అడుగు ముందుకు వేస్తున్నదని, తెలంగాణ యువతను క్రీడలవైపు మళ్లించేందుకు ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. గచ్చిబౌలిని స్పోర్ట్స్ విలేజ్‌గా తీర్చిదిద్దుతామని, ఒలింపిక్స్ లక్ష్యంగా తెలంగాణలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని వచ్చే అకడమిక్ ఇయర్‌లో ప్రారంభించబోతున్నామని చెప్పారు. అంతర్జాతీయ స్థాయి కోచ్‌లను తీసుకొచ్చి క్రీడాకారులకు శిక్షణ అందిస్తామని, ఒలింపిక్స్‌ను హైదరాబాద్‌లో నిర్వహించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో మన స్టేడియాలని తీర్చిదిద్దుతామని తెలిపారు. అనంతరం క్రీడాకారులకు బహుమతులను ప్రదానం చేశారు.

లవ్లీ హస్బెండ్ ప్రేమాట



వెంకటేశ్ ఫ్యామిలీ సినిమా చేస్తే హిట్ పక్కా. కాస్త విరామం తర్వాత ఆయన లవ్లీ హస్బెండ్‌గా కనిపించనున్నారు. అపజయం ఎరుగని అనిల్ రావిపూడి దర్శకత్వంలో ప్రతిష్ఠాత్మక శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు సమర్పణలో, శిరీష్ ఈ సినిమాని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం తాజా షెడ్యూల్ ప్రస్తుతం పొల్లాచ్చిలో జరుగుతున్నది. అక్కడి అందమైన ప్రదేశాల్లో వెంకటేశ్, ఐశ్వర్య రాజేష్‌లపై బ్యూటిఫుల్ మెలొడి సాంగ్‌ని దర్శకుడు అనిల్ రావిపూడి చిత్రీకరిస్తున్నారు. భాస్కరభట్ల రాసిన ఈ పాటను భీమ్స్ సిసిరోలియో స్వరపరిచారు. భార్యాభర్తల ప్రేమను తెలిపే ఉత్తమమైన పాటల్లో ఇది ఒకటిగా నిలుస్తుందని, సంగీతం, సాహిత్యంతోపాటు కొరియోగ్రాఫర్ భాను మాస్టర్ లవ్లీ డాన్స్ మూమెంట్స్ ఈ పాటకు హైలైట్‌గా నిలుస్తాయని మేకర్స్ చెబుతున్నారు. వెంకటేశ్ మాజీ పోలీసు అధికారిగా నటిస్తున్న ఈ చిత్రంలో ఆయన భార్యగా ఐశ్వర్య రాజేష్, మాజీ ప్రేయసిగా మీనాక్షి చౌదరి కనిపించనున్నారు. ఉపేంద్ర లిమాయే, రాజేంద్రప్రసాద్, సాయికుమార్, నరేశ్, తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సమీర్‌రెడ్డి.

చిత్రం



సెట్‌లోకి వస్తూనే ఎనర్జీని తెస్తారు

'పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా నటిస్తున్న సినిమా ద్వారా టాలీవుడ్‌కి పరిచయం అవుతున్నాను. ఆ ఫీలింగే చెప్పలేని సంతోషాన్నిస్తోంది' అంటూ సంబరపడిపోతున్నది అందాలభామ మాళవిక మోహనన్. ప్రభాస్, మారుతిల 'రాజా సాబ్' సినిమా ద్వారా మాళవిక టాలీవుడ్‌కి పరిచయమవుతున్న విషయం తెలిసిందే. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో 'రాజా సాబ్' సినిమా గురించి, ప్రభాస్ గురించి ఆసక్తికరంగా మాట్లాడింది మాళవిక. 'ప్రభాస్ పెక్యులర్ పర్సన్. సెట్‌లోకి వస్తూనే ఎనర్జీని తెస్తారు. పనిని భారంగా కాకుండా ఎంజాయ్ చేస్తూ చేస్తారు. అసలు పాన్ ఇండియా సూపర్‌స్టార్ అన్న గర్వం ఆయనలో ఏ మాత్రం కనిపించదు. అందరినీ ఆప్యాయంగా పలకరిస్తారు. ఆయన సినిమా ద్వారా టాలీవుడ్‌కి పరిచయం అవుతున్నందుకు చెప్పలేనంత ఆనందంగా ఉంది. ఈ సినిమా తప్పకుండా బ్లాక్‌బాస్టర్ అవుతుంది' అంటూ చెప్పుకొచ్చింది మాళవిక మోహనన్.

తాజాగా ఈ మలయాళ మందారం.. విక్రమ్ 'తంగలాన్'లో ఆరతి పాత్రలో తళుక్కున మెరిసింది. ప్రేక్షకుల నుంచి కూడా మంచి మార్కులే సొంతం చేసుకుంది.

ఏడాదిపాటు నిరవధికంగా



'కల్కి 2898ఏడీ'తో బాక్సాఫీస్ రికార్డులను బద్దలు కొట్టేశాడు ప్రభాస్. ఓటీటీలో కూడా 'కల్కి' చేస్తున్న హంగామా మామూలుగా లేదు. త్వరలో ప్రభాస్ నుంచి మరిన్ని అద్భుతాలు రానున్నాయి. వాటిల్లో ఒకటి 'స్పిరిట్'. సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వం వహించనున్న ఈ సినిమా విషయంలో ఓ తాజా అప్‌డేట్ వెలుగు చూసింది. 'స్పిరిట్' షూటింగ్‌ని వచ్చే ఏడాది జనవరి నుంచి మొదలుపెట్టనున్నారట సందీప్‌రెడ్డి. ఈ లోపు ప్రభాస్ తన ఇతర ప్రాజెక్టులు పూర్తి చేసుకుంటారు. పాన్ ఆసియా లెవల్లో తెరకెక్కనున్న 'స్పిరిట్' షూటింగ్‌ని నిరవధికంగా ఏడాది పాటు ప్లాన్ చేశారట సందీప్‌రెడ్డి. 2026 జనవరిలో సినిమాను విడుదల చేసేందుకు ఆయన కసరత్తులు చేస్తున్నట్టు తెలుస్తున్నది. ఇందులో ప్రభాస్ పవర్‌ఫుల్ పోలీస్ పాత్రలో నటించనున్నారు. త్రిష కథానాయికగా ఎంపికైనట్టు వార్తలు వస్తున్నాయి. మొత్తానికి సందీప్ సాలిడ్ ప్లానింగ్‌తోనే ఉన్నాడని చెప్పొచ్చు.

సారంగపాణి జాతకం



శ్రీదేవి మూవీస్ అధినేత శివలెంక కృష్ణప్రసాద్, దర్శకుడు ఇంద్రగంటి మోహనకృష్ణ కలయికలో ఇదివరకే జెంటిల్‌మెన్, సమ్మోహనం వంటి ఎంటర్‌టైనర్స్ వచ్చాయి. తాజాగా వీరిద్దరి కాంబినేషన్‌లో ప్రియదర్శి కథానాయకుడిగా ఓ చిత్రం రూపొందుతున్నది. ఈ సినిమాకు 'సారంగపాణి జాతకం' అనే టైటిల్ ఖరారు చేయగా, ఆదివారం ఈ టైటిల్‌తోపాటు ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. 'మనిషి భవిష్యత్తు అతని చేతి రేఖల్లో ఉంటుందా? లేక అతని చేతల్లో ఉంటుందా? అనే ప్రశ్నకు సమాధానం ఇచ్చే పరిపూర్ణ హాస్యరసచిత్రమిది. ఇంద్రగంటి అద్భుతమైన కథ రాసుకున్నారు. సాంకేతికంగా సినిమా ఉన్నతస్థాయిలో ఉంటుంది. 90శాతం చిత్రీకరణ పూర్తయింది. నేటి నుంచి సెప్టెంబర్ 5 వరకు జరిగే షూటింగ్‌లో రెండు పాటలు, మిగతా సన్నివేశాలు చిత్రీకరిస్తాం. దీంతో షూటింగ్ కంప్లీట్ అవుతుంది.' అని శివలెంక కృష్ణప్రసాద్ తెలిపారు. ఇంద్రగంటి మోహనకృష్ణ మాట్లాడుతూ 'నమ్మకం మనిషికి బలాన్నిస్తుంది. మూఢనమ్మకం బుద్ధిహీనుడ్ని చేస్తుంది. అలా నవ్వులపాలైన ఓ మధ్యతరగతి మంచి అబ్బాయి కథే మా 'సారంగపాణి జాతకం'. వినోదంతోపాటు భావోద్వేగాలను కూడా ప్రియదర్శి చక్కగా పండించాడు. కుటుంబసమేతంగా చూడాల్సిన సినిమా ఇది' అని పేర్కొన్నారు. రూప కొడువాయూర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో నరేశ్, తనికెళ్లభరణి, అవసరాల శ్రీనివాస్, వెన్నెల కిశోర్, వైవా హర్ష తదితరులు ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: పీజీ విందా, సంగీతం: వివేక్ సాగర్.

భావోద్వేగాల మేళవింపు



నివేతా థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజ్ ప్రధాన పాత్రధారులుగా రూపొందుతోన్న విభిన్నమైన ఫ్యామిలీ డ్రామా '35-చిన్న కథ కాదు'. నందకిశోర్ ఈమని దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి రానా దగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మాతలు. ఈ సినిమాను సెప్టెంబర్ 6న విడుదల చేయనున్నట్టు ఆదివారం మేకర్స్ ఓ ప్రకటన విడుదల చేశారు. తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో ఒకేసారి ఈ సినిమా విడుదల కానుంది. 'ఇది ప్రేక్షకులకు మంచి అనుభూతిని పంచే సినిమా. ఎంపిక చేసిన కొద్ది మందికి ఈ సినిమాను ప్రదర్శించగా అందరూ పాజిటివ్‌గా స్పందించారు. గ్రామీణ నేపథ్యంలో రూపొందిన ఈ సినిమాలో కామెడీ, ఎమోషన్స్ అన్నీ సమపాళ్లలో ఉంటాయి.' అని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: నికేత్ బొమ్మి, సంగీతం: వివేక్ సాగర్, నిర్మాణం: సురేశ్ ప్రొడక్షన్స్, ఎస్ ఒరిజినల్స్ వాల్టెయిర్ ప్రొడక్షన్స్.

టీఎఫ్ఈఎఫ్ కార్యదర్శిగా అమ్మిరాజు కాసుమిల్లి




తెలుగు సినిమా 24 శాఖలకు చెందిన ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా అమ్మిరాజు కాసుమల్లి విజయం సాధించారు. ఆదివారం జరిగిన కార్యదర్శి ఎన్నికల్లో అమ్మిరాజు 35 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. ఇంతకు ముందు ఈ పదవిలో దొరై ఉండేవారు. ఇటీవలే జరిగిన మేనేజర్స్ ఎన్నికల్లో దొరై ఓటమిపాలయ్యారు. నిబంధల ప్రకారం ఆయన ఫెడరేషన్ పోస్ట్‌కు అనర్హుడు కావడంతో ఈ పోస్ట్‌కు ఎన్నికలు అనివార్యమయ్యాయని కమిటీ పేర్కొన్నది. ఫెడరేషన్ అధ్యక్షునిగా అనిల్ వల్లభనేని, కోశాధికారిగా సురేశ్ ఇప్పటికే బాధ్యతల్లో ఉండగా, ఇప్పుడు కార్యదర్శిగా అమ్మిరాజు బాధ్యతను స్వీకరించారు. అమ్మిరాజు కార్యదర్శిగా ఎంపిక కావడంపట్ల ఫెడరేషన్ సంతోషం వెలిబుచ్చింది. కార్యదర్శిగా తనను ఎన్నుకున్న సభ్యులకు అమ్మిరాజు కృతజ్ఞతలు తెలిపారు.

సెప్టెంబర్ 8న తెలంగాణ ఫిల్మ్‌ఛాంబర్ ఎన్నికలు



తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ కార్యవర్గం రెండేళ్ల పదవీకాలం పూర్తయినందున, సెప్టెంబర్ 8న నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోడానికి ఎన్నికలు నిర్వహించాలని ఛాంబర్ సభ్యులు నిర్ణయించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఫిల్మ్‌ఛాంబర్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణగౌడ్ మాట్లాడుతూ 'తెలంగాణ ఫిల్మ్‌ఛాంబర్ స్థాపించి 14ఏడ్లయింది. వెయ్యి మంది నిర్మాతలతోపాటు 24 శాఖలకు చెందిన 16వేలమంది ఈ ఛాంబర్‌లో సభ్యులుగా ఉన్నారు. ఇప్పటికే సభ్యులందరికీ ఇన్సూరెన్స్, సభ్యుల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నాం. సభ్యుల సంక్షేమమే ధ్యేయంగా ముందుకెళ్తున్నాం. ప్రస్తుతం ఉన్న ఛాంబర్ పాలకవర్గ పదవీకాలం పూర్తయింది. కావున ఎన్నికలకు వెళ్తున్నాం. సెప్టెంబర్ 1 నుంచి నామినేషన్ల ప్రక్రియ మొదలవుతుంది. సెప్టెంబర్ 8న ఎన్నికలు నిర్వహిస్తాం. సభ్యులందరూ తప్పకుండా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలి.' అని కోరారు.

మార్కండేయుని వేట మొదలైంది



తేజస్ వీరమాచినేని, అక్షయ రోమి జంటగా నటిస్తున్న చిత్రం 'రాజా మార్కండేయ'. 'వేట మొదలైంది' ఉపశీర్షిక. బన్నీ అశ్వంత్ దర్శకుడు. శ్రీధర్ సామా, వెంకట్ గౌడ్ పంజాల కలిసి ఈచిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా టైటిల్ లోగో ఆవిష్కరణ ఆదివారం హైదరాబాద్‌లో జరిగింది. ప్రముఖ నటుడు సుమన్, నిర్మాతలు ప్రతాని రామకృష్ణగౌడ్, తుమ్మలపల్లి రామసత్యనారాయణ, వైశ్య ప్రముఖులు ఉప్పల శ్రీనివాస్ గుప్తా ఇంకా గంగపురం పద్మగౌడ్, నవీన్ మాచర్ల అతిథులుగా విచ్చేసి చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. 90శాతం ఈ సినిమా చిత్రీకరణ పూర్తయిందని, అందరికీ మంచి పేరు తెచ్చే సినిమా అవుతుందని, త్వరలోనే సినిమాను విడుదల చేస్తామని దర్శక, నిర్మాతలు తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: సాయి.

నాన్‌స్టాప్‌గా నవ్విస్తుంది



చిమటా రమేశ్‌బాబు స్వీయ దర్శకత్వంలో హీరో నటించిన చిత్రం 'నేను-కీర్తన'. రిషిత, మేఘన హీరోయిన్లు. చిమటా జ్యోతిర్మయి సమర్పణలో చిమటా లక్ష్మీకుమారి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 30న విడుదల కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు, కథానాయకుడు చిమటా రమేశ్‌బాబు, కథానాయిక రిషిత ఆదివారం మీడియాతో ముచ్చటించారు. ఇది దర్శకుడిగా, కథానాయకుడిగా తనకు మంచి పేరు తెచ్చే సినిమా అవుతుందని, ఇందులో కథానాయికగా నటించిన రిషితకు ఉజ్వలమైన భవిష్యత్తు ఉందని, రెండున్నర గంటలపాటు నాన్‌స్టాప్‌గా ఎంటర్‌టైన్ చేసే సినిమా ఇదని చిమటా రమేశ్‌బాబు తెలిపారు. 'నేను-కీర్తన' సినిమా హీరోయిన్‌గా తన కెరీర్‌కి శుభారంభం ఇస్తుందనే నమ్మకంతో ఉన్నానని కథానాయిక రిషిత చెప్పారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.